


# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు

# స్వర్ణ కుప్పానికి నాంది



- ఉద్యోగాల కోసం వలసలు పోకూడదు
- రూ.9,320 కోట్లతో ప్రాజెక్టులకు శ్రీకారం
- ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతాం
- త్వరలో గోల్డ్ ఫీల్డ్స్ అందుబాటులోకి తెస్తాం
- రెండోరోజు పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- బస్‌స్టేషన్, డిపో నిర్మాణాలకు శంకుస్థాపన

*కుప్పం నుంచి ఉద్యోగాల కోసం మరోచోటుకు వెళ్లే పరిస్థితు లు రాకూడదు..ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడకు రావాలి.. అందుకే కుప్పం చరిత్ర మార్చే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. కుప్పం నియోజకవర్గంలో రెండోరోజు పర్యటనలో భాగంగా రూ.117 కోట్లతో ఆధునాతన బస్‌స్టేషన్, డిపో నిర్మాణాలకు శంకుస్థాపన చేసి పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. కుప్పం నియోజకవర్గంలో రూ. 9,320 కోట్లతో 30 ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవా లు చేశాం. ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతాం. స్వర్ణ కుప్పం కావాలనేది నా ఆకాంక్ష. త్వరలో కుప్పంలో గోల్డ్ ఫీల్డ్స్ అందుబా టులోకి తెస్తాం.. బంగారం ఉత్పత్తి చేసి స్వర్ణ కుప్పానికి నాంది పలుకుతామని స్పష్టం చేశారు.*

2

## సంజీవనిలో డేటా అనుసంధానం కీలకం



- ప్రతి అంశాన్ని నమోదు చేయాలి
- ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం
- కుప్పం ఏరియా ప్రభుత్వ ఆస్పత్రిలో సీటీ స్కాన్, డయాలసిస్ సేవల ప్రారంభం

4

సంజీవని కార్యక్రమంలో డేటా అనుసంధానమే కీలకమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. హెల్త్ రికార్డుల డిజిటలైజేషన్ నుంచి ఆస్పత్రి పరిశుభ్రత వరకు ప్రతి అంశాన్ని నమోదు చేయాలని స్పష్టమైన ఆదేశాలిచ్చారు. కుప్పం ప్రాంతీయ ఆస్పత్రిలో సీటీ స్కాన్, డయాలసిస్ కేంద్రాలను శనివారం ఆయన ప్రారంభించి సేవలను పరిశీలించారు. సంజీవని ప్రాజెక్టు ద్వారా కుప్పంలో ప్రజలకు ఏ మేరకు మేలు కలిగిందో వివరాల ను సిద్ధం చేయాలని ఆదేశించారు.






## 61 ఏళ్ల కంగుంది భూ సమస్యకు చెక్

- ప్రభుత్వ సామాజిక న్యాయానికి నిదర్శనం
- ఏడాదిలో రాష్ట్రంలో భూ వివాదాలు పరిష్కరిస్తాం
- పట్టాల పంపిణీలో ముఖ్యమంత్రి చంద్రబాబు

5

*ఆరు దశాబ్దాలుగా భూమి కోసం ఎదురుచూస్తున్న కంగుంది గ్రామంలోని 322 కుటుంబాల నిరీక్షణకు ముఖ్యమంత్రి చంద్ర బాబు తెరదించారు. డీకేటీ పట్టాల పంపిణీ కార్యక్రమంలో 460.19 ఎకరాల భూమికి సంబంధించిన పట్టాలను 322 మంది లబ్ధిదారులకు అందజేశారు. రైతుల పక్షాన న్యాయం ఉండటంతోనే ఈ సమస్యను పరిష్కరించగలిగామని తెలిపారు. సామాజిక న్యాయంపై ప్రభుత్వ నిబద్ధతకు ఇది నిదర్శనమని చెప్పారు. కంగుంది కోట సాక్షిగా రైతులకు పట్టాలు అందించడం సంతోషంగా ఉందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న భూ వివాదాలను మరో ఏడాదిలో పరిష్కరిస్తామని స్పష్టం చేశారు.*



## రాష్ట్రానికి ఆదర్శంగా నలగంపల్లి నెట్ జీరో విధానం

*నెట్ జీరో విధానాన్ని విజయవంతంగా అమలు చేస్తున్న నలగంపల్లి గ్రామాన్ని రాష్ట్రానికి ఆదర్శంగా నిలబెట్టాలని ముఖ్య మంత్రి చంద్రబాబు సూచించారు. కుప్పం పర్యటనలో భాగంగా శనివారం నలగంపల్లిలోని నెట్ జీరో విధానాన్ని అమలు చేస్తున్న ఇళ్లను సందర్శించారు. నలగంపల్లి నమూనాను కేస్ స్టడీగా తీసుకుని కుప్పం వ్యాప్తంగా నెట్‌జీరో విధానాన్ని విస్తరించాలని అధికారులను ఆదేశించారు.*

- గ్రామాన్ని కేస్ స్టడీగా తీసుకోవాలి
- కుప్పం వ్యాప్తంగా అమలు చేయాలి
- ప్రజల విద్యుత్ వ్యయాన్ని తగ్గించాలి
- సీఎం చంద్రబాబు ఆదేశం

3

## దక్షిణకొరియా నుంచి లోకేష్‌కు ఆహ్వానం



- నేటి నుంచి వారంరోజుల పర్యటన
- ద్వైపాక్షిక సంబంధాల బలోపేతమే లక్ష్యం
- అధికారిక సమావేశాలు, పెట్టుబడులపై చర్చలు

9

## కుప్పంలో ఫుడ్ స్ట్రీట్ ప్లాజా



ఏరియా అథారిటీ అతిథిగృహం ప్రారంభం కార్యక్రమాల్లో పాల్గొన్న సీఎం చంద్రబాబు

7

## గడువులోగా జలధార పనులు

- ఉత్తమ విధానాలపై డాక్యుమెంటేషన్‌కు చర్యలు
- జలహారతి పూర్తి అయ్యాక నివేదిక ఇవ్వాలి
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు

6



## విశాఖలో కయాకింగ్ - కనోయింగ్ లీగ్

విశాఖ గంభీరం జలాశయంలో శనివారం అస్మితా సౌత్ జోన్ మహిళల కయాకింగ్ – కనోయింగ్ లీగ్ ప్రారంభమైంది.
ఈ పోటీలకు ఎంపీ శ్రీభరత్ ప్రారంభించారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ రవినాయుడు, వివిధ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు.








# అభివృద్ధి కార్యక్రమాలతో

# స్వర్ణ కుప్పానికి నాంది

- ఉద్యోగాల కోసం వలసలు పోకూడదు
- రూ.9,320 కోట్లతో ప్రాజెక్టులకు శ్రీకారం
- లక్ష కోట్లతో హార్టికల్చర్ హబ్ ఏర్పాటు చేస్తాం
- ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతాం
- త్వరలో గోల్డ్ ఫీల్డ్స్ అందుబాటులోకి తెస్తాం
- రెండోరోజు పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- బస్‌స్టేషన్, డిపో నిర్మాణాలకు శంకుస్థాపన




కుప్పం(చైతన్యరథం): అభివృద్ధి కార్యక్రమాలు స్వర్ణ కుప్పాని కి నాంది పలుకుతాయని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. రాయ లసీమలో రూ.లక్ష కోట్లతో హార్టికల్చర్ హబ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో ప్రైవేటు రంగం వాటా రూ.60 వేల కోట్లు కాగా.. ప్రభుత్వం రూ.40 వేల కోట్ల పెట్టుబడి పెడుతున్నట్లు చెప్పారు. కుప్పం నియోజకవర్గంలో రెండోరోజు శనివారం ఆయన పర్యటించారు. రూ.117 కోట్లతో ఆధునాతన బస్‌స్టేషన్, డిపో నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ కుప్పం చరిత్ర మార్చే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఈ అభివృద్ధి కార్యక్రమాలు స్వర్ణ కుప్పానికి నాంది పలుకుతాయన్నారు. ఇతర ప్రాంతాల నుంచి ఉద్యోగాల కోసం ఇక్కడికి రావాలి. కుప్పం నుంచి మరోచోటుకు వెళ్లే పరిస్థితులు రాకూడదు. రూ.9,320 కోట్లతో 30 ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారం భోత్సవాలు చేశాం. వ్యవసాయంలో సెరీ కల్చర్ దిశగా ముందుకు సాగుతున్నాం. కుప్పం నియోజకవర్గంలో పూర్తిగా వాణిజ్య పంటలు చేపట్టాలి. ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దాలి. తాజా కూరగాయలు ఇంటిపైనే పండించుకునే ఏర్పాటు చేసుకోవాలి. స్కూటర్లు, కార్లు, ట్రాక్టర్లు అన్నీ విద్యుత్ నడిచే పరిస్థితులు రావా లి. పెట్రోల్, డీజిల్ బాయ్ కాట్ చేసి విద్యుత్ వాహనాలు వాడుదాం. రాబోయే రోజుల్లో ఆర్టీసీ బస్సులకు అవసరమైన విద్యుత్ సోలార్ ద్వారా ఆర్టీసీనే తయారు చేసుకుంటుంది. వంద ల మంది పౌల్ట్రీ రైతులకు చేయూతనిస్తాం. నియోజకవర్గం నుంచి పారిశ్రా మికవేత్తలుగా మారేందుకు నాంది పలుకుదాం. ఆడిడాస్ పరిశ్రమ ద్వారా 20 వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తా యి. డెయిరీ, ఫుడ్ ప్రాసెసింగ్, పార్టీ పరిశ్రమలు వచ్చాయి. 10 లక్షల లీటర్ల పాల ఉత్పత్తి స్థాయికి కుప్పం చేరుతుంది. సంఘాల ద్వారా గడ్డి పెంచి కమ్యూనిటీ ఫోరమ్‌ల ద్వారా సరఫరా చేస్తాం. ప్రపంచవ్యాప్తంగా మారిన ఆహారపు అలవాట్ల మేరకు పంటలు రావాలి. మైక్రో ఇరిగేషన్ రాష్ట్రానికి శ్రీరామరక్షగా మారింది. కృష్ణా, గోదావరి సహా ఏ రిజర్వాయర్లోకి ఇప్పటికీ నీరు రాలేదు. పర్యావరణం కాపాడుకున్న చోటే సమతుల్యం ఉంటుంది. ప్రపం చంలోని మెడికల్ నాలెడ్జ్‌ను ప్రజల ఇళ్ల వద్దకు చేర్చుతాం. స్వర్ణ కుప్పం కావాలనేది నా ఆకాంక్ష. స్వర్ణయుగానికి నాంది స్వర్ణ కుప్పం. కుప్పంలో కూడా బంగారు గనులు ఉన్నాయని చెబుతు న్నారు.. టెక్నాలజీని వినియోగిస్తాం.. త్వరలో కుప్పంలో గోల్డ్ ఫీల్డ్స్ అందుబాటులోకి తెస్తాం.. త్వరలో కుప్పంలో బంగారం ఉత్పత్తి చేసి స్వర్ణ కుప్పానికి నాంది పలుకుతామని స్పష్టం చేశారు.







# రాష్ట్రానికి ఆదర్శంగా నలగంపల్లి నెట్ జీరో విధానం



- **కుప్పం అంతటా అమలుకు సీఎం చంద్రబాబు ఆదేశం**
- **నెట్‌జీరో విధానాన్ని అమలు చేస్తున్న ఇళ్ల పరిశీలన**

కుప్పం (చైతన్యరథం): నెట్ జీరో విధానాన్ని విజయవంతంగా అమలు చేస్తున్న నలగంపల్లి గ్రామాన్ని రాష్ట్రానికి ఆదర్శంగా నిలబెట్టాలని సీఎం నారా చంద్రబాబునాయుడు అధికారులకు సూచించారు. కుప్పం పర్యటనలో రెండో రోజైన శనివారం నలగంపల్లిలోని నెట్ జీరో విధానాన్ని అమలు చేస్తున్న ఇళ్లను సీఎం సందర్శించారు. సోలార్ రూఫ్‌టాప్ సోలార్, ఇండక్షన్ కుక్‌టాప్‌లు, వర్షపు నీటి సంరక్షణ, కిచెన్ కంపోస్టింగ్, టెర్రస్ గార్డెనింగ్ వంటి విధానాలను పరిశీలించారు. నలగంపల్లి నమూ నాను కేస్ స్టడీగా తీసుకుని కుప్పం వ్యాప్తంగా నెట్‌జీరో విధానా న్ని విస్తరించాలని అధికారులను ఆదేశించారు.

### సర్క్యులర్ ఎకానమీ గ్రామస్థాయిలో అమలు

నలగంపల్లిలో ఓ ఇంటిని సందర్శించిన ముఖ్యమంత్రి చంద్రబాబు సోలార్ ప్యానెళ్ల సంఖ్య, విద్యుత్ ఉత్పత్తి, ఇంటి అవసరాలకు సరిపోతుందా అనే విషయాలను అడిగి తెలుసుకు న్నారు. సోలార్ విద్యుత్‌తో ఇండక్షన్ స్టవ్‌లను ఉపయోగిస్తూ నెలకు సుమారు రూ.400 వరకు ఆదా చేస్తున్నామని లబ్ధిదారులు వివరించారు. వర్షపు నీటి సంరక్షణ, కిచెన్ కంపోస్ట్ ద్వారా వ్యర్థాల నిర్వహణ, కిచెన్ గార్డెన్, టెర్రస్ గార్డెన్ నిర్వహణను కూడా సీఎం పరిశీలించారు. నెట్ జీరో విధానం లో భాగంగా ఈవీ వాహనాల వినియోగం చేర్చాలని సీఎం సూచించారు. సర్క్యులర్ ఎకానమీని గ్రామస్థాయిలో అమలు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. నలగంపల్లి అనుసరిస్తున్న విధానం రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు.

### ఇండక్షన్‌తో భద్రత

ఇండక్షన్ స్టవ్‌లతో ప్రస్తుతం అన్ని రకాల వంటలు చేసుకునే సాంకేతికత అందుబాటులోకి వచ్చిందని ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్రంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు ఇప్పటికే ఇండక్షన్ స్టవ్‌లను పంపిణీ చేస్తున్నామని చెప్పారు. గ్యాస్ లీకేజీ ప్రమాదా లు తగ్గడంతో పాటు భద్రత పెరుగుతుందని గ్రామస్తులు సీఎంకు వివరించారు. కుప్పంలో రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థ విస్తరణ ద్వారా 7,489 మంది ఎస్సీ, ఎస్టీలు, 39,215 మంది బీసీలు, 7,381 మంది ఓసీ కుటుంబాలకు ప్రయోజనం చేకూరేలా చర్యలు చేపడుతున్నట్టు సీఎంకు అధికారులు వివరించారు. ఈ విధానాన్ని కుప్పం అంతటా విస్తరించి ప్రజల విద్యుత్ వ్యయాన్ని తగ్గిస్తూ పర్యావరణ పరిరక్షణకు దోహదపడేలా చర్యలు తీసు కోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.












# సంజీవనిలో డేటా ఇంటిగ్రేషన్ కీలకం

- **ప్రతి అంశాన్ని అనుసంధానం చేయాలి**
- **డ్రగ్స్, గంజాయిలపై ఉక్కుపాదం మోపాలి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం**
- **కుప్పం ఏరియా ప్రభుత్వ ఆస్పత్రిలో సీటీ స్కాన్, డయాలసిస్ సేవల ప్రారంభం**
- **పంచతత్వ కాన్సెప్ట్‌తో ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్ పరిశీలన**





కుప్పం (చైతన్యరథం): సంజీవని కార్యక్రమంలో డేటా అను సంధానమే కీలకమని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. హెల్త్ రికార్డుల డిజిటలైజేషన్ నుంచి ఆస్పత్రి పరిశుభ్రత వరకు ప్రతి అంశంపైనా అధికారులకు స్పష్టమైన ఆదేశాలిచ్చారు. కుప్పం నియోజకవర్గ పర్యటనలో రెండో రోజైన శనివారం ఆయ న కుప్పం ప్రాంతీయ ఆస్పత్రిలో సీటీ స్కాన్, డయాలసిస్ కేంద్రా లను ప్రారంభించి సేవలను పరిశీలించారు. సంజీవని ప్రాజెక్టు అమలు, వైద్య ఆరోగ్య రంగంలో ఆవిష్కరణలు, డ్రగ్స్ నివారణ చర్యలపై అధికారులతో మాట్లాడారు. కుప్పం ఏరియా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన సీటీ స్కాన్, డయాలసిస్ సెంటర్లను ప్రారంభిం చారు. సీటీ స్కాన్ ద్వారా రోజుకు ఎంతమందికి సేవలు అందిం చగలరని సీఎం ప్రశ్నించారు. రోజుకు 30-40 మందికి పరీక్షలు చేసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఆస్పత్రి పరిశీలన సందర్భంగా ఆవరణలో కొంతమేర చెత్త కనిపించడంపై ప్రశ్నించి న ముఖ్యమంత్రి వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఆదే శించారు. సంజీవని కార్యక్రమంలో డేటా అనుసంధానమే ముఖ్య మని పేర్కొన్నారు. హెల్త్ రికార్డులను డిజిటలైజ్ చేయడంతో పాటు ప్రతి అంశంలోనూ డేటా ఇంటిగ్రేషన్ చేయాలని సూచిం చారు. పొరుగు రాష్ట్రాల నుంచి కూడా కుప్పం ఏరియా ఆస్పత్రికి డయాలసిస్ నిమిత్తం వస్తున్నారని అధికారులు వివరించారు. సంజీవని ప్రాజెక్టు ద్వారా ప్రజలు సంతృప్తి చెందాలని, కుప్పంలో ప్రజలకు ఏ మేరకు మేలు కలిగిందో వివరాలను సిద్ధం చేయాలని ఆదేశించారు.

## గంజాయి నియంత్రణకు కఠిన చర్యలు

పంచతత్వ కాన్సెప్ట్‌తో ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్‌ను సీఎం చంద్రబాబు పరిశీలించి అక్కడ మొక్క నాటారు. వైద్య ఆరోగ్య రం గంలో వివిధ ఆవిష్కరణలతో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను సంద ర్శించారు. రోడ్డు ప్రమాదాల సమయంలో వైద్యులకు తక్షణ సమా చారం అందించేలా ఓ పరికరాన్ని రూపొందించిన విద్యార్థిని అభినందించారు. గంజాయి, డ్రగ్స్ బారిన పడ్డవారికి మెడిటేషన్ ద్వారా ఆరోగ్యం మెరుగయ్యేందుకు సహకారం అందిస్తున్నట్టు బ్రహ్మకుమారీలు వివరించారు. డ్రగ్స్, గంజాయి మొదలైన వాటి నివారణకు కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు ఉన్నతాధికారు లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అనంతరం కుప్పం నగరంలో ఏర్పాటు చేసిన స్వర్ణ కుప్పం-స్వచ్ఛ కుప్పం స్వాగత ఆర్చిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.








చైతన్యరథం

# 61 ఏళ్ల కంగుంది భూ సమస్యకు చెక్



- ప్రభుత్వ సామాజిక న్యాయానికి నిదర్శనం
- ఏడాదిలో రాష్ట్రంలో భూ వివాదాలు పరిష్కరిస్తాం
- పట్టాల పంపిణీలో ముఖ్యమంత్రి చంద్రబాబు





కుప్పం (చైతన్యరథం): ఆరు దశాబ్దాలుగా భూమి కోసం ఎదురుచూస్తున్న కంగుంది గ్రామంలోని 322 కుటుంబాల నిరీక్షణకు ముఖ్యమంత్రి చంద్రబాబు తెరదించారు. తరతరాలుగా సాగు చేస్తున్న భూములకు అధికారిక హక్కు పత్రాలు అందుకోవడంతో లబ్ధిదారుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. కుప్పం నియోజకవర్గంలోని కంగుందిలో నిర్వహించిన డీకేటీ పట్టాల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు 460.19 ఎకరాల భూమికి సంబంధించిన పట్టాలను 322 మంది లబ్ధిదా రులకు అందజేశారు. పట్టాల పంపిణీకి సంబంధించి శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 61 సంవత్సరాలుగా పరిష్కారం కాకుండా గ్రామస్థు లను వేధిస్తున్న భూ సమస్యను సమగ్ర రికార్డుల పరిశీలన, వివిధ కోణాల్లో అధ్యయనం చేసి పరిష్కరించినట్లు తెలిపారు. అడవి పోరంబోకు భూమిని అసైన్డ్ వేస్ట్ డ్రై భూమిగా మార్చేందుకు క్యాబినెట్ ఆమోదం తీసుకుని రైతులకు భూములు అందించినట్లు చెప్పారు.

### పేదలకు పట్టాల పంపిణీ సంతోషంగా ఉంది

రైతుల పక్షాన న్యాయం ఉండటంతోనే ఈ సమస్యను పరిష్కరించగలిగామని తెలిపారు. 322 మంది రైతులకు 460.19 ఎకరాల భూమిని పట్టాల రూపంలో ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉందని సంతోషం వ్యక్తం చేశారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాల పట్ల ప్రభుత్వ నిబద్ధతకు ఇది నిదర్శనమని చెప్పారు. కంగుంది కోట సాక్షిగా రైతులకు పట్టాలు అందించడం సంతోషం గా ఉందని తెలిపారు. రాష్ట్రంలో అనేక రెవెన్యూ, భూ సమస్యలు ఉన్నాయని, ఇటీవల శెట్టిపల్లి భూ సమస్యను పరిష్కరించడం ద్వారా ప్రభుత్వానికి 90 ఎకరాల భూమి దక్కడంతో పాటు రైతు లకు కూడా న్యాయం జరిగిందని వివరించారు. వట్టిచెరుకూరు గ్రామంలో వందల ఏళ్లుగా కొనసాగుతున్న భూ సమస్యను కూడా పరిష్కరించామని, ఇప్పుడు కంగుంది సమస్యకు కూడా శాశ్వత పరిష్కారం చూపినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న భూ వివాదాల పరిష్కారానికి మరో ఏడాది సమయం పట్టే అవకాశముందని పేర్కొన్నారు.

### గూండాయిజానికి తావులేదు

గత ప్రభుత్వ హయాంలో అనేక భూ వివాదాలు సృష్టించారు. ప్రజల పట్టాదార్ పాసుపుస్తకాలపై గత పాలక పార్టీ నేతల ఫోటో లు ముద్రించారు. వాటిని తొలగించి రాజముద్రతో కొత్త పట్టాదా రు పాస్ పుస్తకాలు అందజేశాం. భూ వివాదాల పరిష్కారంలో ఓపికతో వ్యవహరించి అన్ని రికార్డులను పరిశీలించాల్సిన అవస రం ఉంది. ప్రజల భూములకు భద్రత కల్పించేందుకు సాంకేతి కతను వినియోగిస్తున్నామని తెలిపారు. కుటుంబ ఆస్తి వివాదాల కారణంగా కూడా అనేక భూములు వివాదాస్పదమవుతున్నాయని , తల్లిదండ్రులు, సోదరీమణుల హక్కులను గౌరవించాలని సూచించారు. రౌడీయిజం, గుండాయిజానికి రాష్ట్రంలో తావులేద ని స్పష్టం చేశారు. పెట్టుబడులు ఆకర్షిస్తూ పరిశ్రమలు తీసుకొస్తున్నామని, కుప్పంలోనే ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. భవిష్యత్తులో కుప్పాన్ని టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేసి మరిన్ని ఉద్యోగ అవకాశాలు సృష్టిస్తామని తెలిపారు.

### అభివృద్ధిని ఆపలేరు..అడ్డుకోలేరు

కుప్పం ప్రజలంతా సోలార్ విద్యుత్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పెట్రోల్, డీజిల్ వినియోగం బదులు సోలార్ విద్యు త్ ఉత్పత్తి ద్వారా ఈ సైకిళ్లు, ఈ వెహికల్స్ వినియోగం పెంచాలని సూచించారు. నెట్ జీరో విధానంలో స్వచ్ఛ కుప్పం-స్వర్ణ కుప్పం సాధించాలని పిలుపునిచ్చారు. డ్వాక్రా మహిళలను పారిశ్రామిక వేత్తలుగా ప్రోత్సహిస్తున్నామని.. ఇప్పటికే 1.50 లక్షల మందిని పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దామని వివరించారు. డ్వాక్రా మహి ళా ఉత్పత్తుల కోసం స్వయం బ్రాండ్ ఏర్పాటు చేశాం. దీని ద్వారా అంతర్జాతీయ స్థాయికి డ్వాక్రా ఉత్పత్తులకు మార్కెటింగ్ వచ్చేలా చేస్తామని స్పష్టం చేశారు.

కుప్పం పొగురుపల్లిలో రూ.9,322 కోట్ల పెట్టుబడులకు సంబంధించిన 30 ప్రాజెక్టుల అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నట్టు తెలిపారు. గత పాలనలో రాష్ట్రానికున్న బ్రాండ్ పొగొట్టి పరిశ్రమలను వెళ్లగొట్టారు. కానీ ఈ రెండేళ్ల కాలంలో పోయిన బ్రాండ్‌ను తిరిగి తెచ్చాం. రాష్ట్రంలో అభివృద్ధి యజ్ఞం చేస్తుంటే.. గొడ్డలి పార్టీ నేతలు రాక్షసుల్లా అడ్డుపడుతు న్నారని ఆక్షేపించారు. ఈ కార్యక్రమంలో మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్‌రెడ్డి, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం, కలెక్టర్ సుమిత్‌కుమార్ పాల్గొన్నారు.













# కుప్పం ప్రజల కోసం జననాయకుడు

**పోర్టల్‌ను పరిశీలించిన సీఎం చంద్రబాబు - అర్జీల పరిష్కారం, ఫాలోఅప్ విధానంపై ఆరా**







కుప్పం(చైతన్యరథం): నియోజకవర్గ ప్రజల కోసం ప్రత్యేకంగా రూపొందించిన జననాయకుడు పోర్టల్ పనివిధానాన్ని సీఎం చంద్రబాబు పరిశీలించారు. కుప్పం పర్యటనలో భాగంగా రెండోరోజు శనివారం కుప్పం టీడీపీ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన అక్కడే జననాయకుడు పోర్టల్ నిర్వహిస్తున్న సిబ్బంది తో సమావేశమయ్యారు. అర్జీలు పరిష్కరించే నిమిత్తం చేపడు తున్న ఫాలో అప్ ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. పోర్టల్‌కు ఇప్పటివరకు వచ్చిన అర్జీలను పరిశీలించారు. ఏయే అంశాలకు సంబంధించిన అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని అడిగి తెలుసు కున్నారు. అర్జీల పరిష్కారం విషయంలో స్థానిక నేతల సహకారం తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అనంతరం స్థానికుల నుంచి అర్జీలు స్వీకరించారు.








# గడువులోగా జలధార పనులు

- **నీటి భద్రతకు స్థానిక బేసిన్ల అనుసంధానం**
- **మైక్రో-బేసిన్ అనుసంధాన ప్రక్రియపై అధ్యయనం**
- **ఉత్తమ విధానాలపై డాక్యుమెంటేషన్‌కు చర్యలు**
- **జలహారతి పూర్తి అయ్యాక నివేదిక ఇవ్వాలి**
- **కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు**

కుప్పం (చైతన్యరథం): రాష్ట్రంలో జలధార– జలహారతి పనుల ను నిర్దేశిత లక్ష్యంలోగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబా బు నాయుడు అధికారులను ఆదేశించారు. కుప్పం పర్యటనలో భాగంగా రెండోరోజు శనివారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో జలధార– జలహారతిపై సమీక్ష నిర్వహించారు. గడచిన ఐదు రోజులుగా జిల్లాల పర్యటనలో బిజీగా ఉన్నప్పటికీ రాష్ట్రంలో చేప ట్టిన ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంపై అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమం కింద నిర్దేశించుకున్న 100 రోజుల గడువులోగా మంజూరు చేసిన పనులు పూర్తి చేసి తీరాలని దిశానిర్దేశం చేశా రు. దీనిపై జిల్లా కలెక్టర్లు స్వయంగా పర్యవేక్షించాలని సూచిం చారు. జిల్లాల్లో నీటి భద్రత కోసం వివిధ నీటి వనరుల బేసిన్లను అనుసంధానించేందుకు ప్రయత్నం చేయాలని స్పష్టం చేశారు. మిగులు నుంచి లోటు ప్రాంతాలకు నీటిని తరలించి స్థానిక నీటి అవసరాలకు నిల్వ సామర్థ్యాన్ని మెరుగుపరచాలని సూచించారు. ఆ మేరకు మిగులు నుంచి లోటు ప్రాంతాలకు నీటిని తరలించేలా అనుసంధాన పనులను చేపట్టాలన్నారు. ఈ ప్రక్రియ ద్వారా దీర్ఘకాలిక నీటి భద్రతను సాధించే అవకాశముంటుందని స్పష్టం చేశారు. ఈ ప్రక్రియలో మైక్రో బేసిన్ కనెక్టివిటీపై దృష్టి పెట్టాలని స్పష్టం చేశారు. అందుబాటులో ఉన్న నీటి



వనరులను గరిష్ఠంగా సద్వినియోగం చేసుకోవడానికి శాస్త్రీయ డేటా ఆధారిత విధానా న్ని అనుసరించాలని సూచించారు. మైక్రో–బేసిన్ అనుసంధాన ప్రక్రియలపై అధ్యయనం చేయాలని జలవనరుల శాఖను ఆదేశించారు.

**ఉత్తమ విధానాల అమలు**

నీటి భద్రత సాధించేందుకు, భూగర్భ జలాల పెంపునకు వివిధ జిల్లాల్లో అనుసరించిన ఉత్తమ విధానాలను కూడా అమలు చేయాలని కలెక్టర్లకు సూచించారు. ఇప్పటికే వివిధ జిల్లాల్లో అనుసరించిన ఉత్తమ విధానాలు, విజయవంతమైన పద్ధతులు డాక్యుమెంట్ చేయాలని స్పష్టం చేశారు. ఇతర జిల్లాల్లో సాధ్యమైన చోట బెస్ట్ ప్రాక్టీసెస్‌ను అనుసరించాలని సూచించారు. కాస్కేడ్ వ్యవస్థలను కూడా పునరుద్ధరించాలని దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా నంద్యాల, కర్నూలు జిల్లా కలెక్టర్లు ప్రదర్శించిన కాస్కేడ్ పునరుద్ధరణ కార్యక్రమాలను ముఖ్యమంత్రి అభినందిం చారు. భూగర్భ జలాల రీఛార్జితో పాటు ఉపరితల నీటి లభ్యతను పెంచేలా అన్ని జిల్లాల కలెక్టర్లు తమ ప్రాంతాల్లో కాస్కేడ్ వ్యవస్థ లను గుర్తించి పునరుద్ధరించాలని స్పష్టం చేశారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో వాతావరణాన్ని తట్టుకునే వ్యవసాయ ప్రణాళికలపై కలెక్టర్లు దృష్టి సారించాలన్నారు. సరైన నీటి నిర్వ హణతో పాటు తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించేలా జలవనరుల శాఖ ఇతర శాఖలతో సమన్వయం చేసుకోవాలని స్పష్టం చేశారు.

**జలధార- జలహారతిపై నివేదిక**

ప్రత్యేకించి రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన జలధార– జలహారతి కార్యక్రమంతో వచ్చిన ఫలితాలను అంచనా వేసేందుకు ఓ శాస్త్రీయపరమైన విశ్లేషణ చేపట్టాలని నిర్దేశించారు. రాష్ట్రంలో వర్షపాతం, భూగర్భ జలాలల ప్రభావానికి సంబంధించిన అంశంపై లోతుగా పరిశీలన చేపట్టాలని సూచించారు. ఈ అంశాలను అధ్యయనంతో పాటు తదుపరి చర్యల కోసం డేటా ఆధారిత నిర్ణయాలు తీసుకోవాలన్నారు. వ్యవసాయంతో పాటు జలవనరుల ప్రణాళికలు అమలు చేసేందుకు డేటా ఆధారిత నమూనాల ద్వారా చేపట్టాలన్నారు. 100 రోజుల జలధార– జలహారతి కార్యక్రమం పూర్తి అయ్యాక ఆయా జిల్లాల్లో పనుల పరిస్థితి, ఆర్థిక వ్యయం, వర్షపాత విశ్లేషణ, భూగర్భ జలాల రీఛార్జి, నీటి నిల్వ సామర్థ్యంలో మెరుగుదల తదితర అంశాలపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఆ శాఖ ఉన్నతాధికారులు సహా అన్ని జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.




# కుప్పంలో ఫుడ్ స్ట్రీట్ ప్లాజా

**ఏరియా అథారిటీ అతిథిగృహం ప్రారంభం - కార్యక్రమాల్లో పాల్గొన్న సీఎం చంద్రబాబు - అనంతరం స్మశాన వాటిక పరిశీలన**



కుప్పం (చైతన్యరథం): రెండోరోజు పర్యటనలో భాగంగా కుప్పంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం పాల్గొన్నారు. ఫుడ్ స్ట్రీట్-ఎంటర్‌టైన్ మెంట్ ప్లాజాను ప్రారంభించారు. అనంతరం నిర్వాహకులతో ముచ్చటించారు. రూ. 4. 70 కోట్లతో నూతనంగా నిర్మించిన 'కుప్పం ఏరియా డెవలెప్‌మెంట్ అథారిటీ' అతిథిగృహాన్ని ప్రారం భించారు. రూ. 3 కోట్లతో నిర్మించిన మోక్షవనం స్మశాన వాటికను సందర్శించారు.







చైతన్యరథం



## యువ నేత లోకేష్ దార్శనికతకు నిలువుటద్దం...

# నిడమర్రు 'గ్లోబల్' స్కూల్!








- విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ చొరవతో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మితమైన తొలి మోడల్ స్కూలు
- మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని నిడమర్రులో 5.2 ఎకరాల విస్తీర్ణంలో సుమారు రూ.16కోట్లతో భవనాల నిర్మాణం... అడ్మిషన్లకు విశేష స్పందన

**సాధారణంగా సర్కారీ బడులంటే కాస్త చిన్నచూపు ఉంటుంది. మౌలిక వసతులు ఉండవని.. ఉపాధ్యాయులు సరిగా పాఠాలు బోధించరనే దురభిప్రాయం ఉంటుంది. కానీ రోజులు మారాయి. ప్రభుత్వ పాఠశాలల్లోనూ నో అడ్మిషన్ బోర్డులు పెట్టే రోజులు వచ్చేశాయి. ఈ క్రమంలోనే ఏపీలోని ఓ ప్రభుత్వ పాఠశాల విశేషాలు వింటే నోరెళ్లబెట్టాల్సిందే. ఈ పాఠశాలలో సమకూర్చిన ఏర్పాట్ల సంగతి తెలిస్తే మతిపోవాల్సిందే. అదే విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరి నియోజకవర్గంలోని నిడమర్రు జడ్పీ హైస్కూలు. దీనిని కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా అంతర్జాతీయ ప్రమాణాలతో మోడల్ స్కూలుగా అభివృద్ధి చేశారు. రూ.16 కోట్లతో పైలెట్ ప్రాజెక్టు కింద 'లీప్' స్కూలుగా తీర్చిదిద్దారు.**











**మంగళగిరి (చైతన్యరథం):** మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని నిడమర్రులో రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి, స్థానిక ఎమ్మెల్యే నారా లోకేష్ చొరవతో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించిన మోడల్ స్కూలుకు విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. లోకేష్ విజన్‌కు ప్రతీకగా రూపుదిద్దుకున్న ఈ విద్యా సంస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. లోకేష్ ఆదేశాలతో సుమారు రూ.16 కోట్ల వ్యయంతో 5.2 ఎకరాల విస్తీర్ణంలో నిడమర్రు జడ్పీ హైస్కూలు ప్రాంగణంలో ఈ మోడల్ స్కూలును అత్యాధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేశారు. విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యనందించే లక్ష్యంతో అన్ని మౌలిక వసతులు కల్పించారు. తరగతి గదుల్లో గ్రీన్‌బోర్డులు, చార్ట్ బోర్డులు, డిజిటల్ బోధన కోసం ఐఎఫ్‌పీ ప్యానెల్స్, ఆధునిక టేబుల్స్, కుర్చీలు ఏర్పాటు చేశారు. క్రీడలకు ప్రాధాన్యమిస్తూ ఫుట్‌బాల్ మైదానం, 200 మీటర్ల రన్నింగ్ ట్రాక్, వాకింగ్ ట్రాక్, ఫ్లడ్ లైట్స్, హ్యాండ్‌బాల్, బాస్కెట్‌బాల్, బాల్‌బ్యాడ్మింటన్, వాలీబాల్ కోర్టులతో పాటు మల్టీ స్పోర్ట్స్ ఇండోర్ స్టేడియం నిర్మించారు. సుమారు 400 మంది విద్యార్థులు వీక్షించే సామర్థ్యంతో యాంఫీ థియేటర్‌ను కూడా ఏర్పాటు చేశారు.

సైన్స్ మ్యూజియం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, కంప్యూటర్ ల్యాబ్‌లు, ఆటల్ టింకరింగ్ ల్యాబ్, ఆధునిక గ్రంథాలయం వంటి సౌకర్యాలు విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు దోహదపడనున్నాయి. 500 మంది విద్యార్థులు ఒకేసారి భోజనం చేసే డైనింగ్ హాల్, ఆర్వో వాటర్ ప్లాంట్, 40 సీసీ కెమెరాలతో భద్రతా వ్యవస్థ, ప్రత్యేక పార్కింగ్ స్థలం, కిచెన్ గార్డెన్, చిన్నారుల కోసం ఆధునిక ఆట పరికరాలతో పార్కు ఏర్పాటు చేశారు.

ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు విద్యార్థుల కోసం 28 గదులు, తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యార్థుల కోసం ప్రత్యేక బ్లాక్‌లో 12 గదులు నిర్మించారు. చిన్నారుల్లో చదువుపై ఆసక్తి పెంచేలా గోడలపై ఆకర్షణీయమైన చిత్రాలు తీర్చిదిద్దారు. సాంకేతికత ఆధారిత బోధనతో ఈ పాఠశాల విద్యా రంగంలో కొత్త దిశ చూపుతోందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవతో నిర్మితమైన నిడమర్రు మోడల్ స్కూల్లో అడ్మిషన్లకు తల్లిదండ్రులు అత్యంత ఆసక్తి చూపిస్తున్నారు. ప్రస్తుతం అడ్మిషన్స్ పూర్తయ్యాయి. భవిష్యత్తు తరాలకు నాణ్యమైన విద్య అందించే కేంద్రంగా ఈ పాఠశాల నిలవనుందని స్థానికులు చెప్తున్నారు.















# మన్యం వీరుడు అల్లూరికి

## చంద్రబాబు, లోకేష్ నివాళి



అమరావతి (చైతన్యరథం): అల్లూరి సీతారామరాజు గారి 129వ జయంతి సందర్భంగా సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ ఒక ప్రకటనలో నివాళు లర్పించారు. స్వాతంత్ర్య సమర చరిత్రలో అజరామరమైన అధ్యాయంగా నిలిచిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు. గిరిజనుల హక్కులు, ఆత్మగౌరవ పరిరక్షణ కోసం బ్రిటిష్ పాలనకు ఎదురొడ్డి అపూర్వ సాహసాన్ని ప్రద ర్శించిన మహనీయుడు. ఆయన త్యాగం, ధైర్యం, దేశభక్తి యావత్ భారత జాతికి చిరస్మరణీయమని చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. భారత స్వాతంత్ర్య ఉద్యమాన్ని విప్లవపథం వైపు నడిపిన పోరాటయోధుడు అల్లూరి సీతారామరాజు. దేశభక్తికి, త్యాగనిరతికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచారు. ఆయన పోరాట పటిమ, విప్లవ కార్యాచరణ అనితర సాధ్యం. తెలుగుజాతికి, దేశానికి స్ఫూర్తిప్రదాతగా నిలిచిన అల్లూరి సీతారామరాజు సేవలను స్మరించుకుందామని లోకేష్ పిలుపునిచ్చారు.

# జాతి ఐక్యతకు ప్రతీక పింగళి వెంకయ్య

## నివాళులర్పించిన సీఎం చంద్రబాబు, లోకేష్



అమరావతి(చైతన్యరథం): భారత జాతీయ పతాక రూపకర్త, స్వాతంత్ర్య సమరయోధులు పింగళి వెంకయ్య వర్ధంతి సందర్భంగా సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ ఒక ప్రకటనలో ఆయనకు నివాళు లర్పించారు. భారత జాతి ఐక్యతకు, ఆత్మగౌర వానికి ప్రతీకగా నిలిచిన త్రివర్ణ పతాక రూపకర్త పింగళి వెంకయ్య తెలుగువారు కావడం ప్రతి తెలుగువాడి గర్వకారణమని చంద్రబాబు పేర్కొన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంతో పాటు విద్య, వ్యవసాయం, శాస్త్రీయ రంగాల్లోనూ విశిష్ట సేవలు అందించిన ఆ మహనీయుని కృషి చిరస్మరణీయమని ప్రశంసించారు. ప్రజల్లో స్వాతంత్ర్య కాంక్షను రగిల్చిన చైతన్యశీలి పింగళి వెంకయ్య అని లోకేష్ కొనియాడారు. తెలుగువాడి మదిలో మెరిసిన త్రివర్ణ పతాకం భరతజాతి గుండెల్లో చిరస్థాయిగా నిలిచింది. ఆయన త్యాగం, దేశభక్తి నిరుపమానం, దేశానికి అందించిన సేవలు ఎనలేనివని గుర్తుచేసుకున్నారు.

# మంత్రి లోకేష్‌కు దక్షిణ కొరియా ఆహ్వానం

## నేటి నుంచి వారంపాటు ఆ దేశంలో పర్యటన - అధికారిక సమావేశాలు, పెట్టుబడులపై చర్చలు



అమరావతి (చైతన్యరథం): భారత్-దక్షిణ కొరియా మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసేందుకు తమ దేశంలో పర్యటించాల్సిందిగా రిపబ్లిక్ ఆఫ్ కొరియా (దక్షిణ కొరియా) ఏపీ విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్‌ను ఆహ్వానిం చింది. వారి ఆహ్వానం మేరకు ఈ నెల 5 నుంచి 11వ తేదీ వరకు వారంరోజుల పాటు మంత్రి లోకేష్ దక్షిణ కొరియాలో పర్యటించనున్నారు. ఇందులో భాగంగా ఆయన వివిధ మంత్రిత్వ శాఖల ప్రతినిధులతో అధికారిక సమావేశాల్లో పాల్గొంటారు. ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించే లక్ష్యంతో ఈ అధికారిక సమావేశాలు నిర్వహిస్తున్నామని దక్షిణకొరియా కాన్సులేట్ జనర ల్ (చెన్నయ్) చాంగ్ న్యూన్ కిమ్ మంత్రి లోకేష్‌కు రాసిన లేఖలో పేర్కొన్నారు. ఇరుదేశాల నడుమ మరింత సహకారం, సంబంధా ల బలోపేతానికి ఈ పర్యటన కీలక అడుగుకాగలదని భావిస్తున్న ట్టు కిమ్ తెలిపారు.

**నేటి నుంచి లోకేష్ పర్యటన వివరాలు**

దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లో ఆదివారం జరిగే ఇండి యా డయాస్పోరా ఆత్మీయ సమావేశానికి లోకేష్ హాజరై అక్కడి భారతీయులు, తెలుగువారినుద్దేశించి ప్రసంగిస్తారు. 6వ తేదీన దక్షిణకొరియా టెక్ స్టార్టప్ సంస్థల ప్రతినిధులతో రౌండ్‌టేబుల్ సమావేశంతో పాటు వివిధ సంస్థలతో పెట్టుబడి చర్చల్లో పాల్గొం టారు. అనంతరం హ్యోసంగ్ భారీ పరిశ్రమ సంఘం అధ్యక్షుడు టకేషి యొకోటా, సియోల్ సెమీ కండక్టర్స్ వైస్ ప్రెసిడెంట్ టేహ్యూంగ్ లీతో సమావేశమవుతారు. 7వ తేదీన ఎల్జీ కెమ్ గ్లోబల్ గ్లోబల్ స్ట్రాటజీ సెంటర్ ప్రెసిడెంట్, ఎల్జీ ఓవర్‌సీస్ కంపెనీస్ హెడ్ యున్ జు కోహ్ ఎల్జీ టవర్స్‌లో ఏర్పాటుచేసిన విందు సమా వేశంలో పాల్గొంటారు. ఎల్జీ అనుబంధ సంస్థలకు చెందిన ఉన్నత స్థాయి ప్రతినిధి బృందాలు ఈ సమావేశానికి హాజరవుతాయి. 8వ తేదీన కొరియన్ మెరైన్ అక్విప్‌మెంట్ అసోసియేషన్ ప్రతినిధుల తో రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొంటారు. 9వ తేదీన కొరియన్ పొలిటికల్ ఎఫైర్స్ డిప్యూటీ మినిస్టర్ మిస్.యుయి-హే సిసిలియా చుంగ్‌తో భేటీ అవుతారు. అనంతరం కొరియన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ a ఇన్వెస్టిమెంట్స్ డిప్యూటీ మినిస్టర్ కాంచన్ కాంగ్‌తో సమావేశమవుతారు. 10వ తేదీన వివిధ సంస్థల ప్రతి నిధులతో పెట్టుబడి చర్చలతో పాటు కొరియా ఆటో ఇండస్ట్రీ కో-ఆపరేషన్ ఏజన్సీ ప్రతినిధులతో రౌండ్‌టేబుల్ సమావేశానికి హాజరవుతారు. అదే రోజు రాత్రి సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్-2026 విజయవంతం కోరుతూ కొరియా కంపెనీల ప్రతినిధుల తో కలిసి రోడ్ షోలో పాల్గొంటారు.





*విశాఖ గంభీరం జలాశయంలో శనివారం అస్మితా సౌత్ జోన్ మహిళల కయాకింగ్ - కనోయింగ్ లీగ్ ప్రారంభమైంది. ఈ పోటీలను ఎంపీ శ్రీభరత్ ప్రారంభించారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ రవినాయుడు, వివిధ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు.*

# 'వైట్ గట్'పై ప్రభుత్వం అప్రమత్తం

- మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశాలతో రంగంలోకి అధికారులు
- ప్రభావిత చెరువుల నుంచి నమూనాల సేకరణ
- రాష్ట్రవ్యాప్తంగా కట్టుదిట్టమైన పర్యవేక్షణ
- రైతులూ జాగ్రత్త... నాణ్యమైన సీడ్, ఫీడ్ మాత్రమే వినియోగించాలి
- రొయ్యల రైతులకు నష్టం జరగనివ్వం, అండగా ఉంటామని మంత్రి అచ్చెన్నాయుడు హామీ



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలోని ఆక్వా రైతుల ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర వ్యవసాయ, పశు సంవర్ధక, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఇటీవల రాష్ట్రంలోని పలు ఆక్వా ప్రాంతాల్లో రొయ్యలలో "వైట్ గట్" వ్యాధి లక్షణాలు కనిపిస్తున్నాయనే సమాచారం అందిన వెంటనే ప్రభుత్వం అప్రమత్తమై, యుద్ధ ప్రాతిపదికన చర్యలు ప్రారంభించిందన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా ఉండి మండలం మహదేవిపట్నంలో రైతు పి. మనోజ్ వర్మ చెరువును మత్స్యశాఖ అధికారులు పరిశీలించి, నీరు, రొయ్యలు, ఫీడ్, మల నమూనాలను సేకరించి పరీక్షల కోసం కైకలూరు ప్రయోగశాలకు పంపారని, నీటి నాణ్యత పరీక్షలను భీమవరం ల్యాబ్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో కూడా ఇదే విధంగా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొనసాగుతోందన్నారు.

జిల్లా జాయింట్ డైరెక్టర్లు, డిప్యూటీ డైరెక్టర్లు, అసిస్టెంట్ డైరెక్టర్లు, FDOలు, AIFలు, ఎఖీలూలు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌లుగా పనిచేసి ప్రతి ఆక్వా ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని ఆదేశించినట్లు చెప్పారు. రాష్ట్రంలోని నమోదిత, నమోదుకాని హేచరీలు, ప్రైవేట్ ఆక్వా ల్యాబ్‌లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, నాణ్యతలేని విత్తనం, నాసిరకం ఫీడ్ విక్రయాలు, తప్పుడు ల్యాబ్ నివేదికలు, నిబంధనల ఉల్లంఘనలను ఏమాత్రం సహించబోమని మంత్రి స్పష్టం చేశారు. తప్పు చేసిన వారిపై చట్టపరంగా, శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చెరువుల నుంచి రొయ్యలు, పోస్ట్ లార్వా, ఫీడ్, నీరు, మల నమూనాలను తప్పనిసరిగా సేకరించి పీసీఆర్ పరీక్షలు నిర్వహించాలని ఆదేశించామని తెలిపారు. వ్యాధి వ్యాప్తికి గల కారణాలను శాస్త్రీయంగా గుర్తించి తక్షణ నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు.

రైతులు 1 ప్లస్ 1 వంటి ఆకర్షణీయ ఆఫర్ల పేరుతో నాణ్యత లేని రొయ్య పిల్లలను కొనుగోలు చేయవద్దని మంత్రి విజ్ఞప్తి చేశారు. తప్పనిసరిగా ధృవీకరించిన హేచరీల నుంచే నాణ్యమైన విత్తనాన్ని కొనుగోలు చేయాలని, చెరువు సామర్థ్యానికి అనుగుణంగా మాత్రమే పిల్లలను వదలాలని సూచించారు. కొనుగోలు చేసిన విత్తనం వివరాలను నమోదు చేసి భద్రపరచుకోవాలని చెప్పారు. చెరువుల నిర్వహణలో బయోసెక్యూరిటీకి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి సూచించారు. ప్రతి పంట అనంతరం చెరువును పూర్తిగా ఎండబెట్టడం, సిల్ట్ తొలగించడం, సున్నం వేయడం, క్రిమిసంహారక చర్యలు చేపట్టడం ద్వారా వ్యాధికారకాలను పూర్తిగా నిర్మూలించాలని తెలిపారు. సీఐబీఏ సూచించిన ఉత్తమ నిర్వహణ పద్ధతులను తప్పనిసరిగా అమలు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. ఈ అంశంపై స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీ, NASPAD, ఆంధ్రప్రదేశ్ ఫిషరీస్ యూనివర్సిటీ, MPEDA, CIBA, నేషనల్ బ్యూరో ఆఫ్ ఫిష్ జెనిటిక్ రిసోర్సెస్ వంటి జాతీయ, రాష్ట్ర స్థాయి సంస్థలతో సమన్వయం చేసి శాస్త్రీయ పర్యవేక్షణ చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. నవీకరించిన ఎస్‌ఓపీ లను రూపొందించి, ఫిషరీస్ యూనివర్సిటీ విద్యార్థుల ద్వారా గ్రామస్థాయిలో రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించినట్లు తెలిపారు.

రాష్ట్రంలోని అన్ని జిల్లాల మత్స్యశాఖ అధికారులు ఏడు రోజుల్లోగా తనిఖీలు, నమూనాల సేకరణ, తీసుకున్న చర్యలపై సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించామని మంత్రి తెలిపారు. రైతులకు అవగాహన కల్పించడంలో లేదా ఈ ఆదేశాల అమలులో నిర్లక్ష్యం వహించిన అధికారులపై కూడా క్రమశిక్షణా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. రొయ్యల రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని, ప్రభుత్వం పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ రైతులకు అవసరమైన అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తోందని మంత్రి అచ్చెన్నాయుడు భరోసా ఇచ్చారు.

# గుడివాడకు జగన్ సమర్థింపు.. మహిళలను అవమానించడమే

- ఇప్పటికైనా అమర్‌నాథ్ క్షమాపణ చెప్పాలి
- మహిళల ఆత్మగౌరవంలో రాజీలేని కూటమి ప్రభుత్వం
- తల్లి, చెల్లిని గెంటేసిన జగన్ దారిలోనే వైసీపీ నేతలు
- మహిళలపై కనీస గౌరవం లేని గొడ్డలిపార్టీ నేతలు
- రాజధానిపై రోజుకో మాట మారుస్తున్న జగన్
- అధికార మదంతో అమరావతి మహిళలను ఏడిపించినందుకే 11 సీట్లకు పరిమితం చేశారు
- స్త్రీ, శిశు, గిరిజన సంక్షేమ శాఖల మంత్రి గుమ్మిడి సంధ్యారాణి



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ రెండు సంవత్సరాలలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళుగా ప్రగతి పథంలో దూసుకుపోతోందని స్త్రీ, శిశు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు. గత ప్రభుత్వ వినాశకర పరిపాలన నుంచి బయటపడిన ప్రజలు ఈ రోజు ప్రశాంతంగా ఊపిరి పీల్చుకుంటున్నారని ఆమె అన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. గతంలో వందల్లో వచ్చే ప్రజా సమస్యలు (గ్రీవెన్స్) ఇప్పుడు పదుల సంఖ్యకు తగ్గాయని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేష్ రాష్ట్రమంతటా తిరుగుతూ సమస్యలను వెనువెంటనే పరిష్కరిస్తున్నారని చెప్పారు. స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీలు, అధికారులు అక్కడికక్కడే స్పందిస్తుండటం వల్లే అర్జీలు ఇచ్చేందుకు పార్టీ ఆఫీస్‌కు వచ్చే వారి సంఖ్య రోజురోజుకూ తగ్గుతోందని, ఇది ప్రభుత్వ విజయానికి నిదర్శనమని ఆమె స్పష్టం చేశారు. 'సూపర్ సిక్స్' పథకాలతో పాటు అన్ని శాఖల్లో అభివృద్ధి వేగంగా జరుగుతోందన్నారు. ప్రజలు సంతోషంగా ఉంటే ఓర్వలేక ప్రతిపక్ష 'గొడ్డలి పార్టీ' నేతలు సమాజంలో అలజడి సృష్టించాలని చూస్తున్నారని మంత్రి ధ్వజమెత్తారు. వైసీపీ మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్.. హోంమంత్రి అనితపై, అందునా ఒక దళిత మహిళపై చేసిన మేకప్ వ్యాఖ్యలను ఆమె తీవ్రంగా ఖండించారు.

**జగన్ రెడ్డి దారిలోనే..**

మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ ఇంట్లో ఆడవాళ్ళు లేరా? వాళ్ళు మేకప్ వేసుకోరా? ఆంధ్రప్రదేశ్‌లో బొట్టు, కాటుక, పౌడర్ పెట్టుకోకుండా బయటకొచ్చే మహిళలు ఉన్నారా? మహిళల చీరకట్టు, రంగుపై కామెంట్లు చేస్తూ బాడీ షేమింగ్ చేయడానికి మీకు సభ్యత, సంస్కారం ఉన్నాయా? అని మంత్రి నిలదీశారు. మహిళా కమిషన్ పిలిచి విచారిస్తే, చేసిన తప్పును సమర్థించుకుంటూ అమర్‌నాథ్ ప్రెస్ మీట్లు పెట్టడం సభ్య సమాజం తలదించుకునేలా ఉందన్నారు. మహిళలను గౌరవించని మీ బాస్ (జగన్ రెడ్డి) నుంచే ఇలాంటి సంస్కారహీన రాజకీయం నేర్చుకున్నారని విమర్శించారు. సొంత తల్లిని, చెల్లిని గౌరవించని వాళ్ళు సమాజంలోని మహిళలను గౌరవిస్తారని ఆశించలేమన్నారు. చదువుకుని, నగరాల్లో పెరిగిన మీకే కనీస సభ్యత లేకపోతే ఎలా? మహిళా కమిషన్ ముందుకు వెళ్లి వచ్చిన తర్వాత కూడా బాధ్యతారాహిత్యంగా మాట్లాడిన అమర్నాథ్ తక్షణమే రాష్ట్ర మహిళా లోకానికి క్షమాపణ చెప్పాలి. మీ బాస్ జగన్మోహన్ రెడ్డిని చూసే మీరు ఇలాంటి బూతులు నేర్చుకున్నట్టున్నారు. సొంత చెల్లి షర్మిల చీర గురించి, ఆమె క్యారెక్టర్ గురించి తన సొంత పత్రికల్లో రాయించిన దౌర్భాగ్యుడు మీ అధినేత. చివరకు ఆమె వైఎస్సార్‌కే పుట్టలేదనే స్థాయికి దిగజారి పత్రికల్లో రాయించి, కన్నతల్లి విజయమ్మని ఎంతగా అవమానించారో అందరూ చూశారు. కన్నతల్లిని, తోడబుట్టిన చెల్లిని మెడబట్టి బయటకు గెంటిన వ్యక్తి నుంచి ఇతరులకు గౌరవం లభిస్తుందని ఆశించడం అత్యాశే అవుతుందని మంత్రి సంధ్యారాణి అన్నారు.

**మహిళా లోకం క్షమించదు**

కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి తన భర్త చనిపోయాక రెండో వివాహం చేసుకున్నానని ధైర్యంగా చెబితే.. మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నాయకుడు ప్రసన్న కుమార్ రెడ్డికి ఆ విషయాన్ని పట్టుకుని వరసకు సోదరి అయ్యే ఆమె గురించి పదే పదే దిగజారుడు మాటలు మాట్లాడటం ఏ రకమైన సంస్కారం? మనుషులుగా పుట్టి, సమాజంలో బతకాలనుకునే వారెవ్వరూ ఇలాంటి నీచమైన మాటలు మాట్లాడరు. గత ప్రభుత్వంలో అమరావతి కోసం 1200 రోజులకు పైగా దీక్షలు చేసిన ఆడబిడ్డలను వేశ్యలని, పిశాచాలని, దెయ్యాలని, సంకరజాతి వాళ్లని అధికార మదంతో నానా మాటలు అని హింసించారు. 'కుక్కలు అరిస్తే తెల్లారదు.. కోడి కూస్తేనే తెల్లారుతుంది' అని మా పల్లెటూళ్లలో సామెత ఉంది. అందుకే మీ కూతలను నాడు ప్రజలు భరించారు, కానీ సమయం చూసి మొన్నటి ఎన్నికల్లో ఓటు రూపంలో మీ పొగరు అణిచారు. ఇప్పటికైనా పద్ధతి మార్చుకోకపోతే మహిళా లోకం మిమ్మల్ని క్షమించదు. రాష్ట్రంలో గత రెండేళ్లుగా ప్రజలు, మహిళలు ప్రశాంతంగా జీవిస్తుంటే, ఎలాగైనా సరే మహిళల్లో అల్లకల్లోలం సృష్టించాలనే కుట్రతో వైసీపీ నేతలు ప్రవర్తిస్తున్నారని, ఇలాంటి వారిని సమాజం ఎప్పటికీ ఆదరించదని మంత్రి సంధ్యారాణి స్పష్టం చేశారు.

**రోజుకో పిచ్చిమాట**

అధికారం పోయిందన్న బాధలో వైసీపీ నేతలు ఇంకా తేరుకోలేదు. రెండేళ్లుగా ప్రజలు ఎవరి మటుకు వారు ప్రశాంతంగా ఉంటే, మళ్లీ వచ్చి అలజడి సృష్టించాలని చూస్తున్నారు. మీ నాయకుడు జగన్మోహన్ రెడ్డికి అసలు మతిస్థిమితం ఉందా? మొదటి రోజు వైజాగ్ రాజధాని అంటాడు, రెండో రోజు విజయవాడ అంటాడు, మూడో రోజు తను ఎక్కడ ఇల్లు కట్టుకుంటే అదే రాజధాని అంటాడు. నాల్గో రోజు రాజ్యాంగంలో రాజధాని అనే పదమే లేదంటాడు. ఐదో రోజు తన పేరులో గన్ ఉంది కాబట్టి ఇక్కడ కూడా 'మా విగన్' అంటాడు. ఆరో రోజు సూట్‌కేస్ సర్దుకుని బెంగళూరు పారిపోతాడు. రోజుకొక మాట, పూటకొక మాట మాట్లాడే వాళ్లను మా ఏరియాలో పిచ్చోళ్ళు అంటారు. మొన్నటికి మొన్న ప్రెస్ మీట్ పెట్టి ఏదో కొత్త విజన్ తో ఎలక్షన్‌కు వెళ్తామన్నారు. తీరా విలేకరులు ప్రశ్నిస్తే మళ్లీ విజయవాడ రాజధాని అంటారు. ఇలాంటి పిచ్చి పనులు చేయబట్టే ప్రజలు మిమ్మల్ని ప్రతిపక్ష హోదా కూడా లేకుండా కేవలం 11 సీట్లకే పరిమితం చేసి పక్కన కూర్చోబెట్టారు. అయినా మీకు ఇంకా బుద్ధి రాలేదని మంత్రి సంధ్యారాణి ఆగ్రహం వ్యక్తం చేశారు.

**కూటమి ప్రభుత్వంలో మహిళలకు గౌరవం**

ఈ రోజు కూటమి ప్రభుత్వంలో నేను, అనిత, సవిత... ముగ్గురు మహిళా మంత్రులం ఎంతో గౌరవప్రదంగా బాధ్యతలు నిర్వహిస్తున్నాం. ఇటీవల జరిగిన గిరిజన యూనివర్సిటీ వార్షికోత్సవంలో రాష్ట్రపతితో కలిసి నేను వేదికను పంచుకున్నాను. ఒక గిరిజన మహిళకు ఇంతటి అత్యున్నత గౌరవాన్ని ఇచ్చింది మా కూటమి ప్రభుత్వం, మా ముఖ్యమంత్రి చంద్రబాబు, మా విద్యాశాఖ మంత్రి లోకేష్. మమ్మల్ని ఎంతో మర్యాదగా 'అమ్మా' అని పిలిచే సంస్కారం మా నాయకులది. ఒక్క రోజు కూడా ఏ మహిళను ఎగతాళి చేసిన చరిత్ర మా ప్రభుత్వానికి లేదు. ప్రతిపక్షంగా ఉండి ప్రభుత్వానికి మంచి సలహాలు, సూచనలు ఇస్తే స్వీకరిస్తాం. లేదా ఒక నిర్మాణాత్మకమైన చర్చకు వస్తే డిబేట్ చేయడానికి సిద్ధంగా ఉన్నాం. కానీ, రోజుకో మాట మాట్లాడుతూ మానసికంగా కృంగిపోయిన ఒక రోగితో మేము మాట్లాడలేం. మతిస్థిమితం లేని వాళ్లు మాట్లాడే పిచ్చి మాటలకు సమాధానం చెప్పాల్సిన అవసరం మాకు లేదు. ప్రజలు అంతా గమనిస్తున్నారని, వైసీపీ నేతలు ఇప్పటికైనా తమ భాషను, ప్రవర్తనను మార్చుకోకపోతే సమాజంలో మనుషులుగా తిరిగే అర్హతను కూడా కోల్పోతారని మంత్రి సంధ్యారాణి హెచ్చరించారు.

**చెప్పులతో కొడతారు**

కూటమి ప్రభుత్వం ఏర్పడి విజయవంతంగా రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా అన్ని శాఖల్లో పూర్తిస్థాయి అభివృద్ధి, సంక్షేమం ప్రజలకు అందుతోందని రాష్ట్ర మంత్రి సంధ్యారాణి హర్షం వ్యక్తం చేశారు. సమాజంలో అరాచకాలు సృష్టించాలని చూస్తున్న వైసీపీ నేతలకు బుద్ధి చెప్పేందుకు మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పౌరుషాన్ని, తెగింపును యువత, మహిళలు ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖలో ఇప్పటివరకు రికార్డు స్థాయిలో 11,000 అంగన్వాడీ పోస్టులను భర్తీ చేశాం. రాబోయే రోజుల్లో అవసరమైన చోట మరిన్ని పోస్టులు ఇస్తాం. అలాగే గిరిజన సంక్షేమ శాఖలో ప్రతి హాస్టల్‌కు తాగునీరు, తగినన్ని టాయిలెట్లు కల్పించడంతో పాటు విద్యార్థులకు కంచం, పెట్టె, దుప్పట్లు, యూనిఫారాలు సక్రమంగా అందిస్తున్నాం. గిరిజన ప్రాంతాల్లో మరణాల శాతాన్ని తగ్గించడమే మా ధ్యేయం. రాబోయే మూడు సంవత్సరాల్లో మన్యంలో 'డోలీ మోతలు' పూర్తిగా లేని విధంగా రోడ్ల నిర్మాణాన్ని పూర్తి చేస్తాం. ఈ రోజు మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఆయనకు ఘనంగా నివాళులర్పించాం. బ్రిటిష్ వారిని ఒంటిచేత్తో ఎదిరించిన అల్లూరి క్రమశిక్షణ, పట్టుదల, ధైర్యం నేటి యువతలో రావాలి. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో మహిళలను కించపరచడం, దళితులను చంపేసి డోర్ డెలివరీ చేయడం, గిరిజనుల భూములు లాక్కోవడం, బీసీలను చులకనగా చూడటం వంటి అరాచకాలు జరిగాయి. అందుకే ప్రజలు వారికి 11 సీట్లే ఇచ్చారు. ఇప్పుడు అధికారం లేకపోయినా వాక్ స్వాతంత్ర్యం పేరిట ఇష్టమొచ్చినట్టు కూస్తున్న నేతలను అల్లూరి పౌరుషంతో ఎదుర్కోవాలి. సమాజంలో జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. హోం మంత్రిని, ప్రశాంతి రెడ్డి గారిని కించపరిస్తే మాకేంటి అని ఊరుకునే రోజులు పోయాయి. వైసీపీ నేతలపై ప్రజలు చెప్పులు, రాళ్లతో దాడి చేసే రోజులు దగ్గరపడ్డాయి. మొన్నటికి మొన్న అమరావతికి వెళ్లి మొసలి కన్నీళ్లు కారుద్దామనుకున్న జగన్ రెడ్డి శిష్యులను అక్కడి మహిళలు తరిమి తరిమి కొట్టారు. ఆ తెగింపు, ధైర్యమే వైసీపీ నేతలను అదుపులో ఉంచుతుంది. మహిళలను కులం పేరుతో గానీ, శారీరక రూపంపై గానీ, వారి అలంకరణ (మేకప్) పై గానీ తక్కువ చేసి మాట్లాడితే ఊరుకునే ప్రసక్తే లేదు. చట్టం తన పని తాను చేసుకుపోతుంది, అవసరమైతే మరింత కఠినమైన చట్టాలు తెస్తాం. కూటమి ప్రభుత్వం మహిళల ఆత్మగౌరవానికి పెద్దపీట వేస్తుందని, సమాజ సంస్కృతిని మంటగలిపేలా మాట్లాడే వైసీపీ నేతలు తమ వైఖరి మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని మంత్రి సంధ్యారాణి అన్నారు. మహిళల పట్ల బరితెగించి ప్రవర్తిస్తున్న వైసీపీ నేతలపై చట్టం మరింత కఠినంగా వ్యవహరిస్తుందని, మహిళా లోకం అంతా ఈ అరాచక వ్యాఖ్యల పట్ల తీవ్ర ఇబ్బంది పడుతోందని, తక్షణమే వైసీపీ నేతలు తమ వైఖరి మార్చుకోవాలని మంత్రి సంధ్యారాణి హెచ్చరించారు.

# పట్టణాల్లో స్ట్రీట్ వెండింగ్ ప్లాన్‌లకు ఆమోదం

**మార్గదర్శకాలను విడుదల చేసిన ప్రభుత్వం**

అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలోని 51 పట్టణ స్థానిక సంస్థల స్ట్రీట్ వెండింగ్ ప్లాన్‌లకు ఆమోదం తెలిపింది. స్ట్రీట్ వెండర్ల చట్టం-2014 ప్రకారం జీవో ఎంఎస్ నెం.140ను జారీ చేస్తూ వీధి వ్యాపారులకు వర్తించే నిబంధనలు, అమలు మార్గదర్శకాలను విడుదల చేసింది. ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం.. వెండింగ్ జోన్లలో శాశ్వత నిర్మాణాలకు అనుమతి ఉండదు. తాత్కాలిక స్టాళ్లు ఏర్పాటు చేసుకుని మాత్రమే వ్యాపారం నిర్వహించాల్సి ఉంటుంది. అలాగే రహదారులు, ఫుట్ పాత్‌లు, ట్రాఫిక్‌కు ఎలాంటి ఆటంకం కలగకుండా వ్యాపార కార్యకలాపాలు నిర్వహించాలని స్పష్టం చేసింది. రోడ్ల విస్తరణ, ప్రజాప్రయోజనాల కోసం అవసరమైతే వీధి వ్యాపారులు తమ వ్యాపార స్థలాన్ని మార్చాల్సి ఉంటుందని ప్రభుత్వం పేర్కొంది. విద్యుత్ వ్యవస్థలు, డ్రైనేజీలు, ప్రతిపాదిత రహదారుల సమీపంలో ఎలాంటి ఆక్రమణలు చేయరాదని ఆదేశించింది. వెండింగ్ జోన్లలో పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలని, చెత్తను నిర్దే శించిన ప్రాంతాల్లో మాత్రమే వేయాలని మార్గదర్శకాల్లో పేర్కొం ది. ప్రజారోగ్యం, పరిశు భ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచిం చింది. ప్రతి ఐదేళ్లకోసారి పట్టణ స్థానిక సంస్థలు స్ట్రీట్ వెండింగ్ ప్లాన్‌ను రూపొందించి అవసరమైన మార్పులు చేయనున్నాయి. అర్హులైన వీధి వ్యాపారులకు మాత్రమే వెండింగ్ సర్టిఫికెట్లు, గుర్తింపు కార్డులు జారీ చేయనున్నారు. అలాగే వెండింగ్ జోన్లలో మౌలిక సదుపాయాలను యూఎల్‌బీలు కల్పించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించింది.



# దొంగపత్రాలతో భూముల ఆక్రమణ

- వైసీపీ నేత అక్రమాలపై గ్రీవెన్స్‌లో ఫిర్యాదు
- కాలువ కట్టపై కంచె వేసి దౌర్జన్యం
- 33 ఏళ్ల క్రితం కొనుగోలు చేసిన భూమిపై కన్నేసిన అక్రమార్కులు
- పంట కాలువ పూడ్చివేత.. నిలదీస్తే కులదూషణ
- న్యాయం చేయాలంటూ టీడీపీ కేంద్ర కార్యాలయంలో వినతులు
- అర్జీలు స్వీకరించిన మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు రెడ్డి సుబ్రహ్మణ్యం

అమరావతి (చైతన్యరథం): వివిధ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా పలువురు బాధితులు శనివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమానికి తరలివచ్చారు. అర్జీదారుల నుంచి రాష్ట్ర స్త్రీ, శిశు, గిరిజన సంక్షేమ శాఖల మంత్రి గుమ్మడి సంధ్యారాణి, టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు రెడ్డి సుబ్రహ్మణ్యం వినతులు స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు.

వంశపారంపర్యంగా వస్తున్న, పిత్రార్జితంగా తమకు సంక్రమించిన భూమిని కొందరు వ్యక్తులు దొంగ పత్రాలతో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా తోటపల్లిగూడూరు మండలం శివరాంపురం గ్రామానికి చెందిన నెల్లిపూడి సుధాకర్, నెల్లిపూడి సుబ్బయ్య సమర్పించిన వినతి పత్రంలో తెలిపారు. ఈ భూమిని పర్సనల్ ఇనాం హక్కుదారుల నుండి 1923, 1926, 1984 సంవత్సరాల్లో తమ తాత కొనుగోలు చేశారని తెలిపారు. తమకు న్యాయబద్ధంగా దక్కాల్సిన ఈ విలువైన భూమిని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడొకరు, మరికొందరు స్థానిక వ్యక్తులు కలిసి కుట్ర పూరితంగా ఒక ప్రైవేట్ సంస్థ సిబ్బందితో, కొందరు అధికారులతో చేతులు కలిపి దొంగ పత్రాలతో అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. ఈ అక్రమ విక్రయాలపై, దొంగ రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలని కోరుతూ గతంలో అనేకసార్లు రిజిస్టర్ పోస్టు ద్వారా, ప్రభుత్వ 'స్పందన' కార్యక్రమంలో, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా గత ప్రభుత్వంలో అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని అభ్యర్థించారు.

తమ పొలానికి వెళ్లేందుకు దారి లేకుండా చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని నంద్యాల జిల్లా శిరివెళ్ల మండలం గుండంపాడు గ్రామానికి ఈడిగ వెంకటసుబ్బయ్య విజ్ఞప్తి చేశారు. సర్వే నెంబర్లు 197 బీ, 106, 502/2 లలోని మా పొలానికి తెలుగుగంగ కాలువ 16వ బ్లాక్ కింద సాగునీరు అందుతుంది. గత 20 సంవత్సరాలుగా సదరు తెలుగుగంగ కట్ట దారి గుండానే మా పొలానికి వెళ్లి వ్యవసాయ పనులు చేసుకుంటున్నాను. ఈ క్రమంలో ఈ నెల 10వ తేదీన పక్క పొలం రైతు.. జెసిబి యంత్రాన్ని తీసుకొచ్చి తెలుగుగంగ కాలువ కట్టను నరికివేసి, కట్టపై నడవకుండా అడ్డంగా కంచె వేసి దారిని పూర్తిగా మూసివేశాడు. ఈ విషయంపై శిరివెళ్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.



పూర్తి యాజమాన్య హక్కులతో సాగు చేసుకుంటున్న తమ భూమిని దౌర్జన్యంగా ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని గుంటూరు జిల్లా తెనాలి మండలం అంగలకుదురు గ్రామానికి చెందిన కడియం లక్ష్మీనారాయణ విజ్ఞప్తి చేశారు. తన భార్య అనంతలక్ష్మి పద్మావతి పేరిట 1993వ సంవత్సరంలో సుల్తానాబాద్ పరిధిలోని సర్వే నెంబర్లు 19/6, 17/2 లలో మన్నే రాములమ్మ అనే ఆమె వద్ద నుండి 70 సెంట్ల భూమిని కొనుగోలు చేశామని తెలిపారు. నాటి నుండి ఆ భూమిపై పూర్తి యాజమాన్య హక్కులతో సాగు చేసుకుంటున్నాం. అయితే, ఇటీవల కాలంలో ఇద్దరు దంపతులు వారికి ఎలాంటి హక్కులు లేకపోయినప్పటికీ, దౌర్జన్యంగా తమ భూమిని ఆక్రమించుకోవడమే కాకుండా, యజమానులైన తమను మానసికంగా, శారీరకంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

తమ పొలానికి నీరందించే కాలువను మూసివేయటమే కాకుండా, తమపై దౌర్జన్యం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి మండలం దబ్బాకుపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. తమ గ్రామంలోని సర్వే నెం. 199, 201/1లో మొత్తం 6.16 ఎకరాల స్వంత భూమి ఉంది. ఈ భూమితో పాటు పక్కనే ఉన్న సర్వే నెం. 200లోని 2.73 ఎకరాలు కలుపుకొని, మొత్తం 9.69 ఎకరాల భూమికి దాములూరు మేజర్ కాలువ నుండి లింగాల మైనర్ కాలువ ద్వారా ఉన్న ఒక తూము ద్వారా ఎప్పటినుండో నీటిపారుదల సౌకర్యం ఉంది. ఈ క్రమంలో గత ఫిబ్రవరి నెలలో అదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు కలిసి సదరు పంట కాలువను అక్రమంగా పూడ్చివేసి, పొలాలకు నీరు అందకుండా నిలిపివేశారు. పంట కాలువ పూడ్చివేతపై నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ అధికారులకు ఫిర్యాదు చేశాను. దీంతో కక్ష పెంచుకున్న ఆ వ్యక్తులు మరుసటి రోజే దౌర్జన్యానికి దిగారు. తన భార్య ఒంటరిగా పొలంలో పని చేసుకుంటుండగా.. అక్కడికి వెళ్లిన నిందితులు ఆమెను నోటికి వచ్చినట్లు అసభ్య పదజాలంతో తిడుతూ, కులం పేరుతో తీవ్రంగా దూషించారు. అంతేకాకుండా తమను చంపేస్తామని హెచ్చరిస్తూ, కొట్టడానికి తమ కుటుంబ సభ్యులపైకి దూసుకెళ్లారు. దీనిపై స్థానిక పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేసిన ఎలాంటి న్యాయం జరగలేదు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.


తనతో సహ జీవనం చేసి, తరువాత తనను మోసగించి 18 పవర్ల బంగారం, దఫదఫాలుగా ఒక లక్షా 7 వేల రూపాయల నగదు తీసుకుని పరారైన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని గుంటూరుకు చెందిన సరస్వతి విజ్ఞప్తి చేశారు. గతంలోనే తన భర్త చనిపోగా.. కూతురు, తల్లి చెన్నై వెళ్లిపోగా.. ఇంట్లో ఒంటరిగా ఉంటున్న తనకు సదరు వ్యక్తి, ఒకరోజు కూల్‌డ్రింక్‌లో మత్తుమందు కలిపి తనపై అత్యాచారానికి ఒడిగట్టాడు. ఆ తర్వాత ఆ విషయాన్ని బయటకు చెప్పనివ్వకుండా, పెళ్లి చేసుకుంటానని నమ్మించి సంగడిగుంటలో ఓ ఇల్లు అద్దెకు తీసుకుని అక్కడ రెండు నెలల పాటు సహజీవనం చేశాడు. బంగారం, నగదు తీసుకుని తనని వదిలేసి పరారయ్యాడు. ఇదిలా ఉండగా, అతడి స్నేహితుడైన మరో వ్యక్తి.. తనకి ఒంటరి మహిళ పెన్షన్ ఇప్పిస్తానని నమ్మించి తన వద్ద రూ. 5,000/- వసూలు చేశాడు. అంతేకాకుండా సహజీవనంలో ఉన్న వ్యక్తితో కలిసి ఉన్న సమయంలో తీసిన వీడియోలను చూపించి, ప్రస్తుతం తీవ్రంగా బెదిరింపులకు గురిచేస్తున్నాడు. వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

వరద ముంపు నుంచి తప్పించేలా ఎత్తయిన ప్రదేశంలో ఇళ్ల స్థలాలు ఇప్పించాలని కర్నూలు జిల్లా హోలహరి మండలం బల్లూరు గ్రామానికి చెందిన బల్లూరప్ప, ఈశ్వరప్ప విజ్ఞప్తి చేశారు. తమ గ్రామాన్ని ఆనుకొని ప్రవహించే వేదవతి నది వర్షాకాలంలో గ్రామాన్ని ముంచెత్తుతోంది. ఈ ముంపు సమస్య నుండి శాశ్వత పరిష్కారం కోసం, గ్రామంలోనే సురక్షితమైన ఎత్తైన ప్రదేశంలో ఉన్న ప్రభుత్వ భూమి సర్వే నెం. 190, విస్తీర్ణం 12.62 ఎకరాలని ఇళ్ల స్థలాల కోసం కేటాయించాలని కోరారు. బల్లూరు గ్రామంలోని సుమారు 300 పేద కుటుంబాలకు ఇల్లు కట్టుకోవడానికి ఈ స్థలం ఎంతో అనువుగా ఉంటుంది. ఈ సమస్యపై గ్రామస్థులు గతంలో జిల్లా కలెక్టర్‌ని కలిసి మొరపెట్టుకోగా, సానుకూలంగా స్పందించిన కలెక్టర్ 02-03-2026వ తేదీన ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలంటూ ఆర్.డి.ఓకి ఆదేశాలు జారీ చేశారు. ఆర్.డి.ఓ.. ఈ ఫైల్‌ను తదుపరి చర్యల కోసం హోలహరి తహశీల్దార్ కార్యాలయానికి పంపారు. కలెక్టర్ ఆదేశాలు వచ్చి నెలలు గడుస్తున్నా, గ్రామస్థులు పలుమార్లు తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగినా ఎలాంటి చలనం లేదు. వీలయినంత త్వరగా తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

తమ కుటుంబానికి వంశపారంపర్యంగా వస్తున్న భూముల రికార్డులను అక్రమంగా మార్చేశారని, తమకు న్యాయం చేయాలని తిరుపతి జిల్లా సత్యవేడుకు చెందిన శివానందం విజ్ఞప్తి చేశారు. వందేళ్లకు పైగా తమ కుటుంబీకుల ఆధీనంలోనే ఉన్న భూములకు సంబంధించి ఇటీవల రెవెన్యూ రికార్డులను పరిశీలించగా అక్రమంగా మార్చినట్లు తెలిసింది. సత్యవేడు గ్రామానికి చెందిన సర్వే నెంబర్లు: 272, 286, 292, 298, 300, 302, 318, 350.బి, 372 పరిధిలోని భూములను రికార్డులలో కొన్నింటిని ప్రభుత్వ భూములుగాను, మరికొన్నింటిని వేరే వ్యక్తుల పేర్ల మీదకు మార్చేసారు. ఈ విషయంపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి న్యాయం జరగలేదు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

వీటితో పాటు పింఛన్, రేషన్, ఇళ్ల నిర్మాణాల సమస్యలపై అర్జీలు ఇచ్చి పరిష్కరించాలని పలువురు కోరగా.. మరికొందరు ఉద్యోగాల కోసం రెస్యూమ్ లు ఇచ్చారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నాం ఆర్థికతోడ్పాటు కల్పించాలని మరికొందరు అభ్యర్థనలు అందించారు.

# సమాజంలో వైషమ్యాల సృష్టికి భారీ కుట్ర



- కుల, మత, వర్గ దూషణలతో కూటమి ప్రభుత్వంపై విషం
- ఐదేళ్ల వైసీపీ అకృత్యాలపై మౌనం
- నేడు విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు
- తాడేపల్లి ప్యాలెస్ ఫండింగ్‌తోనే రెచ్చిపోతున్న సైకోలు
- నటుడు ప్రకాష్ రాజ్, రావణ్‌ల ద్వంద్వ నీతిని ఎండగట్టిన మంత్రి కందుల దుర్గేష్
- భావ ప్రకటన స్వేచ్ఛ పేరుతో కూటమి ప్రభుత్వం, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌పై విషం చిమ్మితే చట్టం ఊరుకోదు
- సోషల్ మీడియా సైకోలకు మంత్రి స్ట్రాంగ్ వార్నింగ్

విజయవాడ (చైతన్యరథం): సోషల్ మీడియా వేదికగా కుల, మత విద్వేషాలు రేపుతూ, వ్యక్తిగత దూషణలకు దిగుతున్న వారిపై రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దేవుడు నోరిచ్చాడు కదా అని ఇష్టానుసారం మాట్లాడితే చట్టం తన పని తాను చేసుకుపోతుందని, ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. శనివారం విజయవాడ బెంజ్ సర్కిల్ సమీపంలోని కేపీ నగర్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ సోషల్ మీడియాలో 'జస్ట్ ఆస్కింగ్' అంటూ గొంతు చించుకునే నటుడు ప్రకాష్ రాజ్, మత ఘర్షణలు సృష్టించేలా మాట్లాడే జోసెఫ్ రావణ్ మధ్య అపవిత్ర బంధం ఉందని, వీరుద్దరూ కలిసి కూటమి ప్రభుత్వంపై, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పై కుట్రపూరిత డిబేట్లు నడుపుతున్నారని ఆరోపించారు. ఇందుకు సంబంధించిన పక్కా ఆధారాలు, ఆడియో లీక్స్‌ను మంత్రి దుర్గేష్ ఈ సందర్భంగా మీడియాకు బహిర్గతం చేశారు.

ఇది కేవలం ప్రకాష్ రాజ్, రావణ్ వ్యవహారం కాదు. వీరి వెనుక ఒక పెద్ద వ్యవస్థ ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో శాంతిభద్రతల సమస్య సృష్టించడానికి తాడేపల్లి ప్యాలెస్ లోని 'ప్యాలెస్ పార్టీ' షెల్ కంపెనీల ద్వారా వీరికి ప్రతి నెలా భారీగా ఫండింగ్ అందుతోంది. రాష్ట్రంలో కుల, మత ఘర్షణలు రేపి ఆ మంటల్లో చలి కాచుకోవాలని చూస్తున్నారు. సనాతన ధర్మం, భారత జాతీయవాదం గురించి మాట్లాడే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పై కక్ష గట్టి, ఆయనను బలహీనపర్చడమే లక్ష్యంగా ఈ యాంటీ సోషల్ ఎలిమెంట్స్ పనిచేస్తున్నాయి. తెర వెనుక ఉన్న ఆ అసలు కుట్రదారుల బండారాన్ని త్వరలోనే పోలీసులు ఛేదిస్తారని మంత్రి కందుల దుర్గేష్ వివరించారు.

### అప్పుడెందుకు నోరు మెదపలేదు

2019-2024 మధ్య కాలంలో రాష్ట్రంలో జరిగిన దారుణాలపై ప్రకాష్ రాజ్ ఎందుకు నోరు మెదపలేదని మంత్రి దుర్గేష్ నిలదీశారు. దళిత వైద్యుడు డాక్టర్ సుధాకర్ మరణానికి జగన్ కక్షసాధింపు కారణం కాదా? అప్పుడు మీ గొంతు ఎందుకు మూగబోయింది? అని ప్రశ్నించారు. దళిత డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యాన్ని వైసిపి ఎమ్మెల్సీ అనంతబాబు హత్య చేసి, శవాన్ని డోర్ డెలివరీ చేస్తే ప్రకాష్ రాజ్, రావణ్ ఏ ప్యాలెస్‌లో నిద్రపోతున్నారు? అని నిలదీశారు. హిందూ ఆలయాలపై దాడులు జరిగి, శ్రీరాముడి విగ్రహం తల నరికినప్పుడు మీ 'జస్ట్ ఆస్కింగ్' ఏమైపోయింది? కూటమి ప్రభుత్వంపై విషం చిమ్మడం, వైసీపీని అసలు ప్రశ్నించకపోవడమేనా మీ సిద్ధాంతం? అని మంత్రి దుయ్యబట్టారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ విజన్‌ను కొనియాడుతూ.. గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ శాఖల ద్వారా గిరిజన గ్రామాలకు రోడ్లు, విద్యుత్ సదుపాయాలు కల్పిస్తూ ఆయన చేస్తున్న అభివృద్ధి.. కళ్లున్న కబోది ప్రకాష్ రాజ్‌కు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. సమాజాన్ని విడగొట్టే విమర్శలు చేయడం చాలా సులువని, కానీ కూలిపోతున్న వ్యవస్థలను చక్కదిద్దుతూ సమాజాన్ని నిర్మించడం చాలా కష్టమని, జనసేనాని పవన్ కళ్యాణ్ ఒక 'నిర్మాణ విక్రమార్కుడు' అని మంత్రి అభివర్ణించారు. సినిమా స్క్రిప్ట్‌లు చదివి మాట్లాడేవా రికి, ప్రజల సమస్యల స్క్రిప్ట్‌ను స్వయంగా చదివి పరి ష్కరించే జనసేనాని వ్యూహం ఎప్పటికీ అర్థం కాదన్నారు. విమర్శల స్థాయి ప్రకాష్ రాజ్‌ది అయితే.. విశ్వసనీయత స్థాయి తమ నాయకుడు పవన్ కళ్యాణ్ దని, ఇలాంటి కుట్రలను ప్రజలు నమ్మరని, త్వరలోనే ఈ కుట్రల వెనుక ఉన్న అసలు సూత్రధారులను చట్టం ముందు నిలబెడతామని మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు.

చైతన్యరథం





# సుపరిపాలనతో స్వర్ణాంధ్ర

## నమ్మకాన్ని నిలబెట్టిన కూటమి ప్రభుత్వం




"ఒక మంచి ప్రభుత్వం ప్రజల జీవితాలను మార్చగలదు... ఒక గొప్ప ప్రభుత్వం ప్రజల ఆలోచనా విధానాన్నే మార్చగలదు."
ఈ మాటలు ఈరోజు ఆంధ్రప్రదేశ్ పరిస్థితిని చూస్తే అక్షరాలా నిజమనిపిస్తోంది.
ఒకప్పుడు ప్రభుత్వ కార్యాలయం అంటే భయం... పాలన అంటే అవినీతి... హక్కు కోసం అడిగితే కేసులు... అభివృద్ధి గురించి మాట్లాడితే కక్షలు... పెట్టుబడిదారులు రాష్ట్రంవైపు చూడడానికి కూడా భయపడే పరిస్థితి. రాజ్యాంగం కంటే పాలకుడి మాటే చట్టంగా మారిన ఐదేళ్లు ప్రజలు అనుభవించారు. అలాంటి సమయంలో ప్రజలు ఒక చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రాన్ని కాపాడాలంటే సుపరిపాలన అవసరమని భావించి కూటమికి అపూర్వ విజయాన్ని అందించారు. అది కేవలం ప్రభుత్వ మార్పు కాదు... పాలనా సంస్కృతిలో వచ్చిన విప్లవం.
నిజాయితీ రాజకీయాలకు ప్రతీకగా నిలిచిన చంద్రబాబునాయుడు...
వ్యవస్థల బలోపేతాన్ని లక్ష్యంగా పెట్టుకున్న పవన్‌కల్యాణ్...
దేశ అభివృద్ధి కోసం కృషి చేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ
సహకారంతో ఆంధ్రప్రదేశ్‌లో ప్రజా కేంద్రిత పాలనకు శ్రీకారం చుట్టబడింది.




### మొదటి నిర్ణయమే ప్రజల ఆస్తులకు భద్రత

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తీసుకున్న తొలి నిర్ణయాల్లో అత్యంత ముఖ్యమైనది ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు. ప్రజల భూములపై అనుమానాలు, భయాలు తొలగిపోయాయి. అంతటితో ఆగకుండా ఏపీ భూ ఆక్రమణ నిరోధక చట్టం–1982 స్థానంలో మరింత బలమైన AP Land Grabbing (Prohibition) Act-2024 తీసుకొచ్చింది. రీసర్వే ద్వారా అసలైన హక్కుదారులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలు అందించే ప్రక్రియ ప్రారంభమైంది. ప్రతి కుటుంబం తన భూమిపై నిశ్చింతగా జీవించే పరిస్థితి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం.

### ప్రజల మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను మరచిపోకుండా కొత్తగా మార్కాపురం, పోలవరం జిల్లాలను ఏర్పాటు చేసి ప్రజల ఆకాంక్షలను నెరవేర్చింది. ఇది ఎన్నికల హామీని పాలనలో అమలు చేసిన బాధ్యతాయుత ప్రభుత్వానికి నిదర్శనం.

### పెట్టుబడుల గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్

గతంలో పరిశ్రమలు రాష్ట్రాన్ని వదిలి వెళ్లాయి. కొత్త పెట్టుబడులు రావడం ఆగిపోయింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పరిస్థితి పూర్తిగా మారింది. 28 కొత్త పారిశ్రామిక విధానాలు తీసుకువచ్చి పెట్టుబడిదారులకు విశ్వాసం కల్పించింది. దేశంలోనే తొలిసారిగా పరిశ్రమలకు ఇవ్వాల్సిన ప్రోత్సాహకాలను సమయానికి చెల్లించేందుకు ఎస్క్రో అకౌంట్ల వ్యవస్థను ఏర్పాటు చేసింది. ఇప్పుడు ప్రపంచ దిగ్గజ సంస్థలు ఆంధ్రప్రదేశ్ వైపు చూస్తున్నాయి.

### ఆర్థిక క్రమశిక్షణతో అభివృద్ధి

గత ప్రభుత్వంలో అప్పుల భారంతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ కుదేలైంది. కూటమి ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ రుణాల రీషెడ్యూలింగ్ ద్వారా వడ్డీ భారాన్ని తగ్గించింది. 90కి పైగా కేంద్ర ప్రాయోజిత పథకాలను తిరిగి అమల్లోకి తీసుకొచ్చింది. 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేయించింది. స్థానిక సంస్థలకు బలం చేకూర్చింది. మూల ధన వ్యయం పెంచి 11.28 శాతం డబుల్ డిజిట్ గ్రోత్‌రేట్ సాధించడం రాష్ట్ర ఆర్థిక పునరుజ్జీవనానికి నిదర్శనం.

### అభివృద్ధికి మళ్లీ ఊపిరి

గతంలో వేలాది నిర్మాణ పనులు నిలిచిపోయాయి. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించలేదు. కూటమి ప్రభుత్వం 50 వేల మంది కాంట్రాక్టర్లకు సుమారు రూ.2వేల కోట్ల బకాయిలు చెల్లించింది. ఫలితంగా రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి పనులు తిరిగి వేగం పుంజుకున్నాయి. ఉచిత ఇసుక విధానంతో నిర్మాణ రంగానికి ఊతమిచ్చింది.

### స్వచ్ఛమైన రాష్ట్రం... ప్రజల భాగస్వామ్యం

ప్రజలపై భారంగా మారిన చెత్తపన్నును రద్దు చేసింది. 84 లక్షల టన్నుల లెగసీ వ్యర్థాలను తొలగిస్తూ స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ప్రతినెలా మూడో శనివారం ముఖ్యమంత్రి స్వయంగా స్వర్ణాంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొనడం ప్రజల్లో అవగాహన పెంచుతోంది.

### ప్రజల చేతిలోనే ప్రభుత్వం

ప్రభుత్వ సేవల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే రోజులు ముగిశాయి. మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా 1,035 ప్రభుత్వ సేవలు ప్రజల మొబైల్‌లో అందుబాటులోకి వచ్చాయి. ఇది డిజిటల్ గవర్నెన్స్‌లో దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది.

### విద్యుత్ రంగంలో సంస్కరణలు

గత ప్రభుత్వంలో వేల కోట్ల నష్టాల్లో కూరుకుపోయిన విద్యుత్ రంగాన్ని కూటమి ప్రభుత్వం గాడిలో పెట్టింది. దేశంలో తొలిసారిగా ట్రూ డౌన్ విధానానికి శ్రీకారం చుట్టింది. 90 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులకు ఒప్పందాలు కుదుర్చుకుని భవిష్యత్ విద్యుత్ అవసరాలకు పునాది వేసింది.




### అమరావతికి శాశ్వత హామీ

ఒక రాష్ట్రానికి రాజధాని ఏదో చెప్పుకోలేని పరిస్థితిని కూటమి ప్రభుత్వం ముగించింది. అమరావతిని ఆంధ్రప్రదేశ్‌కు శాశ్వత, ఏకైక రాజధానిగా చట్టబద్ధంగా రక్షించే దిశగా కీలక నిర్ణయాలు తీసుకుంది. రాజధాని రైతుల త్యాగానికి న్యాయం చేసింది.

### గంజాయిపై ఉక్కుపాదం

ఒకప్పుడు గంజాయి, డ్రగ్స్‌కు కేంద్రంగా మారిన ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పుడు పరిస్థితి మారుతోంది. ఈగల్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసి గంజాయి, మాదకద్రవ్యాలపై నిరంతర దాడులు చేపడుతోంది. నేరాల నియంత్రణలో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. మహిళల భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోంది.




### విద్యలో విలువల విప్లవం

మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో విద్యా రంగంలో ఎన్నో వినూత్న సంస్కరణలు అమలవుతున్నాయి. మెగా పేరెంట్స్–టీచర్స్ మీటింగ్, ముస్తాబు, ఆధునిక మౌలిక వసతులు, నాణ్యమైన బోధన...ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా తీర్చిదిద్దే ప్రయత్నం జరుగుతోంది. విద్యార్థుల్లో విలువలు, క్రమశిక్షణ, నైపుణ్యాలను పెంపొందించే దిశగా విద్యా వ్యవస్థ మారుతోంది.

### ఇదే అసలైన సుపరిపాలన

సుపరిపాలన అంటే కేవలం పథకాలు ఇవ్వడం కాదు.
ప్రజల ఆస్తులకు భద్రత కల్పించడం...
వ్యవస్థలపై నమ్మకం పెంచడం...
పెట్టుబడులు తీసుకురావడం...
యువతకు ఉద్యోగాలు కల్పించడం...
సాంకేతికతతో ప్రభుత్వాన్ని ప్రజల ఇంటి ముంగిటికి తీసుకురావడం...
పారదర్శకతతో నిర్ణయాలు తీసుకోవడం...
రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని దీర్ఘకాల ప్రణాళికలు అమలు చేయడం.
ఈ రెండేళ్లలో కూటమి ప్రభుత్వం అదే చేసి చూపించింది.
ఒక యువకుడిగా నాకు రాజకీయాల కంటే పాలన ముఖ్యం. నినాదాల కంటే ఫలితాలు ముఖ్యం. మాటల కంటే పనులు ముఖ్యం.
ఈ రెండేళ్లలో రాష్ట్రంలో కనిపిస్తున్న మార్పు చూస్తుంటే... సరైన నాయకత్వం ఉంటే వ్యవస్థలు మారతాయని, ప్రజల జీవితాలు మారతాయని మరోసారి నిరూపితమైంది.
స్వర్ణాంధ్ర కేవలం ఒక నినాదం కాదు.
అది ప్రతి రైతు చిరునవ్వులో...
ప్రతి విద్యార్థి ఆశలో...
ప్రతి మహిళ భద్రతలో...
ప్రతి యువకుడి ఉద్యోగంలో...
ప్రతి పెట్టుబడిలో...
ప్రతి గ్రామ అభివృద్ధిలో కనిపించాలి.
ఆ లక్ష్యంతో ముందుకు సాగుతున్న కూటమి ప్రభుత్వానికి ప్రజల మద్దతు కొనసాగితే... రాబోయే దశాబ్దాల్లో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అత్యుత్తమ పాలనకు చిరునామాగా నిలుస్తుందనే నమ్మకం నాలో ఉంది.

**శశికుమార్**
తెలుగుదేశం సైనికుడు



జోన్-1

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అరకు

ఆదివారం 5 జూలై 2026

చైతన్యరథం

# పల్లె పల్లెకూ ప్రగతి బాట



టెక్కలి (చైతన్యరథం): రాష్ట్రంలోనే టెక్కలిని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. గత పాలనలో వివక్షకు గురై, కనీస రహదారి సౌకర్యాల్లేక అంధకారంలో మగ్గిన మారుమూల పల్లెలకు ఇప్పుడు ప్రగతి వెలుగులు అందుతున్నాయి. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తన సొంత నియోజకవర్గంపై ప్రత్యేక శ్రద్ధ వహించి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహాయ సహకారాలతో నిధుల వరద పారిస్తున్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో మౌలిక వసతుల కల్పన, రహదారుల నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి.

### అడుగడుగునా అభివృద్ధి.

ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడమే ధ్యేయంగా మంత్రి అచ్చెన్నాయుడు నిరంతరం శ్రమిస్తున్నారు. రాజధానిలో ఎంత బిజీగా ఉన్నప్పటికీ.. దివంగత నేత ఎర్రన్నాయుడు స్ఫూర్తితో నియోజకవర్గ అభివృద్ధిని ఆయన ఎక్కడా విస్మరించడం లేదు. నియోజకవర్గ పరిధిలోని 4 మండలాల్లో ఉన్న 136 పంచాయతీలు, 514 గ్రామాల్లో దాదాపు రూ.370 కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టారు. గత పాలకుల నిర్లక్ష్యంతో నలిగిపోయిన గ్రామీణ రోడ్లకు శాశ్వత విముక్తి కలిగిస్తూ.. ఇప్పటివరకు 180 కిలోమీటర్లకు పైగా సీసీ రోడ్లు, 25 కిలోమీటర్ల మేర బీటీ రోడ్లను నిర్మించి గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచారు.

### సీఎం డీసీఎం సహకారంతోనే ప్రగతి సాధ్యం

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్, పంచాయతీరాజ్ శాఖామాత్యులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవ, ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి నారా లోకేష్ యువ శక్తే టెక్కలి నియోజకవర్గంలో ఈ అద్భుత ప్రగతికి మూలకారణాలని మంత్రి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో మేం ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటూ, కూటమి ప్రభుత్వ అగ్రనేతల ఆశీస్సులతో నిధుల కొరత లేకుండా పనులు పూర్తి చేస్తున్నామన్నారు. గత పాలకుల విధ్వంసం వల్ల చిన్నాభిన్నమైన పల్లెలను మళ్లీ ప్రగతి పథంలోకి తీసుకురావడానికి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పంచాయతీరాజ్ శాఖ ద్వారా ఇస్తున్న నిధులు, అనుమతులు గ్రామీణ ప్రాంతాల రూపురేఖలను మారుస్తున్నాయి. ఐటీ, గ్రామీణాభివృద్ధి దిశగా లోకేష్ అందిస్తున్న ఆలోచనలు యువతకు ఉపాధి కల్పించడంతో పాటు పల్లెల్లో మౌలిక వసతుల నాణ్యతను పెంచుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశయాలకు అనుగుణంగా, టెక్కలి నియోజకవర్గంలోని ప్రతి మారుమూల గ్రామానికి బీటీ, సీసీ రహదారులను అనుసంధానించి, రాష్ట్రంలోనే అగ్రగామిగా, ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే నా సంకల్పం.” అన్నారు.

### మౌలిక వసతుల జాతర:

నియోజకవర్గ వ్యాప్తంగా రూ.369.60 కోట్లతో మొత్తం 2,433 పనులు మంజూరు కాగా, ఇప్పటికే రూ.162.75 కోట్ల వ్యయంతో 1,051 పనులు విజయవంతంగా పూర్తయ్యాయి. మిగిలిన పనులు వివిధ దశల్లో వేగంగా సాగుతున్నాయి. మురుగునీటి పారుదల వ్యవస్థను మెరుగుపరుస్తూ నాలుగు మండలాల్లో రికార్డు స్థాయిలో 41.65 కిలోమీటర్ల పొడవైన సీసీ డ్రెయిన్లను నిర్మించారు. నందిగాం మండలంలో అత్యధికంగా 16.25 కి.మీ బీటీ రోడ్లు, సంతబొమ్మాళి మండలంలో అత్యధికంగా 56.30 కి.మీ సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టి రికార్డు సృష్టించారు.

అధికారంలోకి వచ్చిన అతి తక్కువ కాలంలోనే ఇంతటి భారీ మార్పును తీసుకురావడం మంత్రి అచ్చెన్నాయుడి పట్టుదలకు, నిబద్ధతకు నిదర్శనమని స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పల్లె వాకిట అడుగడుగునా కనిపిస్తున్న ఈ ప్రగతి చిత్రాలు టెక్కలి నియోజకవర్గ భవిష్యత్తును సరికొత్తగా ఆవిష్కరిస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు.

### గత పాలకుల వివక్షకు చెక్

“గత ప్రభుత్వంలో విపక్ష ఎమ్మెల్యేగా, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా అచ్చెన్నాయుడు పల్లెల సమస్యలపై ఎన్నో పోరాటాలు చేసినా నాటి పాలకులు రూపాయి నిధులు కూడా ఇవ్వకుండా వివక్ష చూపారన్నారు. అధికారులు సైతం వైసీపీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి చేతులెత్తేశారన్నారు. కానీ నేడు కూటమి ప్రభుత్వంలో ‘గ్రామాభివృద్ధే దేశాభివృద్ధి’ అనే నినాదంతో మారుమూల పల్లెలను సైతం ప్రధాన రహదారులతో అనుసంధానం చేస్తున్నారు. కూటమి నేతలు, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ టెక్కలిని రాష్ట్రంలోనే రోల్ మోడల్‌గా నిలుపుతున్నారు.



## ఎమ్వీవీఎస్ మూర్తి సేవలు మరువలేనివి

### టీడీపీ జిల్లా అధ్యక్షులు చోడే వెంకట పట్టాభిరామ్

విశాఖపట్టణం (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు స్వర్గీయ డా ఎంవీవీ ఎస్మూర్తి 88వజయంతి సందర్భంగా జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి జిల్లా అధ్యక్షులు చోడే వెంకట పట్టాభిరామ్ పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.. ఈ సందర్భంగా పట్టభి మాట్లాడుతూ ఎంవివిఎస్ మూర్తి సేవలు మరువలేనివి అని అన్నారు. లోక్ సభ సభ్యులుగా టీటీడీ నేతగా నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేసి తద్వారా పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. మాజీ మేయర్ శ్రీనివాసరావు, మొల్లి లక్ష్మణరావు, గోలగా గానివీరరావు, నక్క కనకరాజు, బల్ల శ్రీనివాస్ రావు,స్వచ్ఛంద్ర కార్పొరేషన్ డైరెక్టర్ మైలపల్లి నాగ లక్ష్మీ, తాతిమినేని శ్రీనివాసరావు, నడిగట్ల శంకర్రావు, ఏడుకొండలు, కే జనార్దన్, నరేంద్ర, యశోద పాల్గొన్నారు,

## ఘనంగా మన్యం వీరుడి జయంతి వేడుకలు

### నివాళులర్పించిన జిల్లా అదనపు ఎస్పీ ఎల్ మోహనరావు

అనకాపల్లి (చైతన్యరథం): మన్యం వీరుడు, విప్లవ యోధుడు అల్లూరి సీతారామరాజు 129వ జయంతి వేడుకలను అనకాపల్లి జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు.. జిల్లా అదనపు ఎస్పీఇతర పోలీసు అధికారులు, సిబ్బంది అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి వినమ్రంగా ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మోహనరావు మాట్లాడుతూ “బ్రిటిష్ వలస పాలకుల నిరంకుశత్వానికి వ్యతిరేకంగా, మన్యం ప్రజల హక్కుల కోసం అల్లూరి సీతారామరాజు చేసిన సాయుధ పోరాటం భారత స్వాతంత్ర్య చరిత్రలోనే ఒక అద్భుత అధ్యాయం. ఆయన జయంతి తెలుగు ప్రజలకే కాకుండా యావత్ దేశానికే గర్వకారణం. బ్రిటిష్ అధికారుల దమనకాండను, దౌర్జన్య విధానాలను ఎదురిస్తూ, గిరిజనుల హక్కుల రక్షణ కోసం తన ప్రాణాలను అర్పించిన మహనీయుడు అల్లూరి.” అని కొనియాడారు.?అలాగే, “1924 మే 7న విశాఖపట్నం జిల్లా మంప గ్రామం వద్ద బ్రిటిష్ తూటాలకు బలై, చివరి శ్వాస వరకు ప్రజా హక్కుల కోసమే పోరాడిన అల్లూరి సీతారామరాజు త్యాగం భారత చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతుంది” అని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను, దేశభక్తిని నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని అదనపు ఎస్పీ పిలుపునిచ్చారు.?ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీతో పాటు ఇన్‌స్పెక్టర్లు లక్ష్మి, శ్రీనివాసరావు, పిల్లా రమేష్, సూరి నాయుడు, ఎస్సైలు ప్రసాద్, సురేష్ బాబు, అంజిబాబు, ఆఫీస్ సూపరింటెండెంట్ ప్రతాప్ శేషయ్య మరియు కార్యాలయ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని అల్లూరి అమరత్వానికి జోహార్లు అర్పించారు.





## పట్టణాలతో సమానంగా గ్రామీణాభివృద్ధికి ప్రాధాన్యత

### దొండపూడిలో పార్కు, మల్టీ పర్పస్ హాలు నిర్మాణానికి భూమి పూజ చేసిన వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు, ఎమ్మెల్యే రాజు

విశాఖపట్టణం (చైతన్యరథం): చోడవరం నియోజకవర్గం రావికమతం మండలం దొండపూడి గ్రామంలో వీఎంఆర్డీఏ నిధులతో నిర్మించనున్న పార్కు, మల్టీ పర్పస్ హాలు నిర్మాణానికి భూమిపూజ జరిగింది. వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనల తో ఆరోగ్యాంధ్ర ప్రదేశ్‌గా తీర్చిదిద్దటమే లక్ష్యంగా పని చేస్తున్నామని పేర్కొన్నారు. దొండపూడి గ్రామ ప్రజలకు ఆహ్లాదాన్ని, ఆరోగ్యాన్ని అందించేలా అన్ని సదుపాయాలతో పార్క్‌ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. గ్రామస్తుల శుభ కార్యాలు నిర్వహించుకునేందుకు అనుగుణంగా మల్టీ పర్పస్ హాలు నిర్మాణం చేపడుతున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, పురపాలక శాఖామాత్యులు నారాయణ సూచనలతో గ్రామీణ ప్రాంతాలను పట్టణీకరణ దిశగా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. అనకాపల్లి జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో మౌలిక సదుపాయాలు కల్పన కోసం ఇప్పటివరకు రూ.50 కోట్లకు పైగా నిధుల కేటాయింపు జరిగిందన్నారు. అలానే ప్రజల అవసరాల్ని దృష్టి లో ఉంచుకొని నిధులు కేటాయించడం జరుగుతుందన్నారు. ఉత్తరాంధ్ర ను ఉత్తమ ప్రాంతంగా తీర్చిదిద్దటమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కృషి చేస్తున్నారని, ఇందులో భాగంగానే అనేక పరిశ్రమలను తీసుకువచ్చారని, దీంతో యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. ప్రస్తుతం చేపడుతున్న అభివృద్ధి పనులను అక్టోబర్ నెలాఖరు నాటికి పూర్తి చేస్తామని పేర్కొన్నారు. చోడవరం ఎమ్మెల్యే కే ఎస్ ఎన్ ఎస్ రాజు మాట్లాడుతూ వి ఎం ఆర్ డి ఎ నిధులతో కళ్యాణమండపాలు, సామాజిక భవనాలు, పార్కులు అభివృద్ధి చేయాలని వి ఎం ఆర్ డి ఎ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్ ను కోరారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో మౌలిక సదుపాయాలు కల్పనకు ప్రాధాన్యత ఇవ్వటం అభినందనీయమని పేర్కొన్నారు. మాడుగుల, చోడవరం నియోజకవర్గం పరిధిలో అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని కోరారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా మౌలిక వసతులు, రాజదారులు, కాలువలు, కల్వర్టు ల నిర్మాణానికి ఎత్తున నిధులు మంజూరు చేయటంలో ఆయా ప్రాంతాలన్నీ అభివృద్ధి బాటలో పయనిస్తున్నానని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ చిరంజీవి రావు మాట్లాడుతూ గత ఐదేళ్లుగా అభివృద్ధి కుంటుపడిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి కళ్ళ ముందు కనిపిస్తుందని అని పేర్కొన్నారు. గతంలో వి ఎం ఆర్ డి ఎ చైర్మన్ అంటే ఎవరికి తెలియని పరిస్థితి ఉండేదని, కానీ నేడు వి వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్ పేరు అభివృద్ధి కి మారు పేరుగా మారు మోగుతుందన్నారు. వీఎంఆర్డీఏ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపడుతున్నారు అని కితాబిచ్చారు. అనంతరం వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పర్యవేక్షక ఇంజినీర్ రాంబాబు, ఉపకార్యనిర్వాహక ఇంజనీర్ మురళీకృష్ణ, స్థానిక నాయకులు వెంకటాచారి, నాయుడు, రామానాయుడు, శంకర్ రావు, చంద్ర, చిన్న పాల్గొన్నారు.

# ప్రభుత్వ డేటా భద్రత మరింత కట్టుదిట్టం



## ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహన కృష్ణ

అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని ప్రభుత్వ శాఖల్లో అమలవుతున్న సైబర్ సెక్యూరిటీ వ్యవస్థలను సమీక్షించి, రాష్ట్ర ప్రభుత్వ డేటా భద్రతను మరింత బలోపేతం చేసే దిశగా రాష్ట్రం లోని అన్ని ప్రభుత్వ శాఖల తో సచివాలయంలో ఏపీటీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సైబర్ సెక్యూరిటీ వర్క్‌షాప్‌లో ముఖ్య అతిధిగా ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహన కృష్ణ పాల్గొన్నారు. "రాష్ట్ర డేటా భద్రత కోసం రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ వ్యవస్థల్లో సైబర్ సెక్యూరిటీ ఫ్రేమ్‌వర్క్‌ల బలోపేతం" అంశంపై ఆంధ్రప్రదేశ్ సచివాలయం లో ఈ వర్క్ షాప్ ూాూా నిర్వహించింది. ఈ సందర్భంగా మన్నవ మోహన కృష్ణ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రభుత్వ సేవలను వేగంగా డిజిటలైజ్ చేస్తోందని, ఈ నేపథ్యంలో పౌరుల వ్యక్తిగత సమాచారం, ఆరోగ్య వివరాలు, విద్య, భూ రికార్డులు, సంక్షేమ పథకాలు, ఆర్థిక లావాదేవీల వంటి అత్యంత కీలకమైన ప్రభుత్వ డేటాను రక్షించడం ప్రభుత్వ అత్యున్నత బాధ్యతగా మారిందని మన్నవ మోహన కృష్ణ పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ శాఖ ప్రస్తుతం సైబర్ భద్రతను ఏ విధంగా అమలు చేస్తోంది, ఎలాంటి సవాళ్లు ఎదుర్కొంటోంది, వాటిని అధిగమించేందుకు ఎలాంటి ఆధునిక భద్రతా వ్యవస్థలు అవసరమనే అంశాలపై ఈ వర్క్‌షాప్‌లో విస్తృతంగా చర్చించినట్లు మన్నవ మోహన కృష్ణ గారు తెలిపారు. అన్ని శాఖల్లో అత్యుత్తమ సైబర్ సెక్యూరిటీ ప్రమాణాలు అమలు చేయడం, డేటా భద్రతను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దడం, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ ఫ్రేమ్‌వర్క్‌ను మరింత బలోపేతం చేయడమే ఈ సమావేశం ప్రధాన ఉద్దేశ్యమని మోహన కృష్ణ అన్నారు. సైబర్ దాడుల స్వరూపం రోజురోజుకూ మారుతున్న నేపథ్యంలో ప్రభుత్వ శాఖలు సాంకేతిక పరిజ్ఞానం పెంచుకోవడంతో పాటు నిరంతర పర్యవేక్షణ, శిక్షణ, అవగాహన, వేగవంతమైన స్పందన వ్యవస్థలపై కూడా దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. సురక్షితమైన డిజిటల్ పాలన ద్వారా ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించడమే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. భారతదేశంలో సైబర్ మోసాలు అరికట్టటానికి, రాష్ట్ర ప్రభుత్వాలతో సమన్వయము చేసుకుంటూ కేంద్ర ప్రభుత్వం వివిధ రాష్ట్రాల్లో సమీక్షలు నిర్వహిస్తోందని, ఆంధ్రప్రదేశ్ లో కూడా నేషనల్ సైబర్ సెక్యూరిటీ టీం తో కలిసి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఆగస్టు నెలలో కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న దేశావ్యాప్త సైబర్ సెక్యూరిటీ సదస్సు సన్నాహాల్లో భాగంగా అన్ని ప్రభుత్వ శాఖల సైబర్ భద్రత ప్రమాణాలను సమీక్షిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ డేటా భద్రతను మరింత బలోపేతం చేయడం, అన్ని ప్రభుత్వ శాఖల్లో ఏకరీతి సైబర్ సెక్యూరిటీ ప్రమాణాలను అమలు చేయడం, కీలక డిజిటల్ మౌలిక వసతుల రక్షణ, భారతదేశం లోని రాష్ట్రాల మధ్య ఉత్తమ విధానాల మార్పిడి, జాతీయ స్థాయిలో సమన్వయంతో సైబర్ భద్రతా కార్యాచరణ రూపొందించడం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇచ్చారు. ప్రభుత్వ శాఖల్లో నిరంతర సైబర్ భద్రతా పర్యవేక్షణ, రిస్క్ అసెస్‌మెంట్, స్టేట్ డేటా సెంటర్లు, ూాూాచీ నెట్‌వర్క్‌ల భద్రత, సైబర్ ఘటనలకు వేగవంతమైన స్పందన వ్యవస్థలు, పాత అప్లికేషన్ల ఆధునికీకరణ, డేటా రక్షణ, గోప్యతా ప్రమాణాలు, అన్ని శాఖల్లో జ×ూాల నియామకం, అధికారులకు సైబర్ భద్రతపై శిక్షణ, అవగాహన కార్యక్రమాల నిర్వహణ వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. వర్క్‌షాప్‌లో రాష్ట్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల అధికారులు తమ శాఖల్లో అమలవుతున్న సైబర్ సెక్యూరిటీ విధానాలను ప్రజెంటేషన్ల రూపంలో వివరించగా, అనంతరం ఆరు గ్రూపులుగా విభజించి ఆయా అంశాలపై సవివరంగా చర్చించారు. గ్రూపుల నుంచి వచ్చిన సూచనలు, సిఫార్సులను సమగ్రంగా సమీక్షించి భవిష్యత్తులో రాష్ట్ర ప్రభుత్వ సైబర్ భద్రతా విధానాన్ని మరింత సమర్ధవంతంగా రూపొందించేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ సందర్భంగా ూాూా మేనేజింగ్ డైరెక్టర్ మల్లవరపు సూర్యతేజ గారు ఈ సదస్సులో పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వంలోని అన్ని శాఖల్లో సైబర్ భద్రతా ప్రమాణాలను మరింత బలోపేతం చేయడానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతో పాటు అధికారులకు నిరంతర శిక్షణ, సామర్థ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడం అవసరమని తెలిపారు. ప్రభుత్వ డేటా భద్రత, సురక్షిత డిజిటల్ పాలన లక్ష్యంగా అన్ని శాఖలతో సమన్వయంతో ూాూా నిరంతరం పనిచేస్తోందని సూర్యతేజ పేర్కొన్నారు. ఏపీ ఫైనాన్స్ జాయింట్ సెక్రటరీ సందీప్ కృపాకర్ గుండాల, సైబర్ క్రైమ్స్ సూపరింటెండెంట్ అఫ్ పోలీస్ అదిరాజ్ సింగ్ రాష్ట్ర ప్రభుత్వ వివిధ శాఖల ఉన్నతాధికారులు, కేంద్ర ఎలక్ట్రానిక్స్ ఐటీ మంత్రిత్వ శాఖ సైబర్ సెక్యూరిటీ నిపుణులు పాల్గొన్నారు.




# సమస్యలు పరిష్కరిస్తా : ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి (చైతన్యరథం): ఎమ్మెల్యే కార్యాలయంలో నకరికల్లు మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొన్నతెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు, సత్తెనపల్లి నియోజకవర్గ శాసన సభ్యుడు కన్నా లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు. ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలపై వినతి పత్రాలు అందించారు. ప్రజల నుండి నేరుగా ఫిర్యాదులను శాసనసభ్యుడు కన్నా స్వీకరించారు. గత ప్రభుత్వం మాదిరిగా కాకుండా ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రజలు తన దృష్టికి కొన్ని సమస్యలు. గృహ,పెన్షన్, వైద్యం,పలు సమస్యలు తీసుకొచ్చారు. సమస్యల తక్షణ పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అందరి సమస్యలు పరిష్కరిస్తామని, హామీ ఇచ్చారు.

# ఘనంగా అల్లూరి జయంతి వేడుకలు

## పాల్గొని నివాళులర్పించిన ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

విజయవాడ (చైతన్యరథం): భారతదేశ స్వాతంత్రం కోసం విరోచితంగా పోరాడిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు త్యాగశీలిని, పోరాటపటిమను స్ఫూర్తిగా తీసుకొని నేటి యువత సమాజాభివృద్ధి కోసం కృషి చేయాలని, స్వాతంత్ర్య సమరయోధుడు, విప్లవ వీరుడు, అగ్గి పిడుగు అల్లూరి సీతారామరాజు జయంతి నీ పురస్కరించుకొని ఈరోజు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి జిల్లా ఎస్పీ వి విద్యాసాగర్ నాయుడు ఐపీఎస్ పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఎస్పీ మాట్లాడుతూ సీతారామరాజు భారత స్వాతంత్ర చరిత్ర లో ఒక మహోజ్వల శక్తి , బ్రిటిష్ వారి గుండెల్లో సింహస్వప్నంగా నిలిచిన విప్లవ జ్యోతి అని, ఆయన జరిపిన సాయుధ పోరాటం స్వతంత్ర చరిత్రలో ఒక ప్రత్యేక అధ్యాయమన్నారు. సాయుధ పోరాటం ద్వారానే స్వతంత్రం వస్తుందని నమ్మి దాని కొరకే తన ప్రాణాలర్పించాడని, అతడి దేశభక్తి స్ఫూర్తి, భారతీయ జాతీయవాదం జ్వాలలను రేకెత్తించిందని, దేశంలో బ్రిటిష్ పాలకుల దోపిడీ, దురాగతాలు, దమనకాండలకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేపట్టేందుకు అనేకమందిని ప్రేరేపించిందని గుర్తుచేశారు. సీతారామరాజు సాగించిన సాయుధ పోరాటం తెలుగు జాతి చరిత్రలో గొప్ప ఘట్టంగా చిరస్థాయిగా నిలిచి ఉంటుందని, తెలుగు జాతి తెగువకు నిలువెత్తు నిదర్శనమన్నారు.ఆయన త్యాగశీలిని, పోరాటపటిమను నేటి యువత స్ఫూర్తిగా తీసుకొని సమాజాభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. అనంతరం పోలీస్ అధికారులకు సిబ్బందికి మిఠాయిలు అందజేశారు.



# ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభకు ప్రోత్సాహించాలి

## టీడీపీ యువ నాయకుడు బొండా రవితేజ పిలుపు



విజయవాడ (చైతన్యరథం): అజిత్‌సింగ్ నగర్‌లోని పీఎంఎం.కే. బేగ్ మునిసిపల్ హైస్కూల్‌లో 2025, 26 విద్యా సంవత్సరానికి సంబంధించిన పదవ తరగతి విద్యార్థుల ఉత్తమ ప్రతిభను గుర్తిస్తూ ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ప్రభుత్వ విప్, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యుడు బోండా ఉమా మహేశ్వరరావు సౌజన్యంతో ఆయన కుమారుడు రవితేజ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రతిభ కనబరిచిన 20 మంది విద్యార్థులను నగదు బహుమతులు, బ్యాగులు, గిఫ్ట్‌లతో ఘనంగా సత్కరించారు. పదవ తరగతి వార్షిక పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించి పాఠశాల ప్రథమ స్థానంలో నిలిచిన షేక్ రాహేలాకు రూ.10,000 నగదు బహుమతితో పాటు ప్రత్యేక బహుమతిని అందజేశారు. ద్వితీయ స్థానం సాధించిన తోటకుచ్చి హారిక, తృతీయ స్థానం సాధించిన తరుణ్ భాష్యలకు రూ.5,000 చొప్పున నగదు బహుమతులు అందజేశారు. మిగిలిన ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించి అభినందించారు. ఈ సందర్భంగా బోండా రవితేజ మాట్లాడుతూ విద్యే జీవితాన్ని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లే గొప్ప ఆయుధమని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు కూడా ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కృషి చేస్తే దేశ స్థాయిలో రాణించగలరని పేర్కొన్నారు. ప్రతిభను ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, భవిష్యత్తులో కూడా విద్యార్థులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ వారి ఉన్నత విద్యకు అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు మైనం హుస్సేన్ మాట్లాడుతూ, ఉపాధ్యాయుల అంకితభావం, విద్యార్థుల కృషి, తల్లిదండ్రుల సహకారంతోనే ఈ అద్భుత ఫలితాలు సాధ్యమయ్యాయని తెలిపారు. రానున్న సంవత్సరాల్లో మరింత మెరుగైన ఫలితాలు సాధించేలా కృషి చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు బంగారు నాయుడు, పార్లమెంట్ స్థాయి కార్యదర్శి పర్వీన్, గౌసియా, నవీన్, మహేష్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా విప్లవజ్యోతి అల్లూరి జయంతి వేడుకలు

## దేశభక్తి, ధైర్యసాహసాలకు ప్రతీక : విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమా నివాళులు



విజయవాడ (చైతన్యరథం): సెంట్రల్ నియోజకవర్గం 30వ,డివిజన్ రామకృష్ణాపురంలోని అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద క్షత్రియ యువత సంఘం ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు 129వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు హాజరై అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా బొండా ఉమా గారు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరంలో అల్లూరి సీతారామరాజు చేసిన త్యాగాలు, ఆయన చూపిన ధైర్యసాహసాలు నేటి యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని సమాజాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. వారి సేవలను చిరస్మరణీయంగా నిలుపుకోవడం ప్రతి భారతీయుడి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్స్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్స్ వర్కర్స్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు, కాకర్లపూడి బ్రహ్మరాజు, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ డీజేపీఎన్ రాజు, కల్లేపల్లి సాయిరామరాజు, డివిజన్ పార్టీ అధ్యక్షులు లక్కంరాజు శ్రీనివాసరాజు, డివిజన్ ఇంచార్జ్ వెంకటరమణ, భద్రం, గొట్టుముక్కల వెంకటేశ్వరరాజు, రత్నకుమారి, రమేశ్ వర్మ, సుధీర్ వర్మ, క్షత్రియ యువత సంఘం ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.




## అమరావతి అభివృద్ధి ఆపాలన్న

# వైసీపీ కుట్రలు ఫలించవు: దేవినేని ఉమా

గొల్లపూడి (చైతన్యరథం): అమరావతి అభివృద్ధిని అడ్డుకోవాలన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కుట్రలు ఎప్పటికీ ఫలించవని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. శనివారం గొల్లపూడిలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అమరావతి రైతులు, మహిళలపై ఐదేళ్లపాటు వైసీపీ ప్రభుత్వం సాగించిన దౌర్జన్యాలు రాష్ట్ర ప్రజలు ఎప్పటికీ మరచిపోరని అన్నారు. స్వాతంత్ర్యోద్యమం తర్వాత అంతటి సుదీర్ఘ ప్రజా ఉద్యమంగా అమరావతి ఉద్యమం నిలిచిందని, ప్రజలే తమ రాజధానిని కాపాడుకున్న చరిత్ర సృష్టించారని పేర్కొన్నారు. యువగళం పాదయాత్ర సందర్భంగా నారా లోకేష్‌పై మైకులు, స్టూల్లు లాక్కొని దాడులు చేసిన ఘటనలను ప్రజలు ఇంకా గుర్తుంచుకున్నారని, నేడు అదే నాయకులు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని విమర్శించారు. రాష్ట్రానికి పరిశ్రమలు రాకుండా చేయడం, అమరావతిలో నిర్మాణాలు జరగకుండా అడ్డుకోవడమే వైసీపీ అసలు ధ్యేయమని ఆరోపించారు. కులాలు, మతాలు, ప్రాంతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవాలని వైసీపీ ప్రయత్నిస్తోందని అన్నారు. గండికోట నుంచి పులివెందులకు నీళ్లు తీసుకుపోలేని జగన్ మోహన్ రెడ్డి నేడు నీటి ప్రాజెక్టులపై రాజకీయాలు మాట్లాడటం ఆశ్చర్యకరమన్నారు. ఐదేళ్ల అరాచక పాలనకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పినా వైసీపీ నాయకుల వైఖరిలో ఎలాంటి మార్పు కనిపించడం లేదని విమర్శించారు. ప్రస్తుతం అమరావతి నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని, రాజధాని నిర్మాణాన్ని ఎవరూ అడ్డుకోలేరని దేవినేని ఉమా స్పష్టం చేశారు. రాయలసీమను రత్నాల సీమగా, హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కార్యాచరణ చేపట్టిందన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసీపీ నేతలు విమర్శలు చేస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను సమతుల్యంగా అభివృద్ధి చేసి ఆంధ్రప్రదేశ్‌ను దేశంలో అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రెండేళ్లలో రూ.24 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించడం, 24 లక్షల ఉద్యోగ అవకాశాల కల్పన దానికి నిదర్శనమని తెలిపారు. రాజధాని అంశంపై పూటకో మాట, ఎన్నికలకో వైఖరితో వైసీపీ నాయకత్వం వ్యవహరిస్తోందని, సొంత పార్టీ నేతలే అయోమయంలో ఉన్న పరిస్థితి నెలకొందని దేవినేని ఉమామహేశ్వరరావు విమర్శించారు.

# అమరావతిపై ఆటలాడితే సహించం

## రాజధానిపై జగన్ తీరు దుర్మార్గం : గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ హెచ్చరిక



గుంటూరు (చైతన్యరథం): ఆంధ్రుల ఆత్మ గౌరవానికి ప్రతీక అమరావతి రాజధాని అని, రాష్ట్రానికి గుండెవంటి ప్రాంతంపై వైసీపీ ఇష్టారీతిన మాట్లాడటం దారుణమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. శనివారం స్థానికి నెహ్రూనగర్ లో రూ.46 లక్షలు, బుచ్చయ్యతోటలో 36.50 లక్షలు, మల్లిఖార్జున పేటలో రూ.53 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో రాష్ట్రానికి రాజధాని ఎక్కడ ఉందో కనీసం గూగుల్ కూడా చెప్పలేని దారుణమైన పరిస్థితి నెలకొందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మహా సంకల్పంతో అమరావతి వంటి గొప్ప రాజధాని నిర్మాణం చేపడితే ఒక రోజు మూడు రాజధానులు, మరో రోజు మావిగన్, ఇంకో రోజు విజయవాడ అంటూ జగన్ పిచ్చిగా మాట్లాడుతున్నారని విమర్శించారు. గత వైసీపీ పాలనలో రాష్ట్రం నుంచి పరిశ్రమలు పారిపోయాయని, తమ ప్రభుత్వంలో పరిశ్రమలకు కేరాఫ్ గా ఆంధ్రప్రదేశ్ ను తీర్చిదిద్దామని తెలిపారు. 20 లక్షల ఉద్యోగాల కల్పన దిశగా చర్యలు చేపట్టామని, ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేయడమే లక్ష్యమని చెప్పారు. రాష్ట్రంలో ఎన్నికల కమిషన్ చేపట్టిన సర్ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని, దీనికి అందరూ సహకరించాలని కోరారు. సర్ పై అపోహలు వద్దని స్పష్టం చేశారు.



# అన్నదాత హక్కులకు ఎన్డీయే ప్రభుత్వం భరోసా

## ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దుతో భూములపై పూర్తి హక్కులు రైతులకే: చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ(బొల్లాపల్లి): నియోజకవర్గంలోని బొల్లాపల్లి మండలం సరికొండపాలెం గ్రామంలో నిర్వహించిన 'మీ భూమి, మీ హక్కు' కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు రైతులకు ప్రభుత్వ రాజముద్రతో కూడిన నూతన పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో పాసు పుస్తకాలపై రాజకీయ నాయకుల ఫోటోలు ఉండటంతో బ్యాంకులు రుణాల మంజూరులో ఇబ్బందులు సృష్టించేవని, ఇప్పుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ప్రభుత్వం కేవలం ప్రభుత్వ అధికారిక రాజముద్రతో జీవితాంతం చెల్లుబాటు అయ్యే పాసు పుస్తకాలను అందిస్తోందన్నారు. వీటిలోని క్యూఆర్ కోడ్ ద్వారా భూమి వివరాలను సులభంగా తెలుసుకోవచ్చని, ఏవైనా వివరాల్లో తప్పులు ఉంటే వీఆర్వోకు దరఖాస్తు చేస్తే 15 రోజుల్లో సవరణ చేసి కొత్త పుస్తకం అందజేస్తామని తెలిపారు.

గత వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రైతుల భూ హక్కులను హరించేలా రూపొందించబడిందని జీవీ ఆంజనేయులు విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ చట్టాన్ని రద్దు చేసి రైతులకు పూర్తి హక్కులు కల్పించిందన్నారు. గత ఐదేళ్ల పాలనలో ఉద్యోగాల కల్పనలో పూర్తిగా విఫలమైన వైసీపీ ప్రభుత్వం యువత భవిష్యత్తును దెబ్బతీసిందని, నాసిరకం మద్యం విక్రయాలతో ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టిందని ఆరోపించారు.

వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుపై కూడా జీవీ ఆంజనేయులు తీవ్ర విమర్శలు గుప్పించారు. దళితులు, పేదల భూముల ఆక్రమణల నుంచి ప్రభుత్వ భూముల వ్యవహారాల వరకు ఆయనపై పలు ఆరోపణలు చేస్తూ, ప్రజలు ఇప్పటికే ఆయనను తిరస్కరించారని అన్నారు.

ప్రస్తుతం తప్పుడు ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు.

రాష్ట్రంపై గత ప్రభుత్వ అప్పుల భారం ఉన్నప్పటికీ ఎన్నికల హామీల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని జీవీ ఆంజనేయులు స్పష్టం చేశారు. రానున్న రెండు నుంచి మూడు నెలల్లో అర్హులైన వృద్ధులు, వితంతువులకు కొత్త పెన్షన్లు మంజూరు చేయడంతో పాటు, గ్రామాల్లో అర్హులైన పేదలకు ఇళ్లను మంజూరు చేస్తామని తెలిపారు. అలాగే వినుకొండ కొండ ఘాట్ రోడ్డు, రామలింగేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి పనులు, గిరి ప్రదక్షిణ రహదారి పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. మూడోసారి తనను రికార్డు మెజారిటీతో గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతూ, నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. అధికారులు కూటమి పార్టీ నాయకులు, రైతు సంఘ నాయకులు రైతులు తదితరులు పాల్గొన్నారు

జోన్-4

(ఒంగోలు, నెల్లూరు, రాజంపేట, తిరుపతి, చిత్తూరు)

చైతన్యరథం

# స్వాతంత్ర్య పోరాటంలో తెలుగువారి పాత్ర అనితరసాధ్యం

## టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దాసరి శ్యామ్‌చంద్ర శేషు



జంగారెడ్డి గూడెం (చైతన్యరథం): స్వాతంత్ర్య సమరయోధులు తెలుగువారి గుండె చప్పుడు మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి, భారత దేశ జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య వర్ధంతి సందర్భంగా జంగారెడ్డిగూడెంలో విజ్ఞాన్ జూనియర్ కళాశాలలో రాష్ట్ర శెట్టిబలిజ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చిట్టిబొయిన రామలింగేశ్వర రావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దాసరి శ్యామ్ చంద్ర శేషు, సిటికేబుల్ ఎండి పాలపర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈసందర్భంగా శేషు మాట్లాడుతూ బ్రిటిష్ పాలనలో బ్రిటన్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన విప్లవ సింహం అల్లూరి సీతారామరాజు బ్రిటిష్ వారి గుండెల్లో సింహస్వప్నంగా మారారని అన్నారు. దేశం కోసం పోరాటంలో కేవలం 27 సంవత్సరాలు వయసులోనే బ్రిటిష్ వారి తూటాలకు తన ప్రాణాలను విడిచారని అన్నారు. అలాగే దేశానికి ఒక జెండా ఉండాలి అని అనేక మార్లు జాతీయ కాంగ్రెస్ మహాసభల్లో తన గళాన్ని వినిపించి గ్రంధాన్ని రచించి గాంధీ సూచనలతో దేశానికి జాతీయ జెండాను అందించిన మహా వ్యక్తి పింగళి వెంకయ్య అని ఆయన వర్ధంతి సందర్భంగా ఘననివాలి అర్పిస్తున్నాం అన్నారు. పాలపర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ దేశం ఫస్ట్ తరువాతే మనం అని ఈ దేశం నాకేమి చేసింది అనేది కాకుండా దేశానికి నేను ఏమి చేశా అని ఆలోచన ప్రతి ఒక్కరు చెయ్యాలని అన్నారు. దేశం కోసం మహనీయులు చేసిన త్యాగాన్ని ప్రతి ఒక్కరు గుర్తు ఉంచుకుని మంచి లక్షణాలతో ఉన్నతమైన లక్ష్యాలతో ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్మిక విభాగం అధ్యక్షుడు కొంచడా ప్రసాద్, కళాశాల యాజమాన్యం తోట రాజ కుమార్, ఎస్వీఆర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



# సంక్షేమమే కూటమి పాలన లక్ష్యం

## దర్శి టీడీపీ ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి (చైతన్యరథం): మండలంలోని రామచంద్రాపురం గ్రామ పర్యటనలో భాగంగా ఎస్సీ కాలనీలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో అమలు చేస్తున్న ప్రతిష్టాత్మక పీఎం సూర్యఘర్ పథకంలో భాగంగాలబ్దిదారుల ఇళ్లపై ఏర్పాటు చేసిన సోలార్ ప్యానళ్లనుదర్శి టీడీపీ ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ పరిశీలించారు. ఆమె వెంట టీడీపీ యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్, నియోజకవర్గ పరిశీలకులు గంజాం రాఘవేంద్ర, విధ్యుత్ శాఖా ఏఈ ఉన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దూరదృష్టి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అమలవుతున్న ఈ పథకం ద్వారా పేద కుటుంబాలపై కరెంట్ బిల్లుల భారం పూర్తిగా తగ్గడంతో పాటు ప్రతి ఇంటికి స్వచ్ఛమైన సౌర విద్యుత్ అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలియజేసారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ రాష్ట్ర విధ్యుత్ శాఖా మంత్రిగా రాష్ట్రంలో పీఎం సూర్యఘర్ పథకం ప్రారభించుకోవకటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో దర్శి ఏఎంసీ చైర్మన్ దారం నాగవేణి, సుబ్బారావు, దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, దర్శి, దొనకొండ మండలాల టీడీపీ అధ్యక్షులు మారెళ్ళ వెంకటేశ్వర్లు, మోడీ ఆంజనేయులు, గ్రామ పార్టీ అధ్యక్షులు పిచ్చయ్య, జిల్లా టిడిపి కార్యవర్గ సభ్యులు వల్లెపు నారాయణ, నీటిసంగం ఙజ ఎలుగొండారెడ్డి, టిడిపి నాయకులు గొర్రె సుబ్బారెడ్డి, సానే సుబ్బయ్య, రామచంద్రపురం గ్రామ టిడిపి నాయకులు మండలంలోని వివిధ హోదాల్లో ఉన్న కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

# పేదల గుండెల్లో చెరగని ముద్ర వంగవీటి మోహనరంగా

## పెనమలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే బోడే ప్రసాద్

పెనమలూరు (చైతన్యరథం): తాడిగడప మున్సిపాలిటీ తాడిగడప సెంటర్‌లో ఏర్పాటు చేసిన దివంగత వంగవీటి మోహనరంగా విగ్రహానికి పెనమలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే బోడే ప్రసాద్ పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు, వంగవీటి మోహనరంగా అభిమానులందరికీ హృదయపూర్వక జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోడే ప్రసాద్ మాట్లాడుతూ మరణం లేని మహానేతగా అట్టడుగు వర్గాల ప్రజల హృదయాల్లో, కార్మికుల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిన ప్రజానాయకుడు వంగవీటి మోహనరంగా గారని అన్నారు,కార్మికుల హక్కుల పరిరక్షణ, పేద ప్రజల సంక్షేమం,సామాన్యుల అభ్యున్నతి కోసం జీవితాంతం అహర్నిశలు పోరాడిన నాయకుడిగా ఆయన చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. స్వార్థ రాజకీయాలు, కుల వివక్ష,రాజకీయ కుట్రలకు బలైనప్పటికీ ఆయన ఆశయాలు, ప్రజల కోసం చేసిన సేవలు ఎన్నటికీ మరుగున పడవని పేర్కొన్నారు,భౌతికంగా మన మధ్య లేకపోయినా,ఆయన చూపిన సేవా మార్గం, ప్రజల పట్ల ఆయనకున్న అంకితభావం నేటికీ వేలాది మందికి స్ఫూర్తిగా నిలుస్తోందని అన్నారు. ఆయన మరణానంతరం జన్మించిన యువత సైతం ఆయన వ్యక్తిత్వాన్ని,ప్రజా సేవను ఆదర్శంగా తీసుకుని అభిమానించడం ఆయనకు ప్రజల్లో ఉన్న అపారమైన ఆదరణకు నిదర్శనమని పేర్కొన్నారు,తరాలు మారినా, కాలం గడిచినా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన అరుదైన నాయకుడిగా వంగవీటి మోహనరంగాని ప్రజలు ఎల్లప్పుడూ స్మరిస్తూనే ఉంటారని తెలిపారు...ఈ సందర్భంగా ఆ మహానేతకు ఘన నివాళులు అర్పిస్తూ,ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పెనమలూరు నియోజకవర్గం పోరంకి ప్రభు నగర్‌లోని అనాథ ఆశ్రమాన్ని సందర్శించి, అక్కడి చిన్నారులకు పండ్లు పంపిణీ చేశారు, చిన్నారులతో ఆప్యాయంగా ముచ్చటించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకుని, సమాజంలోని ప్రతి ఒక్కరూ అనాథ పిల్లలకు అండగా నిలిచి మానవతా దృక్పథంతో సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.






# చివరి ఆయకట్టు వరకు సాగునీరు సాగాలి

విజయవాడ (చైతన్యరథం): ఉమ్మడి కృష్ణాజిల్లా నాగార్జునసాగర్ ఎడమ కాలువ ప్రాజెక్ట్ కమిటీ సర్వసభ్య సమావేశం మైలవరం పట్టణంలోని ఎన్.ఎస్.పి క్యాంపు కాలనీలో ఉన్న రైతు శిక్షణా కేంద్రంలో ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కోట వీరబాబు అధ్యక్షతన జరిగింది. ఇదే విషయమై ఈ రోజు సాయంత్రం విజయవాడ లోని ప్రాజెక్టు కమిటీ క్యాంప్ కార్యాలయం నుండి ప్రాజెక్టు కమిటీ కాంపిటేంటెంట్ అథారిటీ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఎస్. రామచంద్రరావు మాట్లాడుతూ 2026-27 లో ప్రాజెక్ట్ కమిటీ పరిధిలో ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు జిల్లాలో కాలువలు నీటి నిర్వహణ సామర్థ్యం పెంచడానికి కాలువల పూడిక తీత, కట్టలను బలపరచడం, కంప తొలగించడం తదితర పనులు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం 11.56 కోట్లు మంజూరు చేసిందని ఈ పనులను సాగునీటి సంఘాల ప్రతినిధులు త్వరగా పూర్తిచేసి ఆయకట్టులోని చివరి ప్రాంతానికి సాగునీరు చేరడానికి సహకరించాలని సూచించారు. ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కోట వీరబాబు మాట్లాడుతూ సాగునీరు వచ్చే సమయంలో కాలువల నిర్వహణకు అవుట్సోర్సింగ్ విధానంలో లస్కర్ లను ఏర్పాటు చేయాలని బ్రాంచ్ కాలువలు, మేజర్ కాలువలు, మైనర్ కాలువలు మీద ఎన్.ఎస్.పి అధికారులు, సాగునీటి సంఘాల ప్రతినిధులు ఉమ్మడిగా పర్యటించి కాలువల మీద ఉన్న ఆక్రమణలు తొలగించడానికి కృషి చేయాలని సూచించారు. ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్, సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు మాట్లాడుతూ నాగార్జునసాగర్ ఎడమ కాలువ పరిధిలో ఉమ్మడి కృష్ణాజిల్లాలో 3.6 లక్షల ఎకరాల ఆయకట్టు ఉందని దీనికి 32 టీఎంసీల నీటి కేటాయింపు ఉండగా గత సీజన్లో 22 టీఎంసీలు తెలంగాణ ప్రాంతం నుండి మనకు అందాయని ఎడమ కాలువ మూడో జోన్ లో ఉన్న 2.1 లక్షల ఎకరాల అయకట్టు స్థిరీకరణ గురించి గోదావరి జలాలను తీసుకువచ్చే చింతలపూడి ఎత్తిపోతల పథకానికి గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో 2014-19 లో 4,900 కోట్లు కేటాయించి 70 శాతం పనులు పూర్తి చేయడం జరిగిందని ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ 2026-27 వార్షిక బడ్జెట్లో 430 కోట్లు కేటాయించడం జరిగిందని ఈ పనులను త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. 2025-26 లో సాగునీటి సంఘాల ప్రతినిధులు ప్రాజెక్ట్ కమిటీలో చేసిన 107 పనులకు సంబంధించి బిల్లును వెంటనే చెల్లించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతుల నీటి హక్కులను పరిష్కరించుకోవడానికి కృష్ణానది యాజమాన్య బోర్డు ప్రధాన కార్యాలయాన్ని హైదరాబాదు నుండి ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి తరలించి, గ్రామీణ ప్రాంతంలో అభివృద్ధి కార్యక్రమాల్లో పాలుపంచుకుంటున్న సాగునీటి వినియోగదారుల సంఘాల అధ్యక్షులు కు గ్రామపంచాయతీ పాలకవర్గ సమావేశంలో ప్రత్యేక ఆహ్వానితులు గాను, డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షులను మండల పరిషత్ సమావేశంలోను ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ వైస్ చైర్మన్ లను జిల్లా స్థాయిలో జరిగే డి.ఆర్.సి, జిల్లా పరిషత్ సమావేశాలలో ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొనడానికి అవకాశం ఇవ్వాలని, ఎడమ ప్రధాన కాలువ పరిధిలోని 117వ కిలోమీటర్ దగ్గర, నూజివీడు బ్రాంచ్ కాలువ 5.61 కిలోమీటర్ దగ్గర కొత్తగా గేట్లు నిర్మించడానికి చర్యలు తీసుకోవాలని తదితర తీర్మానాలను ఆమోదించి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమావేశంలో ఏలూరు జిల్లాకు చెందిన డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ రాపర్ల బాలకృష్ణ, ఎన్టీఆర్ జిల్లాకు చెందిన డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ లు ఇనుగంటి శోభన్ బాబు, ఉమ్మడి వెంకటస్వామి, కటారి కోటేశ్వరరావు గంధ్ర ప్రసాద్, కానూరి హనుమంతరావు, చిత్తూరు సుభాష్, రాచకొండ చంద్రశేఖర్, ఏలూరి గోపాలరావు, కొల్లి శ్రీనివాసరెడ్డి, కాపా రాంబాబు, గోగినేని కాళేశ్వర రావు కృష్ణా జిల్లాకు చెందిన డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ లు దేవినేని సత్యనారాయణ, పామర్తి శ్రీనివాసరావు నూజివీడు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్. శ్రీను జగ్గయ్యపేట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కే.కిషోర్ ఎన్ఎస్పీ అధికారులు పాల్గొన్నారు.

# ఇక రాయలసీమ కరవు ప్రాంతం కాదు.. పారిశ్రామిక ప్రాంగణం!

## రాయలసీమ ఉక్కు పరిశ్రమ ప్రారంభంపై పరిటాల సునీత హర్షం, గంగంపల్లి గ్రామస్థులకు ఇళ్ల పట్టాల పంపిణీ, ఆర్డీటీ సహకారంతో ఇళ్ల నిర్మాణానికి చొరవ, మూడోవంతు పరిశ్రమలు సీమకే!

రాప్తాడు (చైతన్యరథం): రాయలసీమ అన్నది ఇక కరవు ప్రాంతం కాదని.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో పారిశ్రామిక హబ్‌గా మారుతోందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. రామగిరి మండలం నసనకోట పంచాయతీలోని గంగంపల్లి గ్రామస్థులకు ఆమె ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. వెంకటాపురంలోని క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో గంగంపల్లి గ్రామస్తులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు. మొత్తం 40మంది బీసీ, మైనారిటీ కుటుంబాల వారికి ఒక్కొక్కరికి 3సెంట్ల ప్రకారం ఇంటి స్థలాల పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలన్న ఉద్దేశ్యంతో చాలా చోట్ల స్థలాల సేకరణ జరిగిందన్నారు. అయితే ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం రావడంతో అవన్నీ నిలిచిపోయాయన్నారు. ఐదేళ్లలో కబుర్లు చెప్పారు తప్ప.. ఎక్కడ ప్రజలకు ఇళ్ల పట్టాలు ఇచ్చింది కానీ, ఇళ్లు నిర్మించింది కానీ లేదన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. చాలా చోట్ల ఈ ఇళ్ల పట్టాల



పంపిణీ చేపట్టినట్టు తెలిపారు. ప్రస్తుతం గంగంపల్లి గ్రామంలో 40కుటుంబాల వారికి పట్టాలు ఇచ్చామన్నారు. అలాగే సుమారు 4లక్షల రూపాయల వ్యయంతో ఆర్డిటి సంస్థ వారు నూతన గృహాలను నిర్మించేందుకు ముందుకొచ్చారన్నారు. వారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. గతంలో ఇళ్ల పట్టాలు ఇచ్చినప్పటికీ కొందరు గృహాలు నిర్మించుకోలేదన్నారు. అలాంటి వారికి పట్టాలు రద్దయ్యే అవకాశం ఉందని.. వారు ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించాలని ఎమ్మెల్యే సునీత సూచించారు...

### రూపురేఖలు మారుతున్న రాయలసీమ

అత్యంత వెనుకబడిన రాయలసీమ రూపురేఖలు మార్చే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. జమ్మలమడుగు మండలం సున్నపురాళ్లపల్లెలో రూ.16,350 కోట్లతో నిర్మించనున్న రాయలసీమ స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనులు ప్రారంభించడంపై ఆమె తన ఆనందాన్ని పంచుకున్నారు. రాయలసీమలో పంటలు సరిగా పండక, బీడు భూములు కనిపించేవన్నారు. హంద్రీనీవా రాకతో కొంత వరకు పరిస్థితులు మారాయన్నారు. కానీ కొన్ని ప్రాంతాల్లో ఇంకా కరవు ఛాయలు ఉన్నాయన్నారు.

ఇలాంటి సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా చొరవ తీసుకుని రాయలసీమలో పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. రాష్ట్రానికి వచ్చే పరిశ్రమల్లో మూడోవంతు రాయలసీమ ప్రాంతాలకే తరలి వస్తున్నాయంటే సీమపై ముఖ్యమంత్రికి ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతోందన్నారు. రెండేళ్లలో రాయలసీమకు రూ.4.58 లక్షల కోట్ల పెట్టుబడులు 2.76 లక్షల ఉద్యోగాల కల్పనకు శ్రీకారం చుట్టారన్నారు. రాయలసీమ ప్రజల దశాబ్దాల ఆకాంక్ష ఉక్కు పరిశ్రమకు జే.ఎస్.డబ్ల్యూ సంస్థ పూర్తి గ్రీన్ ఎనర్జీతో మొదటి దశలోనే రూ.4500 కోట్ల పెట్టుబడితో నిర్మాణం జరుపుతోందని.. 2028 నాటికి పూర్తై రాయలసీమ యువతకు ఉపాధి కల్పించే లక్ష్యంతో ముందుకు వెళ్తుందన్నారు. ఐదేళ్లలో రెండుసార్లు కడప ఉక్కు పరిశ్రమకు శంకుస్థాపన చేసిన జగన్.. కనీసం ప్రహరీ గోడ కూడా నిర్మించకుండా.. నేడు అంతా తన గొప్పేనని చెప్పుకుంటున్నారన్నారు. కేవలం పరిశ్రమలకే కాకుండా వ్యవసాయానికి కూడా తగిన ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. లక్ష కోట్లతో రాయలసీమను గ్లోబల్ హార్టీ కల్చర్ హబ్ గా మారుస్తున్నారన్నారు. డ్రిప్ ఇరిగేషన్లో రాయలసీమను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దారన్నారు. అలాగే సాగునీటి ప్రాజెక్టులను కూడా వేగవంతం చేశారన్నారు. ఈ ప్రభుత్వం రాయలసీమ అభివృద్ధి కోసం కట్టుబడి ఉందని చెప్పడానికి ఇంతకంటే నిదర్శనం ఏముంటుందని ఎమ్మెల్యే సునీత అన్నారు.

# తుంగభద్ర ప్రాజెక్టుకు తీవ్ర నీటి కొరత

## రాయదర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఆందోళన



రాయదుర్గం (చైతన్యరథం): ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది తుంగభద్ర ప్రాజెక్టులో తీవ్ర నీటి కొరత నెలకొన్నందని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. ఖరీఫ్‌లో తుంగభద్ర ఆయకట్టు పరిధిలో సాగునీరు అందించడం అత్యంత క్లిష్టంగా మారిందని రాయదుర్గంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం తుంగభద్ర జలాశయంలో నీటి నిల్వలు అత్యంత ఆందోళనకర స్థాయిలో 9.80టీఎంసీలు ఉన్నాయన్నారు. గత 60 ఏళ్లలో ఇంత తీవ్రమైన నీటి కొరత పరిస్థితిని ఎప్పుడూ చూడలేదని పేర్కొన్నారు. గత ఏడాది ఇదే సమయానికి సుమారు 73 టీఎంసీలు ఉండేవని, గత 60 ఏళ్ల సగటు తీసుకుంటే కనీసం 28 టీఎంసీలు డ్యామ్ లో చేరాల్సి ఉండేదన్నారు. ప్రస్తుతం జలాశయంలో సుమారు 9.8 టీఎంసీల మేరకే నీటి నిల్వలు ఉన్నాయని, అందులోనూ వినియోగానికి అందుబాటులో కొత్తగా వర్షాలకు వచ్చిన నీటి పరిమాణం చాలా తక్కువగా ఉందన్నారు. ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుంటే ఈ ఖరీఫ్ సీజన్‌లో తుంగభద్ర ప్రాజెక్టు పరిధిలో ఆయకట్టుకు సాగునీరు విడుదల చేయడం సాధ్యపడే పరిస్థితి కనిపించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆయకట్టు పరిధిలో సాగునీరు ఇవ్వడం వీలు కాదని కర్ణాటక ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిందని గుర్తు చేశారు. ఇంజనీరింగ్ నిపుణులు సైతం ప్రత్యేక సమావేశం నిర్వహించి ఏడాది అంచనాలకు అనుగుణంగా నీరు రావడంలేదని, పరిస్థితులు అత్యంత క్లిష్టంగా ఉన్నాయని స్పష్టం చేశారన్నారు. త్వరలో తుంగభద్ర పరిస్థితిని రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి అధికారికంగా తెలియజేస్తామన్నారు. రైతులు ఈపాటికే నారుమళ్లు సిద్ధం చేసుకుంటున్నారని వివరించారు. ఎల్ ఎల్ నినో ప్రభావం వల్ల ప్రస్తుతం ఎదురవుతున్న నీటి సమస్యను రైతులు అర్థం చేసుకుని తదనుగుణంగా కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని సూచించారు. అందుబాటులో ఉన్న నీటిని ముందుగా తాగునీటి అవసరాలకు వినియోగించాలని తుంగభద్ర బోర్డు ఇప్పటికే నిర్ణయం తీసుకున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో నీటిని అత్యంత పొదుపుగా వినియోగిస్తూ ప్రజల తాగునీటి అవసరాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపడుతోందని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. ఆయకట్టు రైతాంగం ప్రస్తుత పరిస్థితిని పరిశీలించి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంఛార్జిలు పోరాళ్ల పురుషోత్తం, ఇనాయత్, మాజీ కౌన్సిలర్లు కడ్డీపుడి మహబూబ్ బాషా, బండి భారతి, కురుబ ప్రశాంతి, బుదురు తిప్పేస్వామి, డబ్బిడి శివ,ఆనంద్,కొండాపురం శ్రీనివాసులు, కరెన్న తదితరులు పాల్గొన్నారు.



## ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని

# సద్వినియోగం చేసుకోండి

### గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపు

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ప్రతి పౌరునికి అత్యంత విలువైన హక్కు అని, ఆ హక్కును పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. ప్రస్తుతం భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ప్రజలు పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ ఓటరు జాబితాలో పేరు కొనసాగాలంటే ప్రతి అర్హత కలిగిన ఓటరు తప్పనిసరిగా ఎన్యూమరేషన్ ఫారం (గణన ఫారం) పూర్తి చేసి అవసరమైన పత్రాలతో పాటు సంబంధిత బూత్ లెవల్ ఆఫీసర్‌కు జూలై 14వ తేదీలోపు సమర్పించాలని కోరారు. జూలై 21న విడుదల కానున్న డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో పేరు ఉండాలంటే ఈ ప్రక్రియను నిర్లక్ష్యం చేయకుండా పూర్తి చేయడం అత్యంత అవసరమని తెలిపారు. చివరి నిమిషం వరకు వేచి చూడకుండా వెంటనే ఫారాలను సమర్పించాలని, తమ ఓటరు వివరాలను మరోసారి పరిశీలించి ధృవీకరించుకోవాలని సూచించారు. ఏవైనా సందేహాలు లేదా సమస్యలు ఉంటే సంబంధిత బీఎల్వోలను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని అన్నారు. ప్రజల సౌకర్యార్థం ఈ శనివారం, ఆదివారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు అన్ని పోలింగ్ కేంద్రాల్లో బీఎల్వోలు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఓటర్లు తమ పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను సమర్పించి ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కోరారు.

ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయాలంటే ప్రతి అర్హత కలిగిన పౌరుడు ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో చురుకుగా పాల్గొనాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపునిచ్చారు. ఎన్నికల సంఘం చేపట్టిన ఈ ప్రత్యేక కార్యక్రమానికి ప్రజలందరూ సహకరించి తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి విజ్ఞప్తి చేశారు.

# అమెరికా స్వాతంత్ర్యానికి 250 సంవత్సరాలు

## వేడుకలకు సిద్ధమవుతున్న ఎన్ఆర్ఐలు

**యూఎస్ఏ:** ప్రతి సంవత్సరం జూలై 4... అమెరికాలో అందరికీ పండుగ రోజు... ఇండిపెండెన్స్ డేని అందరూ శ్రద్ధగా జరుపుకుంటారు. ప్రవాసాంధ్రులు ఆ వారంలో తెలుగు మహాసభలు... కన్నడ, గుజరాతీలు వారి భాషా మహాసభలు చేసుకుంటారు. అయితే 2026 సంవత్సరం అమెరికా చరిత్రలో ఒక విశిష్ట మైలురాయిని చేరుకుంది. అమెరికా స్వాతంత్ర్య ప్రకటనకు 250 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భాన్ని దేశవ్యాప్తంగా America250 పేరుతో ఘనంగా జరుపుకుంటున్నారు. మన తెలుగువాళ్ల సభల్లో కూడా జూలై 4వ తేదీని అమెరికా స్వాతంత్ర దినోత్సవం గుర్తు చేసుకుంటూ ఒక కార్యక్రమం చేస్తారు.

భారతీయ అమెరికన్ల (Indian Ameicans) విజయగాథ అమెరికన్ డ్రీమ్‌కు ప్రతీక. అనేక మంది భారతీయులు ప్రముఖ టెక్నాలజీ సంస్థల్లో నాయకత్వ స్థానాల్లో ఉన్నారు. వైద్యులు, శాస్త్రవేత్తలు, ఉపాధ్యాయులు, వ్యాపారవేత్తలు, ప్రజాప్రతినిధులు, సేవా కార్యకర్తలుగా వారు అమెరికా అభివృద్ధిలో భాగస్వాములు అవుతున్నారు.

దాదాపు ప్రతి నగరంలోనూ ఆగస్టు 15న జరుపుకునే భారత స్వాతంత్ర్య వేడుకలను ఈసారి 'ఇండియా 80–అమెరికా 250'గా చేసుకోవడానికి ప్రయత్నాలు ఇప్పటికే మొదలు అయ్యాయి. ఫెడరేషన్ అఫ్ ఇండియన్ అసోసియేషన్స్–చికాగో (FIA-Chicago) జూన్ 26న అమెరికా 250 సందర్భంగా పెద్ద ఎత్తున కమ్యూనిటీ డిన్నర్ కార్యక్రమాలు నిర్వహించింది. తెలుగు అసోసియేషన్ అఫ్ నార్త్ అమెరికా (TANA)–చార్లెట్ నగర విభాగం ఈ నెల 18న పెద్ద ఎత్తున బ్లడ్ డొనేషన్ క్యాంపు నిర్వహణకు ముందుకొచ్చింది. ఫౌండేషన్ అఫ్ ఇండియన్ అమెరికన్స్–న్యూ ఇంగ్లాండ్ విభాగం 250 మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

America250 వేడుకలు యువతకు ఒక గొప్ప సందేశాన్ని ఇస్తున్నాయి. స్వేచ్ఛ, సమానత్వం, ప్రజాస్వామ్యం, సేవా భావం వంటి విలువలను కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత అని ఈ సందర్భం గుర్తుచేస్తోంది. భారతీయ మూలాలను మరిచిపోకుండా అమెరికన్ సమాజంలో చురుకైన పాత్ర పోషించడం ఎన్ఆర్ఐ సమాజం ప్రత్యేకత.






# మాతృ భాషే మన ఆస్తి... అస్తిత్వం

## మన తల్లిదండ్రులు, పిల్లలకు తెలుగే వారధి

## ప్రవాసాంధ్రుల ఆత్మీయ సమావేశంలో బీజేపీ నేత పాతూరి

**వర్జీనియా (అమెరికా):** "మాతృ భూమి, మాతృ భాష.. మన విధానం, మన నినాదం" అనే నినాదంతో అమెరికాలో ప్రవాస తెలుగు తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం అత్యంత వైభవంగా జరిగింది. అమెరికా రాజధాని ప్రాంతం వర్జీనియాలో పాఠశాల వేదికగా జరిగిన ఈ కార్యక్రమానికి మాగులూరి భానుప్రకాష్ సమన్వయకర్తగా వ్యవహరించారు. పాల్గొన్న ప్రవాస తెలుగువారు తమ అనుభవాలను, ఆలోచనలను ఒకరితో ఒకరు పంచుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, బీజేపీ నేత పాతూరి నాగభూషణం మాట్లాడుతూ... వృత్తి, ఉపాధి రీత్యా లక్షలాది మంది తెలుగువారు అమెరికాకు వచ్చారని, వారంతా మాతృ భాషను మర్చిపోకూడదన్నారు. "మనం ఎక్కడ ఉన్నా మన పిల్లలకు తెలుగు భాషను నేర్పిద్దాం. మనదైన ఉజ్వల చరిత్రను, సంస్కృతిని కాపాడుకుంటూ మన బిడ్డలను తీర్చిదిద్దాల్సిన బాధ్యత మనపై



ఉంది. ప్రపంచంలో ఎన్నైనా భాషలు నేర్చుకుందాం.. కానీ మన ఇంట్లో, మన వారితో మాత్రం మాతృ భాషలోనే సంభాషించుకుందాం" అని ఆయన హితవు పలికారు. కార్యక్రమ సమన్వయకర్త భాను మాగులూరి మాట్లాడుతూ.. తెలుగు భాష అనేది మన ఆస్తి మాత్రమే కాదు, మన అస్తిత్వం అని స్పష్టం చేశారు. మన తల్లిదండ్రులకు, మన పిల్లలకు మధ్య ఉన్న అనుబంధానికి తెలుగే ఒక ముఖ్యమైన వారధి అని పేర్కొన్నారు.



మన జీవిత కాలంలో మాతృ భాషను సజీవంగా ఉంచుకోవడం మన కర్తవ్యమని, భాషే మనకు సమస్తమని ఆయన అభివర్ణించారు. కార్యక్రమంలో సీతారామారావు ఎందూరు, శంకర్రావు పొన్నం, కృష్ణమోహన్ జంపాల, సత్యనారాయణరాజు, చంద్రనాథ్ నంబూరు, వెంకటరెడ్డి గోలి, సుబ్బారావు చిట్టెల, రామకృష్ణారెడ్డి, గంగారావు పొనగోటి, భాస్కరరావు చీటీ, సురేష్, యోగానంద్ వంకిన, నూరిబాబు షేక్, సురేష్ లగిశెట్టి, గణేష్ రెడ్డి బుడిపాటి, రాజా కరణం, రాజేంద్రప్రసాద్ పులిపాటి, ప్రభు బచ్చు తదితరులు పాల్గొన్నారు.



**ఎక్కడో మారుమూల గ్రామంలో పుట్టిన ఒక సాధారణ యువకుడు రెండు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) స్టార్టప్‌ల అధినేతగా ఎదగడం అంటే మాటలు కాదు. సక్సెస్‌కు ఎంతో కఠోర శ్రమ, అంతకుమించిన పట్టుదల చాలా అవసరమని... జీవితంలో ఎదురయ్యే అడ్డంకులను దాటుకుంటూ ముందుకు సాగితే అనుకోని విజయాలను కూడా అందుకోవచ్చని నిరూపించాడు ఈ యువకుడు. భారతదేశంలో అందరికీ ఒకే విధానం అనే విద్యా వ్యవస్థపై అతడికున్న తీవ్ర నిరాశే స్టార్టప్‌కు ప్రేరణ అంటున్నాడు బెంగాల్‌కు చెందిన 28ఏళ్ల యువకుడు సూరజ్ బిశ్వాస్. జీవనోపాధి కోసం జొమాటో రైడర్‌గా షిఫ్టులు చేస్తూ... తన భారీ టెక్ ఆశయాలను సమతుల్యం చేసుకున్నాడు. ఒక డెలివరీ బాయ్‌ని సీరియస్‌గా తీసుకోవడానికి నిరాకరించిన పెట్టుబడిదారుల ముందే అతడు ఈ రోజు టెక్ వ్యవస్థాపకుడిగా సగర్వంగా నిలబడ్డాడు.**

# డెలివరీ బాయ్ టు టెక్ సీఈవో

**బెంగాలీ యువకుడు సూరజ్ బిశ్వాస్ విజయ ప్రస్థానం**



### నేపథ్యం, చదువు

సూరజ్ బిస్వాస్ పశ్చిమ బెంగాల్‌లోని నదియా జిల్లాకు చెందిన 'చక్దహా' అనే ఒక చిన్న గ్రామంలో జన్మించాడు. డాక్టర్ కావాలనేది అతని కల. అయితే పరిస్థితులు అనుకూలించకపోవడంతో కోల్‌కతాలోని గురునానక్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్స్ అండ్ టెక్నాలజీ నుంచి జెనెటిక్స్ విభాగంలో బీఎస్సీ పూర్తి చేశాడు.

### జొమాటో డెలివరీ బాయ్‌గా ప్రయాణం

చదువు పూర్తయిన తర్వాత తన ఖర్చుల కోసం, పై చదువుల కోసం బెంగళూరులో జొమాటో డెలివరీ బాయ్‌గా చేరాడు. రోజుకు దాదాపు రూ.1,000 నుంచి రూ.1,500 వరకు (నెలకు ?40,000 పైగా) సంపాదించేవాడు. "నేను ఆ పనిని ఎప్పుడూ అవమానంగా భావించలేదు, చాలా గర్వంగా చేసుకున్నాను. ఆ పనే నాకు ఆర్థిక స్వాతంత్ర్యాన్ని, స్వయం సమృద్ధిని ఇచ్చింది" అని సూరజ్ గర్వంగా చెప్తాడు. డెలివరీలు చేస్తూనే ఖాళీ సమయంలో స్మార్ట్‌ఫోన్, ల్యాప్‌టాప్ సహాయంతో ఆన్‌లైన్ ట్యుటోరియల్స్ ద్వారా కోడింగ్ నేర్చుకున్నాడు.

### స్టార్టప్ ఆలోచన ఎలా వచ్చింది?

మన దేశంలోని సంప్రదాయ విద్యా వ్యవస్థ అందరికీ ఒకే రకమైన బోధనను అందిస్తుంది. కానీ ప్రతి విద్యార్థి గ్రహణ శక్తి, నేర్చుకునే విధానం వేర్వేరుగా ఉంటాయని సూరజ్ గమనించాడు. ప్రస్తుత ఏఐ (ఏఐ) సాంకేతికతలు కూడా మనుషులను కేవలం డేటా పాయింట్లుగా చూస్తున్నాయి తప్ప వారి వ్యక్తిగత సామర్థ్యాన్ని అర్థం చేసుకోలేకపోతున్నాయని అతను గ్రహించాడు. ఈ సమస్యకు పరిష్కారంగా ప్రతి మనిషి ప్రవర్తనను, సామర్థ్యాన్ని అర్థం చేసుకునే సరికొత్త సాంకేతికతను అభివృద్ధి చేయాలని నిర్ణయించుకున్నాడు.

### ఎదుర్కొన్న సవాళ్లు

సూరజ్ 2021లో ఎలాంటి పెట్టుబడులు, ఆఫీస్ లేదా సహ–వ్యవస్థాపకులు లేకుండానే తన స్టార్టప్‌ను ప్రారంభించాడు. ఒక చిన్న గ్రామం నుంచి వచ్చి సాదాసీదా కాలేజీలో చదివి, డెలివరీ బాయ్‌గా పనిచేసిన వ్యక్తి కావడంతో ఇన్వెస్టర్లు ఎవరూ మొదట్లో అతని ఐడియాను సీరియస్‌గా తీసుకోలేదు.

### నిధుల కొరత

ఏఐ వంటి అధునాతన సాంకేతికతను అభివృద్ధి చేయడం అనేది కొన్ని నెలల్లో అయ్యే పని కాదు. దానికి సంవత్సరాల పరిశోధన, మౌలిక వసతులు కావాలి. నిధులు లేకపోయినా పట్టుదలతో శ్రమించి ఇప్పటివరకు రెండు రీసెర్చ్ పేపర్లను కూడా ప్రచురించాడు.

**వ్యక్తిగత లోటు:** ఈ సుదీర్ఘ ప్రయాణంలో సూరజ్ తన తండ్రిని కోల్పోయాడు. ఆయన ఒక హౌస్ పెయింటర్ (ఇళ్లకు రంగులు వేసే కార్మికుడు). కొడుకు భవిష్యత్తు కోసం ఎంతో కష్టపడిన తండ్రి, ఈరోజు కొడుకు సాధించిన ఈ గొప్ప విజయాన్ని చూడలేకపోవడం తన జీవితంలో ఎప్పటికీ తీరని లోటని సూరజ్ భావోద్వేగానికి గురయ్యాడు.

### ప్రస్తుత విజయం

ప్రస్తుతం సూరజ్ బిస్వాస్ బెంగళూరు కేంద్రంగా పనిచేస్తున్న 'అసెస్లీ' (Assessli), 'డాట్స్–ఇన్' (Dots-in) అనే రెండు ఏఐ స్టార్టప్ కంపెనీలకు వ్యవస్థాపకుడు, సీఈవో (Founder & CEO)గా వ్యవహరిస్తున్నాడు. అతని కంపెనీ గ్లోబల్ స్టార్టప్ ప్లాట్‌ఫారమ్‌ల్లో టాప్ ఏఐ స్టార్టప్‌లలో ఒకటిగా గుర్తింపు పొందింది.

### యువతకు సూరజ్ ఇచ్చే సందేశం...

"మీరు ఏదైనా సాధించడానికి 'అన్నీ సిద్ధంగా ఉండే వరకు' వేచి చూడకండి. భయాలు, అనిశ్చితి ఉన్నప్పటికీ ముందడుగు వేయడం నేర్చుకోండి. మీరు పుట్టిన ఊరు లేదా చదివిన కాలేజీ మీ సామర్థ్యాన్ని నిర్ణయించలేవు. మీ పుట్టుక మీ ఎదుగుదలకు ఎప్పటికీ అడ్డంకి కాకూడదు."

# జేబులున్న దుస్తులు, ఫోన్లపై నిషేధం

**కట్టుదిట్టమైన కొత్త నిబంధనలు అమలుకు నిర్ణయం - అయోధ్య రాముడి గుడిలో నిధుల చౌర్యం ఘటన**



అయోధ్య రామ మందిరంలో విరాళాల చోరీపై దర్యాప్తు ముమ్మరమైంది. జూన్ 7న అక్రమాలు వెలుగులోకి రాగా, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసింది. జూన్ 25న ఎఫ్ఐఆర్ నమోదు కాగా, విరాళాల లెక్కింపు ప్రక్రియతో సంబంధమున్న ఎనిమిదిమందిని అధికారులు ఇప్పటికే అరెస్టు చేశారు. ఈ నేపథ్యంలో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ విరాళాల లెక్కింపు వ్యవస్థలో కఠిన నిబంధనలు అమలు చేయాలని నిర్ణయించింది. లెక్కింపు సమయంలో సిబ్బంది మొబైల్ ఫోన్లు, కెమెరాలు ఉపయోగించడాన్ని పూర్తిగా నిషేధించింది. అదేవిధంగా సదరు సిబ్బంది ఎలాంటి జేబులు లేని (పాకెట్‌లెస్) ప్రత్యేక దుస్తులు ధరించాలని ఆదేశాలు జారీ చేసింది. నగదు, విలువైన వస్తువులను దాచుకొనేందుకు ఏమాత్రం అవకాశం లేకుండా సిబ్బందికి ముదురు నీలం రంగు జేబులులేని యూనిఫాంను అందించనున్నారు. ఇకపై హుండీ లెక్కింపు హాలులోకి ప్రవేశించే ముందు సిబ్బందికి రెండంచెల భద్రతా తనిఖీలు నిర్వహించనున్నారు. లెక్కింపు విధానంలోనూ సమూల మార్పులు చేపట్టారు. సిబ్బంది ఇకపై బల్లలు, కుర్చీలవద్ద కాకుండా, నేలపై కూర్చొనే విరాళాలను లెక్కించాల్సి ఉంటుంది.

**సిట్ దర్యాప్తులో సంచలన కోణం**

కేసు దర్యాప్తులో భాగంగా ట్రస్ట్ ఖాతాలపై సమగ్ర ఆడిట్ నిర్వహించడానికి సిట్ సిద్ధమవుతోంది. గత ఐదేళ్లలో ఆలయ నిర్మాణానికి అయిన ఖర్చులు, ఆలయానికి వచ్చిన విరాళాలు, నిధుల లెక్కలను అధికారులు క్షుణ్ణంగా సమీక్షించనున్నారు. దొంగిలించిన నగలను ఎవరూ గుర్తుపట్టకుండా ఉండేందుకు నిందితులు వాటిని కరిగించి బంగారు బిస్కెట్లుగా మార్చుకుని ఉంటారని అధికారులు బలంగా అనుమానిస్తున్నారు. పదేపదే సోదాలు నిర్వహించినా, మాయమైన ఆభరణాలు లభించకపోవడంతో, వాటిని రూపుమార్చే ప్రయత్నం జరిగి ఉండొచ్చని భావిస్తున్నారు. ఈ కోణంలో ఆభరణాలు, విలువైన విరాళాల రికార్డులతోపాటు, ప్రభుత్వ రంగ మింట్ (ప్రింటింగ్ అండ్ మింటింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా)తో జరిపిన లావాదేవీల వివరాలను, బ్యాంకులు, మింట్‌కు పంపిన విలువైన లోహాల పూర్తి లెక్కలను సిట్ కోరింది. మాజీ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ గతంలో వెల్లడించిన వివరాల ప్రకారం, భక్తుల నుంచి ఆలయానికి దాదాపు 13 క్వింటాళ్ల వెండి, సుమారు 20 కిలోల బంగారం విరాళంగా అందాయి. దర్యాప్తులో భాగంగా సిట్ అధికారులు ఆలయాన్ని సందర్శించి, రాములవారికి పూజలు నిర్వహించి, ఆభరణాలు, ఇతర విలువైన వస్తువుల నిల్వ, నిర్వహణపై ఆలయ ఇన్‌ఛార్జి కేడీ బాబును ప్రశ్నించారు.

భారీ మొత్తంలో భక్తుల విరాళాలు వచ్చే అయోధ్య రామ మందిరం వంటి ప్రతిష్టాత్మక ఆలయంలో ఇలాంటి అక్రమాలు వెలుగుచూడటం దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. దర్యాప్తు పూర్తయ్యే వరకు, కొత్తగా అమల్లోకి తెచ్చిన కఠిన నిబంధనలు భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నివారించగలవా అన్నది వేచి చూడాల్సిందే.

# బాబా బర్ఫానీకి జేజేలు!



**- హర హర మహాదేవ్ నినాదాలతో మార్మోగిన అమర్‌నాథ్**

**- 12వేల మందికి తొలిరోజు మంచులింగం దర్శనం**

జమ్ము: కట్టుదిట్టమైన భద్రత నడుమ, వాతావరణ అవాంతరాల మధ్య "హర హర మహాదేవ్" నినాదాలతో బయల్దేరిన భక్తులకు ఈ ఏడాది అమరనాథ్ మంచుశివలింగం తొలి దర్శనమైంది. శుక్రవారం ప్రారంభమైన అమరనాథ్ యాత్రలో భాగంగా తొలిరోజు 12 వేలమంది భక్తులు కశ్మీర్ హిమాలయాల్లోని 3,880 మీటర్ల ఎత్తులో ఉన్న గుహాలయాన్ని చేరుకుని, సహజసిద్ధంగా ఏర్పడిన మంచు శివలింగాన్ని దర్శించుకున్నారు. ఈ 12 వేల మందిలో 9,350 మంది పురుషులు, 2,250 మంది మహిళలు, 200 మంది పిల్లలున్నట్టు అధికారులు వెల్లడించారు. ప్రతి సంవత్సరం ఈ సమయంలో ఏర్పడే మంచు లింగాన్ని పూజించేందుకు గురు, శుక్రవారాల్లో నున్వాన్ (పహల్గావ్), బాలాల్ (సోన్‌మార్గ్) బేస్ క్యాంపులనుంచి రెండు వేర్వేరు బృందాలు యాత్ర ప్రారంభించాయి. అంతకుముందు గురువారం జమ్ములోని భగవతీ నగర్ బేస్ క్యాంపునుంచి తొలి పెద్ద బృందాన్ని లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా జెండా ఊపి సాగనంపారు. మొత్తం 201 వాహనాల కాన్వాయ్‌లో 3,865 మంది భక్తులు భద్రతా బలగాల నిఘా నడుమ బయలుదేరగా, అందులో 1,735 మంది బాలాల్ బేస్ క్యాంపుకు, 2,130 మంది పహల్గావ్ మార్గంలో నున్వాన్ బేస్ క్యాంపుకు తరలివెళ్లారు. కశ్మీర్ లోయకు చేరుకున్న భక్తులకు స్థానికులు, పరిపాలనా యంత్రాంగం సాదర స్వాగతం పలికాయి.

జమ్మూ-శ్రీనగర్ జాతీయ రహదారి వెంబడి, అన్ని బేస్ క్యాంపుల్లో బహుళస్థాయిల భద్రతా వ్యవస్థను అధికారులు ఏర్పాటు చేశారు. సైన్యం, సీఆర్పీఎఫ్‌తో పాటు వేలాది పోలీసు, పారామిలిటరీ సిబ్బందిని మోహరించడంతో పాటు, గగనతల నిఘాను నిర్వహిస్తున్నారు. వాతావరణ అవాంతరాలు, జారుడు మార్గాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక వాతావరణ పర్యవేక్షణ బృందాలను ఏర్పాటు చేశారు. ఈ ఏడాది యాత్ర జూలై 3న ప్రారంభమై, ఆగస్టు 28 వరకు 57 రోజుల పాటు కొనసాగనుంది. ఇప్పటివరకు 3.9 లక్షలకు పైగా భక్తులు యాత్ర కోసం నమోదు చేసుకున్నారు, ఇది బాబా బర్ఫానీ దర్శనంపట్ల ప్రజల్లో ఉన్న అపార విశ్వాసానికి నిదర్శనం.

**అమరనాథ్ భక్తులకు ప్రధాని మోదీ లేఖ**

యాత్ర ప్రారంభమైన నేపథ్యంలో భక్తులకు ప్రధాని నరేంద్ర మోదీ 'ఎక్స్' వేదికగా రెండు పేజీల బహిరంగ లేఖ రాశారు. "బాబా బర్ఫానీ దర్శనంతో ముడిపడిన అమరనాథ్ యాత్ర మన ఆధ్యాత్మిక సంప్రదాయంలో, సాంస్కృతిక ఐక్యతలో ఒక శాశ్వత అధ్యాయం. శివభక్తుల ఈ ప్రయాణం అన్ని విధాలుగా సురక్షితంగా, శుభప్రదంగా సాగాలని కోరుకుంటున్నాను" అని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా భక్తులు ఐదు ప్రతిజ్ఞలు (పంచ సంకల్పాలు) పాటించాలని ఆయన సూచించారు. యాత్రా మార్గం పొడవునా పరిశుభ్రత పాటించడం; జారుడు మార్గాలు, వాతావరణ మార్పులపై అప్రమత్తంగా ఉంటూ ట్రాఫిక్, భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటించడం; జమ్మూకశ్మీర్‌లోని స్థానిక ఉత్పత్తులకు ప్రాధాన్యమిస్తూ (వోకల్ ఫర్ లోకల్) యాత్రా బడ్జెట్‌లో కనీసం 10 శాతాన్ని స్థానిక వస్తువుల కొనుగోలుకు వెచ్చించడం; యాత్ర ముగింపు రోజైన రక్షాబంధన్ నాడు తోబుట్టువులకు బహుమతిగా మొక్కలు నాటడం ద్వారా పచ్చదనాన్ని ప్రోత్సహించడం; మరియు దేశం ప్రథమం అనే నినాదంతో ఐక్యత, సోదర భావాన్ని చాటుతూ యాత్రను సాగించడం. యాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ, సైన్యం, భద్రతా బలగాలు, వైద్య సిబ్బంది, పారిశుధ్య కార్మికులు, పరిపాలనా యంత్రాంగం అందిస్తున్న సేవలకు ప్రధాని కృతజ్ఞతలు తెలిపారు.

# ఇంధన సంక్షోభాన్ని అధిగమించాం: ప్రధాని మోదీ



జైపుర్: పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో ఏర్పడిన ఇంధన సంక్షోభాన్ని భారత్ విజయవంతంగా ఎదుర్కొందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. ప్రభుత్వ విధానాలు, ఇంధన దిగుమతుల్లో వైవిధ్యం పాటించడం, బలమైన ద్వైపాక్షిక సంబంధాలతో సంక్షోభంనుంచి తక్కువ భారంతో బయటపడ్డామన్నారు. రాజస్థాన్‌లోని బలోత్రా జిల్లా పచ్‌పద్రాలో.. దేశంలోనే తొలి గ్రీన్‌ఫీల్డ్ రిఫైనరీ-పెట్రో కెమికల్ కాంప్లెక్స్‌ను ఆయన ప్రారంభించారు. దాంతోపాటు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. "పశ్చిమాసియా సంక్షోభం ప్రారంభానికి ముందు భారత్ 25-26 దేశాలనుంచి ఇంధనాన్ని దిగుమతి చేసుకుంది. సంక్షోభ సమయంలో ఆ సంఖ్యను 40కి పైగా దేశాలకు పెంచాం. అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు పెరగడంతో ఏప్రిల్ నుంచి జూన్ వరకు చమురు కంపెనీలకు రూ.75 వేల కోట్లకు పైగా నష్టం వాటిల్లింది. ఆ భారాన్ని ప్రభుత్వమే భరించింది. ప్రజలపై భారం పడకుండా లీటరుకు రూ.10 ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించాం. ప్రస్తుతం ప్రపంచంలో నాలుగో అతిపెద్ద రిఫైనింగ్ సామర్థ్యంగల దేశంగా భారత్ ఎదిగింది. భారత్ విఫలమవుతుందని కొందరు విష ప్రచారం చేశారు. ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నాలూ జరిగాయి. కానీ అవేమీ ఫలించలేదు. భారత్ విఫలమవుతుందని ఆశించిన వారు ఇప్పుడు తీవ్ర నిరాశలో ఉన్నారు. భాజపా ప్రభుత్వాలు కేవలం శంకుస్థాపనలు చేసి వదిలేయవు. పనులు పూర్తయ్యే వరకు నిరంతరం కృషి చేస్తాయి" అని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

## తొమ్మిదేళ్లకు భాగవత ప్రవచనకర్తగా..

## ఆసియా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో శ్వేతిమకు చోటు




గోరఖ్‌పూర్: ఆధ్యాత్మిక జ్ఞానాన్ని సంపాదించడం, అందులో ప్రావీణ్యం పొందడం అంత సులువు కాదు. అలాంటి అసాధారణ మార్గంలో పయనించి అద్భుత ప్రతిభతో 9 ఏళ్ల చిన్నారి శ్వేతిమ మాధవ్ ప్రియ ప్రపంచ రికార్డు సాధించింది. ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌కు చెందిన శ్వేతిమ అంతర్జాతీయ భాగవత ప్రవచనకర్తగా ఆసియా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు సాధించింది. ఈ ఘనత సాధించిన అతి పిన్న వయస్కురాలిగా గుర్తింపు పొందింది. 2017 ఫిబ్రవరి 16న జన్మించిన శ్వేతిమ.. చిన్న వయసు నుంచే ఆధ్యాత్మిక అంశాలను ఆసక్తిగా తిలకించడం మొదలుపెట్టింది. ఆరేళ్ల వయసులోనే శ్రీమద్భాగవత కథ చెప్పడం ప్రారంభించింది. ఇప్పటి వరకు 36 వారాలపాటు భాగవత కథా ప్రవచనాలు చెప్పడంతో పాటు, 100కు పైగా ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొని భారతీయ సంస్కృతి, సనాతన సంప్రదాయాలు, నైతిక విలువల సందేశాన్ని ప్రజలకు చేరవేసింది. శ్వేతిమ చెప్పే భాగవత కథలు, ఆధ్యాత్మిక ప్రవచనాలకు పెద్ద సంఖ్యలో అభిమానులున్నారు. కార్యక్రమాలు ఎక్కడ జరుగుతున్నాయో తెలుసుకుని మరీ అక్కడికి వెళ్తుంటారు. శ్వేతిమ రికార్డుపై ఆమె తండ్రి సౌరభ్ పాండే ఆనందం వ్యక్తం చేశారు. తమ కుమార్తె ప్రయాణానికి తాము పూర్తిగా మద్దతిస్తామని తెలిపారు.

## 'ఓల్డ్ లైట్ హౌస్'.. పున:ప్రారంభం!




పుదుచ్చేరిలో వారసత్వ కట్టడం పర్యాటకులను ఆకర్షిస్తోంది. 190 ఏళ్ల చరిత్ర కలిగిన 'ఓల్డ్ లైట్ హౌస్' అందుబాటులోకి వచ్చింది. 1836 ఫ్రెంచ్ పాలనా కాలంలో నిర్మించిన లైట్ హౌస్ కోరమాండల్ తీరంలోనే మొట్టమొదటిది. వివిధ కారణాలతో 1979లో దీన్ని మూసివేశారు. జీఎస్టీ విభాగం ఆధీనంలో ఉన్న ఈ పురాతన కట్టడాన్ని పునరుద్ధరించారు. ఇటీవల కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ దీన్ని ప్రారంభించగా.. జులై 1నుంచి ప్రజల సందర్శనార్థం అందుబాటులోకి తెచ్చారు. ఇక్కడ ఏర్పాటు చేసిన చిత్ర, ఆడియో, వీడియో ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. 29 మీటర్ల ఎత్తుగల ఈ లైట్ హౌస్ చివరి వరకు ఎక్కి.. సముద్రాన్ని చూస్తూ పర్యాటకులు ఆహ్లాదం పొందుతున్నారు.

## 20నుంచి వర్షాకాల పార్లమెంట్



దిల్లీ: పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జులై 20నుంచి ప్రారంభం కానున్నాయని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. ఆగస్టు 13 వరకు సమావేశాలు కొనసాగుతాయన్నారు. సమావేశాల్లో జాతీయ ప్రాముఖ్యత కలిగిన అంశాలపై అర్థవంతమైన చర్చలు, నిర్ణయాలు ఉంటాయని పేర్కొన్నారు. ఈమేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. ఉభయసభల సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేసే ప్రసంగంతో పార్లమెంటు సమావేశాలు మొదలవుతాయి.

# ఎర్ర జెండాల ప్రతిజ్ఞ!

**మొదలైన ఖమేనీ కుటుంబ అంత్యక్రియలు**
**మనవరాలి పేటిక పక్కనే ఫొటో ఫ్రేమ్**

ఇరాన్ దివంగత నాయకుడు ఆయతుల్లా అలీ ఖమేనీ అంతిమయాత్ర అధికారికంగా ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో ఖమేనీతోపాటు మృతి చెందిన కుటుంబసభ్యుల శవపేటికలనూ మద్దతుదారుల సందర్శనార్థం రాజధాని నగరం టెహ్రాన్‌లో ఉంచారు. వాటిల్లో ఆయన 14 నెలల మనవరాలు జహ్రా మొహమ్మదీ శవపేటిక కూడా ఉంది. దానిపక్కనే ఆ చిన్నారి ఫొటో ఫ్రేమ్‌ను ఉంచారు. ఫిబ్రవరి 28న అమెరికా–ఇజ్రాయెల్ నిర్వహించిన సంయుక్తదాడుల్లో 86 ఏళ్ల ఖమేనీతోపాటు ఆయన కుటుంబసభ్యులు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. నాలుగు నెలల అనంతరం వీరి అంతిమ సంస్కారాలను నిర్వహిస్తున్నారు.

ఇరాన్, ఇరాక్‌లోని ఐదు నగరాల్లో ఏడు రోజులుపాటు అంత్యక్రియలు జరగనున్నాయి. ఖమేనీ పార్థివ దేహాన్ని ఆయన సొంత పట్టణం ఇరాన్‌లోని మషహద్‌లో ఈనెల 9న ఖననం చేయనున్నారు.





ఈరోజు ఆయన భౌతికకాయాన్ని ప్రజల సందర్శనార్థం ఉంచారు. ఆయనకు శ్రద్ధాంజలి ఘటించేందుకు వేలాదిగా ప్రజలు తరలివచ్చారు. వారంతా ప్రతీకారానికి గుర్తుగా ఎర్రజెండాలను పట్టుకొని.. 'డెత్ ఆఫ్ అమెరికా' అంటూ నినాదాలు చేసినట్టు మీడియా కథనాలు వెల్లడించాయి. కాగా.. ఖమేనీతో సన్నిహితంగా పనిచేసిన నాయకులు ఉద్వేగానికి గురయ్యారు. విదేశాంగమంత్రి అబ్బాస్ అరాగ్చీ, పార్లమెంట్ స్పీకర్ ఘాలిబఫ్ ఆయన్ను గుర్తుచేసుకొని కన్నీళ్లు పెట్టుకున్నారు.

**ట్రంప్ వ్యాఖ్యలు వివాదాస్పదం..**

ఈ సమయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌ను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేశారు. "ఇరాన్‌ను మేం చిత్తుగా ఓడించాం. దాంతో వారు రాజీకోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. మనం మంచివాళ్లం కాబట్టి.. అంత్యక్రియల కోసం వీకాఫ్ ఇచ్చాం" అని సౌత్ డకోటాలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు.

**కనిపించని మొజ్తాబా ఖమేనీ..**

కాగా అలీ ఖమేనీ అంత్యక్రియల్లో కుమారుడు మొజాబా ఖమేనీ కనిపించకపోవడం చర్చనీయాంశమైంది. యుద్ధం ప్రారంభమైన దగ్గరినుంచి బయటి ప్రపంచానికి కనిపించని ఆయన.. ఇప్పుడు తండ్రి అంత్యక్రియలకూ రాకపోవడం గమనార్హం. పశ్చిమాసియాలో నెలకొన్న అస్థిరతలతో భద్రతాపరమైన ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ఆయన తండ్రి అంత్యక్రియలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారని సమాచారం.

## అవన్నీ.. కల్పిత కథనాలు!

**ఇరాన్ దౌత్య బృంద హత్యకు కుట్ర వార్తలపై ఇజ్రాయెల్**



పశ్చిమాసియాలో శాంతి స్థాపనకు తుది ఒప్పందం ఖరారు దిశగా ప్రయత్నాలు జరుగుతోన్న వేళ.. ఇరాన్ ఉన్నతస్థాయి ప్రతినిధులే లక్ష్యంగా ఇజ్రాయెల్ హత్యాయత్నాలకు పాల్పడే అవకాశం ఉన్నట్టు వచ్చిన వార్తలు తీవ్ర చర్చనీయాంశ మయ్యాయి. దీనిపై ఇజ్రాయెల్ తాజాగా స్పందించింది. అవి అవాస్తవమంటూ ఖండించింది. "ఎప్పటిలాగే అమెరికా మీడియా నకిలీ వార్తను ప్రచురించింది. వాస్తవాలను పక్కనబెట్టి కల్పిత కథనాలు రాసింది" అని ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహు కార్యాలయం దుయ్యబట్టింది. అమెరికా–ఇరాన్ మధ్య పరోక్ష చర్చలు కొనసాగుతున్న సమయంలో.. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ, పార్లమెంట్ స్పీకర్ మహ్మద్ ఘాలిబఫ్ లక్ష్యంగా ఇజ్రాయెల్ దాడి చేసే అవకాశం ఉందని అమెరికా అధికారులు భావిస్తున్నట్టు అగ్రరాజ్య మీడియా కథనాలు పేర్కొన్నాయి. దాడుల నేపథ్యంలో ఇరాన్‌ను అప్రమత్తం చేయాలని గల్ఫ్ దేశాలను అమెరికా కోరినట్టు వార్తలొచ్చాయి. ఇరాన్ అధికారులపై హత్యాయత్నం జరిగితే శాంతి చర్చలు పూర్తిగా నిలిచిపోయి, ఇరు దేశాల మధ్య మళ్లీ ఉద్రిక్తతలు చెలరేగే ప్రమాదం ఉందని అమెరికా అధికారులు భావించినట్టు ఆ కథనాలు వెల్లడించాయి. ఇది కాస్తా చర్చనీయాంశంగా మారడంతో ఇజ్రాయెల్ స్పందించింది.

ఇదిలా ఉండగా.. అమెరికా–ఇరాన్ ప్రతినిధులు ఇటీవల దోహాలో రెండు రోజులపాటు పరోక్ష చర్చలు జరిపారు. హార్మూజ్ జలసంధిలో సముద్ర రవాణా భద్రత, ఫ్రీజ్ చేసిన ఇరాన్ ఆస్తుల విడుదలవంటి అంశాలపై ప్రధానంగా చర్చించినట్లు సమాచారం. ఇక తదుపరి విడత చర్చలు ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ ఖమేనీ అంత్యక్రియలు పూర్తయిన తర్వాత నిర్వహించనున్నట్టు ఖతార్ విదేశాంగ శాఖ వెల్లడించింది. దోహాలో చర్చలు సానుకూలంగా జరిగాయని, యుద్ధ విరమణ ఒప్పందం అమలుకు సంబంధించిన అంశాల్లో కొంత పురోగతి వచ్చిందని ఖతార్ పేర్కొంది.

## నాపై వచ్చిన వార్తలే ఇష్టంగా చదువుతా

**ఉషావాన్స్‌తో పాడ్‌కాస్ట్‌లో డొనాల్డ్ ట్రంప్**

తాను ఖాళీ సమయాల్లో ఎక్కువగా వార్తాపత్రికలే చదువుతానని, అందులోనూ తన గురించి వచ్చిన కథనాలే చూస్తానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. 'స్టోరీ టైమ్ విత్ సెకండ్ లేడీ' పేరిట అమెరికా ఉపాధ్యక్షుడి సతీమణి ఉషా వాన్స్ హోస్ట్ చేసిన పాడ్‌కాస్ట్‌లో అధ్యక్షుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైట్ హౌస్ హిస్టారికల్ అసోసియేషన్ ప్రచురించిన 'ప్రెసిడెంట్స్ ప్లే!' పుస్తకాన్ని చదివి వినిపించారు. అందులో ప్రస్తావించిన మాజీ అధ్యక్షుల ఆసక్తుల గురించి పేర్కొన్నారు. వైట్హౌస్ ప్రాంగణంలో నిర్మిస్తోన్న బాల్రూమ్ గురించి మాట్లాడారు. అమెరికా 250వ స్వాతంత్ర్య దినోత్సవం (జులై 4) సందర్భంగా ఈ పాడ్‌కాస్ట్ వీడియోను ఉష ఎక్స్ వేదికగా షేర్ చేశారు. ఈ 'ప్రెసిడెంట్స్ ప్లే!' పుస్తకంలో ఒక అధ్యక్షుడు వైట్ హౌస్‌లో సూపర్ బౌల్ (ఏటా జరిగే ఫుట్బాల్ ఛాంపియన్ షిప్) లైవ్ చూసిన ఫొటోను పొందుపర్చారు. ఆ దృశ్యాన్ని ట్రంప్ ఈ పాడ్‌కాస్ట్‌లో చూపిస్తూ.. "ఇది చూస్తే నాకు ఒక ఐడియా వచ్చింది. ఫుట్‌బాల్ చూసేందుకు బరాక్ ఒబామా, జో బైడెన్, బుష్ కుటుంబాలను ఆహ్వానిస్తే బాగుంటుందేమో. ప్రెసిడెంట్స్ రీయూనియన్ మాదిరిగా ఉంటుంది. అదే జరిగితే ప్రెస్ హోరెత్తుతుందేమో" అని సరదాగా అన్నారు. అమెరికాకు అధ్యక్షులుగా పనిచేసిన వారు ఖాళీ సమయంలో ఏమి చేసేవారో ట్రంప్ వెల్లడించారు.



"మామూలుగా ఒక అధ్యక్షుడు వైట్‌హౌస్‌లో గడిపే సమయం చాలా తక్కువ. ప్రజల కోసం పనిచేస్తాం కాబట్టి అక్కడ ఉండటం ఒక గౌరవం. బిల్ క్లింటన్ తన కోసం నిర్మించిన ట్రాక్‌పై జాగింగ్ చేసేవారు. ఈ విషయం నాకు ఇటీవలే తెలిసింది. నేనైతే అలా చేయలేను అనుకుంటా. క్లింటన్ మంచి మనిషి. ఆయనంటే నాకు ఇష్టమే" అంటూ కొనియాడారు.

## పాకిస్థాన్‌తో పోలికేంటి?

***చైనా మీడియాకు భారత దౌత్యవేత్త ఘాటు రిప్లై***

పశ్చిమాసియా సంక్షోభం వేళ అమెరికా–ఇరాన్ మధ్యవర్తిత్వంపై పాకిస్థాన్‌తో పోల్చడంపై చైనాలో భారత దౌత్యవేత్త విక్రమ్ దొరైస్వామి ఘాటుగా స్పందించారు. ఆ దేశంతో పోలిక అవసరం లేదన్న ఆయన.. అలా పోల్చడం ఆయా దేశాల ప్రయోజనాలకు మేలు చేస్తుందో? లేదో అనే విషయాన్ని వారే గ్రహించుకోవాలన్నారు. ఈ విషయంలో భారత్.. పాక్‌ను అనుసరించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. బీజింగ్‌లో జరుగుతున్న సదస్సులో దొరైస్వామి మాట్లాడుతూ.. అంతర్జాతీయ వ్యవహారాల్లో భారత్ పాత్ర, పాక్ మధ్యవర్తిత్వంపై ఓ చైనా పాత్రికేయుడు అడిగిన ప్రశ్నకు దీటుగా బదులిచ్చారు. "పాకిస్థాన్‌తో పోల్చడాన్ని అన్యాయంగానే భావిస్తున్నా. రెండు దేశాల ఆర్థిక వ్యవస్థలే మనకు చాలా విషయాలు చెబుతాయి. విస్తృత ప్రపంచ వ్యవస్థలో కొన్ని దేశాల స్థానం ఏంటి? వాస్తవానికి ఏం చేస్తున్నాయి? అనే విషయాన్ని గమనించాలి. ప్రపంచంతో భారత్‌కు ఉన్న సంబంధాలు చాలా దేశాలకు అందనంత స్థాయిలో ఉన్నాయి. ఐరోపా, ఆసియా దేశాలతో ఆర్థిక అంశాలతో పాటు శాంతి, భద్రతలకు సంబంధించిన కీలక సమస్యలకు సహకరించడానికి సిద్ధంగా ఉండటం వంటివి ఇందులో ఉన్నాయి" అని దొరైస్వామి తెలిపారు. 14వ ప్రపంచ శాంతి వేదిక సదస్సులో 'ప్రొటెక్షనిజం అండ్ గ్లోబల్ ఎకనామిక్ గవర్నెన్స్ ప్యానెల్'పై జరిగిన చర్చలో ఆయన ఈవిధంగా మాట్లాడారు.




## ఎగిరే గొడుగు!

**కెనడా ఇంజనీర్ అద్భుత ఆవిష్కరణ**

టొరంటో: ఎండైనా, వానైనా మీరు ఎక్కడికి వెళ్లినా మీ వెంటే మీ గొడుగు కూడా వస్తుంది. అది మీకు రక్షణగా నిలుస్తుంది. అదీ కూడా మీరు చేతితో పట్టుకోవాల్సిన అవసరం లేకుండా అంటే.. నిజమా అని ఆశ్చర్యం కలుగుతుంది కదా! కెనడాకు చెందిన ఇంజనీర్ జాన్ ట్సే ఎగిరే గొడుగును కనిపెట్టి పలువురి ప్రశంసలు అందుకున్నాడు. ఈ గొడుగు తయారీలో డ్రోన్ సాంకేతికతను వినియోగించాడు. గాలిలో ఎగిరేందుకు ఈ గొడుగుకు నాలుగు ప్రొఫెల్లర్లను అమర్చాడు. దీనిని సాధారణ గొడుగులాగే మడిచి మనతో తీసుకుపోవచ్చు. టైమ్–ఆఫ్–ఫ్లైట్ డెప్త్ కెమెరాను ఇందులో అమర్చడం వల్ల అది మనం నడిచే స్థితిని గమనించి తన పొజిషన్‌ను సరిచేసుకుంటుంది. కార్బన్–ఫైబర్ నైలాన్, 3డీ ప్రింటింగ్‌తో వీటి విడిభాగాలను తయారు చేశాడు. తొలుత ఇందులోని విడిభాగాలు తరచూ పగిలిపోతుండేవని, ఏడాదిపాటు పలుసార్లు దీనిపై ప్రయోగాలు చేసి చివరకు ఎగిరే గొడుగును లోపరహితంగా తయారు చేసినట్టు ఈ ఇంజినీర్ తెలిపాడు.



# ఫెదరర్ రికార్డును సమం చేసిన జకోవిచ్



టెన్నిస్ దిగ్గజం నొవాక్ జకోవిచ్ వింబుల్డన్‌లో మరో చారిత్రక ఘనత సాధించాడు. ఫ్రాన్స్‌కు చెందిన ఆర్థర్ రిండరక్నెక్‌పై మూడో రౌండ్‌లో 7-5, 6-4, 1-6, 7-6తో విజయం సాధిం చాడు. అయితే జకోవిచ్‌కు వింబుల్డన్ టోర్నీలో ఇది 105వ సింగిల్స్ మ్యాచ్ విజయం కావడం విశేషం. ఈ క్రమంలో పురుషుల విభాగంలో అత్యధిక విజయాలు సాధించిన రోజర్ ఫెదరర్ రికార్డును జకోవిచ్ సమం చేశాడు. మహిళల విభాగంలో మార్టినా నవ్రతిలోవా 120 సింగిల్స్ విజయాలతో అగ్రస్థానంలో కొనసాగుతోంది.

ఫ్రాన్స్‌పై విజయంతో జకోవిచ్ నాలుగో రౌండ్ కు అర్హత సాధించాడు. కాగా వింబుల్డన్‌లో 7 టైటిళ్లు సాధించిన జకోవిచ్.. ఫెదరర్ ఎనిమిది టైటిళ్ల రికార్డును కూడా సమం చేయాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నాడు. కాగా ఫెదరర్ రికార్డు గురించి మ్యాచ్ అనంతరం జకోవిచ్ మాట్లాడాడు. '105 విజయాలతో ఫెదరర్ రికార్డును సమం చేయడం గొప్ప గౌరవం గా భావిస్తున్నా. అయితే 106వ విజయం కోసం మా ఇద్దరి మధ్య మ్యాచ్ నిర్వహించాలని వింబుల్డన్ నిర్వాహకులను కోరుతున్నా' అంటూ జకోవిచ్ సరదాగా వ్యాఖ్యానించాడు. నాలుగో రౌండ్‌లో జకోవిచ్.. రష్యా క్వాలిఫయర్ రోమన్ సఫియులిన్‌తో తలపడనున్నాడు. మరోవైపు డిఫెండింగ్ ఛాంపి యన్ యానిక్ సినర్ 6-4, 6-3, 6-4తో జన్నన్ బ్రూక్స్‌బైను ఓడించి ప్రీక్వార్టర్స్‌కు చేరుకున్నాడు. తదుపరి మ్యాచ్‌లో జపాన్ క్వాలిఫయర్ షింటారో మొచిజుకిని ఎదుర్కొం టాడు.

**మహిళల విభాగంలో..**

మహిళల సింగిల్స్‌లో ప్రపంచ నంబర్-1 అరినా సబలెంకా.. జెలెనా ఒస్టాపెంకోపై 6-4, 6-4తో విజయం సాధించింది. మరోవైపు నాలుగు గ్రాండ్ స్లామ్‌ల విజేత నవోమి ఒసాకా 6-1, 6-3తో దారియా కసట్కినాను ఓడించి కెరీర్‌లో తొలిసారి వింబుల్డన్ నాలుగో రౌండ్‌కు చేరుకుంది. తదుపరి రౌండ్‌లో సబలెంకా-ఒసాకా మధ్య హోరాహోరీ పోరు జరగనుంది. అమెరికా స్టార్ కోకో గాఫ్ కూడా మూడో రౌండ్‌లో క్లేర్ లియూను 6-3, 6-7 (5), 6-2తో ఓడించి నాలుగో రౌండ్‌కు అర్హత సాధించింది. అలాగే జెసికా పెగులా, కరోలినా ముచోవా, గత ఏడాది ఛాంపియన్ బార్బోరా క్రెజికోవా కూడా తదుపరి దశకు చేరుకున్నారు.

# థ్రిల్లింగ్ మ్యాచ్‌లో అర్జెంటీనా విజయం

**ప్రీక్వార్టర్స్‌లోకి మరో రెండు జట్లు**

ఫిఫా ప్రపంచకప్-2026 రౌండ్ ఆఫ్-32లో డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా మరో విజయం సాధించింది. కేప్ వెర్దెతో జరిగిన మ్యాచ్‌లో అతి కష్టంగా గెలిచింది. 3-2 తేడాతో విజయం సాధించి రౌండ్ ఆఫ్-16కు అర్హత సాధించింది. అదనపు సమయం వరకు సాగిన ఈ మ్యాచ్‌లో అర్జెంటీనాకు పసికూన అయిన కేప్ వెర్దె గట్టి పోటీ ఇచ్చి అభిమానులను ఆశ్చర్య పరిచింది. మ్యాచ్ 29వ నిమిషంలో కెప్టెన్ లియోనెల్ మెస్సీ గోల్ చేసి అర్జెంటీనాకు 1-0తో ఆధిక్యం అందించాడు. ఈ గోల్‌తో మెస్సీ.. ఫిఫా ప్రపంచకప్ చరిత్రలో 20 గోల్స్ చేసిన తొలి పురుష ఫుట్‌బాల్ ఆటగాడిగా అరుదైన రికార్డు నెలకొల్పాడు. అయితే కేప్ వెర్దె ఆటగాడు డెరాయ్ దుర్తే 59వ నిమిషంలో గోల్ చేసి స్కోరును సమం చేశాడు. నిర్ణీత 90 నిమిషాల్లో ఫలితం తేలకపోవడంతో మ్యాచ్ అదనపు సమయానికి వెళ్లింది. 91వ నిమిషంలో లిసాం డ్రో మార్టినెజ్ అర్జెంటీనాకు మరోసారి ఆధిక్యం అందించాడు. ఆ తర్వాత వెర్దె ఆటగాడు లోపెస్ కబ్రాల్ అద్భుత గోల్‌తో మరోసారి స్కోరును 2-2గా మార్చాడు. దీంతో మ్యాచ్ మరింత ఉత్కంఠగా మారింది. 111వ నిమిషంలో మెస్సీ అందించిన అద్భుతమైన పాస్‌ను



క్రిస్టియన్ రొమెరో హెడ్డర్‌గా మలిచాడు. ఆ బంతి కేప్ వెర్దె ఆటగాడు డినే బోర్జెస్‌ను తాకి గోల్‌లోకి వెళ్లింది. ఆ గోల్ అర్జెంటీనాకు విజయాన్ని అందించింది. కాగా, ఈ మ్యాచ్‌లో అద్భుత పోరాట పటిమ ప్రదర్శించిన కేప్ వెర్దె టీమ్‌కు ప్రేక్షకులు స్టాండింగ్ ఒవేషన్ ఇచ్చారు. మరోవైపు ఆస్ట్రేలియాపై గెలిచిన ఈజిప్ట్, ఘనాతో జరిగిన మ్యాచ్‌లో విజయం సాధించిన కొలంబియా ప్రీక్వార్టర్స్‌కు చేరుకున్నాయి.

# ఇంగ్లండ్ ఆటగాళ్లకు వయాగ్రాకుఅనుమతి



ఫిఫా ప్రపంచకప్ 2026లో భాగంగా మెక్సికోతో జరిగే రౌండ్ ఆఫ్-16 మ్యాచ్‌కు ముందు వయాగ్రా వాడేందుకు ఇంగ్లండ్ ఆటగాళ్లకు ఆ జట్టు కోచ్ థామస్ టుచెల్ నుంచి అనుమతి లభించింది. అయితే ఇది లైంగిక సమస్యల కోసం కాదు.. మెక్సికో సిటీలోని ఎత్తైన ప్రాంత పరిస్థితులను ఎదుర్కొనేందుకే ఇంగ్లండ్ ఆటగాళ్లకు ఈ అనుమతి ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇంగ్లండ్-మెక్సికో మ్యాచ్ చారిత్రాత్మక 'ఎస్టాడియో అజ్టెకా' స్టేడియంలో జరగనుంది. ఈ స్టేడియం సముద్ర మట్టానికి సుమారు 2,240 మీటర్ల ఎత్తులో ఉంది. ఇంతటి ఎత్తులో సాధారణంగా గాలిలో ఆక్సిజన్ తక్కువగా ఉంటుంది. అలాంటి వాతావరణానికి అలవాటు పడలేని ఆటగాళ్లకు త్వరగా అలసిపోవడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, తలతిరగడం వంటి సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో వయాగ్రా కొంత వరకు సహాయపడగలదు. వయాగ్రాలో ఉండే 'సిల్డెనాఫిల్' అనే ఔషధం ఊపిరితిత్తుల రక్తనాళాలను వ్యాకోచింపచేసి రక్త ప్రసరణను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. దీంతో ఎత్తైన ప్రాంతాల్లో ఆక్సిజన్ వినియోగం కొంత మెరుగుపడే అవకాశం ఉంది. ఈ ఔషధం ప్రపంచ యాంటీ డోపింగ్ సంస్థ (వాడా) నిషేధిత జాబితాలో లేదు. దీంతో కొందరు ఆటగాళ్లు వయాగ్రాను ఉపయోగిస్తుంటారు. ఇంగ్లండ్ ఆటగాళ్లు తప్పనిసరిగా వయాగ్రా వాడతారని ఎలాంటి అధికారిక ప్రకటనా లేదు. ప్రధాన కోచ్ థామస్ టుచెల్ మెక్సికో సిటీలోని ఎత్తు ప్రభావాన్ని తగ్గించేందుకు అందుబాటులో ఉన్న అన్ని శాస్త్రీయ మార్గాలను పరిశీలిస్తున్నట్లు సమాచారం.

## కాబో వెర్డ్‌పై అశ్విన్ ప్రశంసలు



ఫిఫా ప్రపంచ కప్ 2026లో కాబో వెర్డ్ సంచలన ప్రదర్శనతో అందరి దృష్టిని ఆకర్షించింది. డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనాను వణికించింది. అతికష్టం మీద కాబో వెర్డ్‌పై 3-2 తేడాతో అర్జెంటీనా గెలిచింది. కాబో వెర్డ్ ఆటతీరు ఫుట్‌బాల్ అభిమానులనే కాదు.. క్రీడా ప్రపంచాన్ని కూడా ఆకట్టుకుంటుంది. రౌండ్ ఆఫ్ 32లో పోరాడి ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించినప్పటికీ.. ఆ దేశ ప్లేయర్లపై అందరూ ప్రశంసలు కురిపిస్తున్నారు. అయితే ఆ జట్టుపై టీమిండియా మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ కూడా ప్రశంసల జల్లు కురిపించాడు. 'కాబో వెర్డ్.. ఇకపై ఏం జరిగినా.. ఈ పేరును మాత్రం గుర్తుంచుకోండి. ఈ ప్రపంచ కప్‌లో ఆ జట్టు చూపించిన పోరాట పటిమ, ప్రదర్శన అద్భుతం' అంటూ అశ్విన్ ఎక్స్‌లో పేర్కొన్నాడు. ప్రస్తుతం అశ్విన్ పెట్టిన ఆ పోస్ట్ నెట్టింట వైరల్ అవుతోంది. అరంగేట్ర ప్రపంచ కప్‌లోనే కాబో వెర్డ్ అంచనాలకు మించి రాణించింది. యూరోపియన్ ఛాంపియన్ స్పెయిన్‌ను గోల్స్ లేకుండా నిలువరించడంతో పాటు సౌదీ అరేబియా, ఉరుగ్వేతో డ్రా చేసుకుని నాకౌట్ దశకు చేరుకుంది. రౌండ్ ఆఫ్ 32లో స్టార్ ప్లేయర్ మెస్సి సారథ్యంలోని అర్జెంటీనాకు గట్టి పోటీనిచ్చింది. 3-2 తేడాతో ఓడి టోర్నీ నిష్క్రమించినా.. తమ పోరాట పటిమతో ప్రపంచ వ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటోంది.

## టీ20 ప్రపంచకప్
# ఫైనల్లో ఇంగ్లండ్

**నేడు ఆస్ట్రేలియాతో టైటిల్‌పోరుకు రెడీ**



కెప్టెన్ నాట్ షివర్ బ్రంట్ (47 బంతుల్లో 11 ఫోర్లు, ఓ సిక్సర్‌తో 75) సూపర్ ఇన్నింగ్స్‌తో చెలరేగడంతో మహిళల టీ20 ప్రపంచకప్‌లో ఇంగ్లండ్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. రెండో సెమీ ఫైనల్లో ఇంగ్లండ్ 40 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాను చిత్తుచేసి.. ఆదివారం ఆస్ట్రేలియాతో జరిగే టైటిల్‌ఫైట్‌కు సిద్ధమైంది. మొదట ఇంగ్లండ్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 169 పరుగులు చేసింది. ఆరంభంలోనే 23/3తో ఇంగ్లండ్ కష్టాల్లో పడిన దశలో.. మాజీ సారథి హీథర్ నైట్ (58) జతగా బ్రంట్ నాలుగో వికెట్‌కు 133 పరుగుల కీలక భాగస్వామ్యం జోడించి జట్టును ఆదుకుంది. షబ్నిమ్ ఇస్మాయిల్, మ్లాబా చెరో 2 వికెట్లు తీశారు. ఛేదనలో ఓపెనర్ తజ్మిన్ బ్రిట్స్ (51) మినహా అంతా విఫలమవడంతో సఫారీలు 20 ఓవర్లలో 129/8 స్కోరుకే పరిమితమై ఓడారు. లారెన్ బెల్, చార్లీ డీన్ చెరో 2 వికెట్లు పడగొట్టారు. కెప్టెన్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్న బ్రంట్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికైంది.

# కాబో వెర్డ్‌పై పోరాడాం..గెలిచాం..



**విజయం తర్వాత మెస్సి భావోద్వేగ పోస్ట్**

ఫిఫా ప్రపంచ కప్‌లో అరంగేట్ర జట్టు కాబో వెర్డ్‌పై జరిగిన ఉత్కంఠభరిత పోరులో అర్జెంటీనా 3-2 తేడాతో పోరాడి గెలిచిం ది. దీంతో రౌండ్ 16కు అర్హత సాధించింది. పసికూన కాబో వెర్డ్ అద్భుత ఆటతీరుకు ఫుట్‌బాల్ ప్రపంచం ఆశ్చర్యపోయింది. డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనాకు ముచ్చెమటలు పట్టించింది. అయితే ఆఖరిలో అద్భుతంగా పుంజుకున్న అర్జెంటీనా.. కాబో వెర్డ్‌పై విజయం సాధించింది.

ఈ మ్యాచ్ అనంతరం ఫుట్‌బాల్ స్టార్ ప్లేయర్, అర్జెంటీనా కెప్టెన్ లియోనెల్ మెస్సి సోషల్ మీడియా వేదికగా భావోద్వేగంగా పోస్ట్ పెట్టాడు. 'ఈ మ్యాచ్ కష్టంగా ఉంటుందని అంచనా వేశాం. ఆ ఒత్తిడిని భరించి చివరికి విజయాన్ని సాధించాం. కాబో వెర్డ్‌పై పోరాడాం.. బాధను భరించాం.. చివరికి గెలిచాం. అయితే ఈ టోర్నీలో ఇంకా మా ప్రయాణం కొనసాగుతోంది' అంటూ మెస్సి తన ఇన్‌స్టా ఖాతాలో పోస్ట్ చేశాడు. కాగా చివరివరకూ అద్భుతంగా పోరాడిన కాబో వెర్డ్‌పై మెస్సి ప్రశంసల జల్లు కురిపించాడు. 'ప్రపంచ కప్‌లో ఏదీ తేలిగ్గా రాదు. కాబో వెర్డ్ ఈ టోర్నీలో అద్భుతంగా ఆడింది. ఇప్పుడు మాకు కాస్త విరామం దొరికింది. ఈ మ్యాచ్ నుంచి చాలా విషయాలు నేర్చుకున్నాం. తదుపరి పోరుపై దృష్టి పెడతాం' అని మెస్సి తెలిపాడు. కాగా ప్రీక్వార్టర్స్‌లో అర్జెంటీనా.. ఈజిప్ట్‌తో తలపడనుంది.

చైతన్య రథం
సినిమా
ఆదివారం 5 జూలై 2026 X

# ఓటీటీకి వడ్డే నవీన్ కంబ్యాక్ మూవీ




టాలీవుడ్ సినిమా దగ్గర ఒకప్పుడు ఫ్యామిలీ ఆడియెన్స్ మార్కెట్‌ని ఎంతగానో అలరించిన అతి కొద్దిమంది హీరోల్లో వడ్డే నవీన్ ఒకరు. అయితే ఎన్నో ఏళ్ల క్రితం సినిమాలకు దూరమైన తను.. మళ్లీ ఇన్నేళ్ల తర్వాత కంబ్యాక్ ఇస్తూ చేసిన లేటెస్ట్ సినిమానే "ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు". తనే నిర్మాతగా రాశిసింగ్ హీరోయిన్‌గా దర్శకుడు కమల్ తేజ తెరకెక్కించిన సినిమా కొన్ని వారాల కితమే విడుదలైంది. అయితే కంటెంట్ ప్లానింగ్ కరవై.. సినిమా పూర్తిస్థాయిలో సక్సెస్ కాలేకపోయింది. సోషల్ మీడియాలో మంచి క్రేజ్ ఉన్న వడ్డే నవీన్ సినిమా ఇప్పుడు ఓటీటీ ఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధమైంది. ఈ సినిమా హక్కులు ప్రముఖ ఓటీటీ సంస్థ జీ 5 సొంతం చేసుకున్నారు. జూలై 17నుంచి సినిమా అందుబాటులోకి రానుంది. సో అప్పుడు మిస్సైనవారుంటే ఇంకొన్ని రోజుల్లో "ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు" చిత్రాన్ని రిలాక్స్‌డ్‌గా ఇంట్లోనే చూడొచ్చు.

# ఔను! కండిషన్స్ అప్లై



*కథానాయికలు వృత్తిపరమైన బాధ్యతలతోపాటు వ్యక్తిగత జీవితానికీ సమయం కేటాయించడం చాలా ముఖ్యం. ముఖ్యంగా తల్లులైన తర్వాత ఈ బ్యాలెన్స్ మరింత అవసరం. ఈ నేపథ్యంలో బాలీవుడ్ స్టార్ దీపికా పదుకొణె 'ఎనిమిది గంటల పని' నిబంధనను తెరపైకి తెచ్చారు. తాజాగా ఆమె నిర్ణయానికి అగ్ర కథానాయిక కాజల్ అగర్వాల్ పూర్తి మద్దతు పలికారు. తన సినిమాల ఒప్పందాల్లోనూ ఇలాంటి షరతులే విధిస్తున్నట్టు కాజల్ వెల్లడించారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో కాజల్ మాట్లాడారు. పని గంటల విషయంలో తన నిబంధనలను వివరించారు. "నా సినిమా ఒప్పందాలల్లో నేను పని గంటలను స్పష్టంగా పేర్కొంటున్నాను. ఆదివారాలు షూటింగ్‌లో పాల్గొనని ముందే చెబుతున్నా. ఆ సమయాన్ని నా బిడ్డ కోసం కేటాయిస్తాను. గతంలోలాగా ఇప్పుడు ఏకధాటిగా పని చేయడం నావల్ల కాదు" అని ఆమె స్పష్టం చేశారు. కొత్తగా తల్లులైన వారికి సినీ పరిశ్రమలో మద్దతు లభిస్తోందా? అన్న ప్రశ్నకు కాజల్ బదులిచ్చారు. "పరిస్థితుల్లో నెమ్మదిగా మార్పు వస్తోంది. గొప్పస్థాయికి చేరుకోవడానికే ఇన్నేళ్లుగా కష్టపడుతున్నాం. ఇలాంటి చిన్న కోరిక కోరడంలో ఎలాంటి తప్పు లేదు. కార్పొరేట్ రంగంతోపాటు అన్నిచోట్లా ఈ విధానం ఉంది. మరి సినీ పరిశ్రమలో ఎందుకు ఉండకూడదు?" అని కాజల్ ప్రశ్నించారు. ప్రస్తుతం తాను ఎలాంటి ప్రాజెక్టులు ఎంచుకోవాలనే దానిపై స్పష్టతతో ఉన్నట్టు ఆమె తెలిపారు.*

# 9నుంచి ఓటీటీకి పెద్ది



రామ్‌చరణ్, జాన్వీకపూర్ జోడీగా దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కించిన బ్లాక్‌బస్టర్ ఎమోషనల్ స్పోర్ట్స్ డ్రామా "పెద్ది". మంచి అంచనాలుమధ్య బాక్సాఫీస్‌ని షేక్ చేసిన సినిమా ఫైనల్‌గా థియేట్రికల్ రన్ పూర్తి చేసుకుంది. సరిగ్గా నెల రోజులు క్రితం ఇదే డేట్‌లో విడుదలైన సినిమా.. ఇప్పుడు ఓటిటి డేట్‌ని ఫిక్స్ చేసుకుంది. తాజాగా పెద్ది డేట్‌ని నెట్‌ఫ్లిక్స్ అఫీషియల్‌గా ప్రకటించింది.

ఒక ఎమోషనల్ స్పోర్ట్స్ డ్రామాగా వచ్చిన పెద్ది.. జులై 9నుంచి అందుబాటులో ఉంటుందని నెట్ ఫ్లిక్స్ ప్రకటించింది. తెలుగుతోపాటు తమిళ, కన్నడ, మలయాళ భాషల్లోనూ సినిమా అందుబాటులో ఉంటుందని నెట్‌ఫ్లిక్ టీం కన్ఫర్మ్ చేసింది. అయితే, థియేటర్స్‌లో విడుదలైన తర్వాత మేకర్స్ రీఎడిట్ చేసిన వెర్షన్‌ని వదిలారు. అందులో కొన్ని ఎక్స్‌ట్రా సీన్స్ కూడా ఉన్నాయి. సో అదే ప్రింట్‌ని విడుదల చేస్తారా? లేదా అనేది మాత్రం ఇంకా క్లారిటీ లేదు. ఇక ఈ సినిమాకి ఏఆర్ రెహమాన్ సంగీతం సమకూరిస్తే.. వృద్ధి సినిమాస్ నిర్మించిన సంగతి తెలిసిందే.

# టాక్ షోతో సామ్ సన్నద్ధం?




తాజాగా 'మా ఇంటి బంగారం'తో భారీ విజయాన్ని అందుకున్న సామ్.. అదే సమయంలో మాతృత్వపు శుభవార్తనూ అభిమానులతో పంచుకుంది. ప్రెగ్నెన్సీ కారణంగా సమంత కొంతకాలం పూర్తిగా విశ్రాంతి తీసుకుంటారని అభిమానులు భావించినప్పటికీ, తాజా సమాచారం ప్రకారం ఆమె మరో కొత్త ప్రాజెక్ట్‌తో ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నట్టు సమాచారం. సమంత మరోసారి హోస్ట్‌గా మారనున్నట్లు కోలీవుడ్ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. గతంలో ప్రముఖ ఓటీటీ వేదిక కోసం చేసిన 'సామ్ జామ్' టాక్ షో ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. సినీ ప్రముఖులతో సమంత జరిపిన ఆసక్తికర సంభాషణలు ఆ షోకు మంచి ఆదరణ తీసుకొచ్చాయి. ఇప్పుడు ప్రముఖ ఓటీటీ సంస్థ సోనీలివ్ తమిళ్ కోసం సమంత ఓ ప్రత్యేక టాక్ షో చేయనున్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి. తాజాగా సోనీలివ్ తమిళ్ తమ సోషల్ మీడియా ఖాతాలో "సమంతతో కలిసి ఓ స్పెషల్ ప్రాజెక్ట్‌పై పని చేస్తున్నాం. త్వరలో పూర్తి వివరాలు వెల్లడిస్తాం" అంటూ చేసిన పోస్ట్‌ను సమంత కూడా తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో షేర్ చేయడంతో ఈ ప్రచారానికి మరింత బలం చేకూరింది. సామ్ హోస్టింగ్ స్టయిల్‌కు ఇప్పటికే మంచి గుర్తింపు ఉండటంతో, ఈ కొత్త షోపై కూడా ఆసక్తి నెలకొంది. టాక్ షో ఫార్మాట్‌లో ఎక్కువగా కూర్చుని సంభాషణలు సాగుతాయి కాబట్టి, ప్రెగ్నెన్సీ సమయంలో కూడా ఈ తరహా ప్రాజెక్ట్‌ను పూర్తి చేసే అవకాశం ఉందని చర్చ జరుగుతోంది. అయితే ఈ టాక్ షో ఎప్పుడు ప్రారంభమవుతుందనే విషయంపై మాత్రం ఇంకా అధికారిక సమాచారం వెలువడలేదు.

# అనిల్ ప్రాజెక్టుపై కీర్తి క్లారిటీ



ప్రతి సంక్రాంతికి ఒక సినిమాతో వస్తానంటూ దర్శకుడు అనిల్ రావిపూడి ఫుల్ జోష్‌లో సినిమాలు చేస్తున్నారు. ఇప్పుడు వెంకటేశ్, కల్యాణ్ రామ్ ప్రధానపాత్రల్లో ఆయన దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతోంది. ఈ సినిమాను ప్రకటించిన నాటినుంచి ఏదోక వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతూనే ఉంది. తాజాగా ఓ మలయాళ సినిమాకు రీమేక్‌గా ఈ చిత్రం రానుందంటూ వార్తలు వైరల్ కాగా.. నటి కీర్తి సురేశ్ ఈ వార్తలకు చెక్ పెట్టారు.

'వెంకీకళ్యాణ్5' పేరిట ప్రచారంలో ఉన్న సినిమాలో వెంకటేశ్‌కు జోడీగా కీర్తి సురేశ్ నటిస్తుండగా.. కల్యాణ్ రామ్ సరసన కృతిశెట్టి కనిపించనున్నారు. తాజాగా ఓ ఇన్‌స్టా పేజ్ దీనిపై అప్డేట్ అంటూ.. ఓ విషయాన్ని పంచుకుంది. ఈ సినిమా 2024లో విడుదలైన మలయాళ కామెడీ చిత్రం 'గురువాయూర్ అంబలనాదయిల్'కు రీమేక్‌గా రానున్నట్టు పోస్ట్ పెట్టింది. ఆ పోస్టుకు కీర్తి స్పందిస్తూ.. అది నిజం కాదన్నారు. దీంతో ఈ వార్తలకు చెక్ పెట్టినట్లైంది. ఇటీవలే ఈ సినిమా పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. రాయలసీమ నేపథ్యంలో అనిల్ మార్క్ కథ, హాస్యంతో రూపొందుతోంది. గతేడాది అనిల్–వెంకటేశ్ కాంబోలో పండక్కి వచ్చిన 'సంక్రాంతికి వస్తున్నాం' బాక్సాఫీస్ బరిలో భారీ విజయాన్ని అందుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు అదే జోష్ మరోసారి నవ్వులు పంచేందుకు ఈ సినిమాతో సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం సెట్స్‌పైన ఉన్న ఈ సినిమాకు జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం సమకూరుస్తున్నారు.

# సుదీర్ఘ విరామం తరువాత.. సెలీనా



బాలీవుడ్ నటి సెలీనా జైట్లీ 15 ఏళ్ల సుదీర్ఘ విరామం తరువాత పూర్తిస్థాయి పాత్రలో వెండితెరపై అలరించేందుకు సిద్ధమయ్యారు. చివరిసారిగా ఆమె 2011లో వచ్చిన కన్నడ చిత్రం 'శ్రీమతి'లో ఉపేంద్ర సరసన కథానాయికగా నటించారు. తాజాగా స్వామి వివేకానంద శిష్యురాలైన సిస్టర్ నివేదిత బయోపిక్‌తో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. 'ఏక్ దువా' లఘు చిత్రంతో జాతీయ పురస్కారం అందుకున్న రామ్‌కమల్ ముఖర్జీ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. స్వామి వివేకానంద ఆధ్యాత్మిక జీవితం నుంచి స్ఫూర్తిపొంది, ఆయన బాటలో నడిచిన సిస్టర్ నివేదిత పాత్రను పోషిస్తుండటంపై సెలీనా జైట్లీ ఆనందం వ్యక్తం చేశారు. తన కెరీర్లో ఇదో అర్థవంతమైన చిత్రంగా మిగిలిపోతుందన్నారు. బాల్యంలో తన తల్లి ద్వారా సిస్టర్ నివేదిత సేవల గురించి తెలుసుకున్నానని, ఇప్పుడు తెరపై ఆమె పాత్రలో కనిపించనుండటం మరపురాని అనుభవమని పేర్కొన్నారు. 15 ఏళ్లపాటు ఐరోపాలో గడిపిన తాను మళ్లీ మూలాలను వెతుక్కుంటూ మాతృదేశానికి తిరిగి వచ్చానని, సనాతన ధర్మంతో అనుసంధానమయ్యానని సెలీనా అన్నారు.

### ఎవరీ సిస్టర్ నివేదిత..?

ఐర్లాండ్‌లో 1867లో జన్మించిన సిస్టర్ నివేదిత అసలు పేరు మార్గరెట్ నోబెల్. 1895లో స్వామి వివేకానంద బోధనలకు ఆకర్షితురాలై భారత్‌కు వచ్చారు. 1898లో వివేకానందుడి శిష్యరికాన్ని స్వీకరించి సిస్టర్ నివేదితగా పేరు మార్చుకున్నారు. ఆధ్యాత్మికవేత్తగా, విద్యావేత్తగా, రచయిత్రిగా ఎంతోమందిని ప్రభావితం చేశారు. 43 ఏళ్ల వయసులో 1911లో ఆమె కన్నుమూశారు.